
www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
గురువారం 24 ఏప్రిల్ 2025
సంపుటి :06 సంచిక : 323 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH

## తెలంగాణలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- ఉత్తర తెలంగాణలో 45 డిగ్రీలకు చేరిక



2 లో..

## ఉగ్రమూకలు సైనిక్ దుస్తుల్లో వచ్చి కాల్పులు



- సైన్యాన్ని చూసి వణికిపోయిన బాధితులు
- పోల్చుకోలేక వదిలిపెట్టమని ప్రాధేయపడిన ఇల్లాలు
- బాధితులకు అండగా ఉంటామన్న హోంమంత్రి

**శ్రీనగర్,ఏప్రిల్23( వెలుతురు):** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం సమీప బైసరన్ లోయలో సైనికుల దుస్తుల్లో వచ్చిన అయిదుగురు ముష్కరులు మహిళలు, చిన్నారులను వదిలిపెట్టి పురుషులే లక్ష్యంగా దాడులు చేయడంతో 28 మంది పర్యటకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రూరమైన దాడిలో బయటపడిన బాధితులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. ఉగ్రదాడి సమాచారం అందుకున్న సైనికులు ఘటనా స్థలానికి వెళ్లి.. వారిని రక్షించడానికి ప్రయత్నిస్తుండగా అక్కడ ఉన్న పర్యటకులు.. వారు కూడా ఉగ్రవాదులే అనుకొని భయంతో వణికి పోయారు. సైనికుల దుస్తుల్లో రావడం వల్ల పర్యాటకులు ముందుగా ప్రమాదాన్ని గుర్తించలేదు. అందుకే సాయం చేయడానికి వచ్చిన అసలు భారత సైనికులను చూసి కూడా వణికిపోయారు. ఉగ్రవాదులు మళ్లీ





2 లో..

## జమ్ము కశ్మీర్ లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి బాధాకరం



- మంత్రి పొన్నం ప్రభాకర్
- జమ్మూ కాశ్మీర్ లో నిన్న జరిగిన ఘటన బాధాకరమైంది, దుఃఖ భరితమైంది
- ఇటువంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం రాజకీయాలకతీతంగా కఠినంగా వ్యవహరించాలి

2 లో..

## కాశ్మీర్ నుంచి పర్యాటకులు తిరుగుప్రయాణం

- శ్రీనగర్ నుంచి ప్రత్యేకంగా విమానాల ఏర్పాటు
- 6 గంటల వ్యవధిలోనే 3,300 మంది వెనక్కి
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి



**శ్రీనగర్,ఏప్రిల్ 23( వెలుతురు):** ప్రశాంతత చోటుచేసుకున్న కాశ్మీర్‌లో మరోమారు పర్యాటకులు వీడుతున్నారు. ఎంతో ఆనందంగా గడుపుదామని వచ్చిన యాత్రికులు ఇక్కడి నుంచి స్వస్థాలకు

2 లో..

## అందరి ఆమోదంతోనే భూభారతి

### భూముల సమస్యలకు చెక్ పెట్టేలా మార్పులు

### భూభారతి అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి

**సూర్యాపేట,ఏప్రిల్ 23( వెలుతురు):** భూ భారతి చట్టాన్ని అందరి ఆమోదంతోనే అమలు చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కొంతమంది వీఆర్వోలు కేసీఆర్ చెప్పిన పనులు చేయలేదని అర్ధరాత్రికి రాత్రి వీఆర్వో వ్యవస్థను రద్దు చేశారన్నారు. త్వరలో రెవిన్యూ వ్యవస్థలో జీపీఏ వ్యవస్థను తీసుకొస్తామని అన్నారు. జిల్లాలో జరిగిన భూభారతి అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. నూతనకల్ మండల కేంద్రంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏదైనా కొత్త చట్టం తీసుకొస్తే ప్రజలకు ఉపయోగపడాలి కాని భారంగా మారకూడదన్నారు.



దొరగారి గొప్పతనం ... స్వార్థంకోసం.. నలుగురు వ్యక్తులు.. నాలుగు గోడల మధ్య కూర్చొని ధరణి చట్టం తీసుకొచ్చారని.. ధరణి అమలు చేసే సమయంలో వంద రోజులు రిజిష్ట్రేషన్లు జరగలేదన్నారు. గత ప్రభుత్వంలో కబ్జా చేసిన ప్రభుత్వ భూములను.. అక్రమ పట్టాలను రద్దు చేస్తామన్నారు. భూభారతిపై రైతులు అవగాహన కల్పించేందుకే అవగాహన సదస్సులు ఏర్పాటు- చేస్తున్నామని.. భూభారతి చట్టంలో తహశీల్దార్ నుంచి సీసీఎల్ఏ స్థాయి

2 లో..



జమ్మూకాశ్మీర్ డీజీపీ నళిని ప్రభాత్ కు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫోన్

జమ్మూకాశ్మీర్ లో పర్యాటకుల భద్రతపై ఆరా...

పర్యాటకులకు పూర్తిస్థాయి రక్షణ కల్పించాలని కోరిన బండి సంజయ్

టూరిస్టుల భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు వెల్లడించిన డీజీపీ

టూరిస్టులెవరూ ఆందోళనలకు గురికావొద్దని కోరిన బండి సంజయ్

జమ్మూకాశ్మీర్ లోని హెూటళ్ల యజమానులతోనూ ఫోన్ లో మాట్లాడిన కేంద్ర మంత్రి

ఉగ్రవాదాన్ని కుకటి వేళ్లతో పెకలించి వేసేందుకు కేంద్రం కట్టుబడి ఉందని వెల్లడి


జమ్మూకాశ్మీర్ లో పరిస్థితిపై కేంద్ర హెూంమంత్రిత్వ శాఖ కార్యాలయం నుండి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న బండి సంజయ్

న్యూఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 23:

## ఉగ్రవాదులను ఊరికే వదలం

- తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు
- ఘాటుగా హెచ్చరించిన రాజ్‌నాథ్ సింగ్

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 23(వెలుతురు):** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యటకులపై జరిగిన ఉగ్రదాడి ఘటనకు బదులు తీర్చుకుంటామని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్‌పై కుట్ర పన్నుతున్న వారిని ఊరికే వదలబోమన్నారు. దాడికి భారత్ గట్టిబదులిస్తుందని



2 లో..

## కాశ్మీర్ నరమేధంపై సుప్రీం ఆగ్రహం

- ఉగ్రవాదుల పిరికి చర్యగా పేర్కొన్న ధర్మాసనం
- మృతుల కుటుంబాలకు ఘనంగా నివాళి



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 23( వెలుతురు):** పహల్గాం ఉగ్రదాడిని సుప్రీంకోర్టు తీవ్రంగా ఖండించింది. పర్యాటకులపై జరిగిన దాడిని 'ఉగ్రవాదుల పిరికి చర్య'గా పేర్కొంది. దాడిలో క్రూరంగా, అకాలంగా హత్యకు గురైన వారికి కోర్టు నివాళు లర్పించింది. కుటుంబసభ్యులకు సానుభూతి ప్రకటించింది. ఈ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టు ఫుల్ బెంచ్

2 లో..

## జనతా గ్యారేజ్‌లా తెలంగాణ భవన్

- బాధితులకు అండగా గులాబీ జెండా
- రజతోత్సవ వేడుక ఏర్పాట్లను పరిశీలించిన కెటిఆర్
- కాశ్మీర్ ఉగ్రదాడి మృతులకు నివాళి

**వరంగల్,ఏప్రిల్ 23( వెలుతురు):** తెలంగాణ భవన్ ఒక జనతా గ్యారేజ్‌లా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బాధితులకు అండగా నిలిచేది గులాబీ జెండా ఒక్కటే అని తెలిపారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27వ తేదీన బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడి ఘటనలో మరణించిన భారతీయులకు సభా



2 లో..

## ఉగ్రదాడి తీవ్రంగా కలచివేసింది

- భారత్ ఐక్యతను విచ్ఛిన్నం చేసే కుట్ర
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**అమరావతి,ఏప్రిల్ 23( వెలుతురు):** పహల్గాం సమీప బైసరన్ లోయలో జరిగిన ఉగ్రదాడి తనను తీవ్రంగా కలచివేస్తోందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఉగ్రదాడి మృతుల కుటుంబాలకు జనసేన అధినేత ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో అందరం దృఢంగా ఉందాం అని,



2 లో..

## వీరయ్య చౌదరికి సిఎం చంద్రబాబు నివాళి

- అంత్యక్రియల్లో పాల్గొన్న సిఎం, మంత్రులు
- హంతకులను వదిలేది లేదని హెచ్చరిక
- కత్తిపోట్లను చూస్తే ఇంత దారుణంగా హత్యచేస్తారా అనిపించింది
- ఎక్కడున్నా పట్టుకుని శిక్షిస్తామని వెల్లడి
- చౌదరి కుటుంబానికి అండగా ఉంటామని హామీ



**ఒంగోలు,ఏప్రిల్ 23( వెలుతురు):** దారుణ హత్యకు గురైన తెదేపా నేత, మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి భౌతికకాయానికి సీఎం చంద్రబాబు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి.. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఒంగోలులో తెదేపా నేత వీరయ్య చౌదరి మంగళవారం హత్యకు గురైన విషయం తెలిసిందే. దీంతో నాగులుప్పలపాడు మండలంలోని అమ్మనబ్రోలుకు చేరుకున్న సీఎం చంద్రబాబు.. వీరయ్య చౌదరి అంత్యక్రియల్లో పాల్గొననున్నారు. సీఎం వెంట మంత్రులు అనిత, ఆనం, డోలా, ఎంపీ మాగుంట, పలువురు ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒంగోలులో టీడీపీ నేత హత్య తీవ్ర కలకలం రేపింది. టీడీపీ నేత, మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి దారుణహత్యకు గురయ్యారు. మంగళవారం రాత్రి 7.30 గంటల సమయంలో ఒంగోలు బైపాస్ రోడ్డులో తన కార్యాలయంలో ఉన్న వీరయ్యని దుండగులు కత్తులతో విచక్షణారహితంగా పొడిచి చంపారు.

2 లో..

## ఎపి టెన్త్ ఫలితాలు విడుదల

- ఫలితాలు విడుదల చేసిన మంత్రి లోకేశ్
- 81.14 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత
- 1,680 పాఠశాలలు 100 శాతంఫలితాలు
- 93.90 శాతం ఉత్తీర్ణతతో తొలి స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా




2 లో..




## ఉగ్రదాడికి నిరసనగా వైసిపి క్యాండిల్ ర్యాలీ

- జగన్ పిలుపుతో కొవ్వొత్తుల ప్రదర్శన
- దాడిని తీవ్రంగా ఖండించిన మాజీసిఎం జగన్

**అమరావతి,ఏప్రిల్ 23( వెలుతురు):** పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా వైఎస్సార్‌సీపీ తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శాంతి ర్యాలీ చేపట్టింది. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ లో పాల్గొన్నారు.

2 లో..

(మొదటి పేజీ తరువాయి..)

## తెలంగాణలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్,ఏప్రిల్ 23( వెలుతురు):**
తెలంగాణలో భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. ఉత్తర తెలంగాణ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, కొమరం భీమ్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు రెడ్అలర్ట్ ప్రకటించింది. రెడ్ అలర్ట్ ఉన్న జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు- వాతావరణ శాఖ పేర్కొంది. రెడ్ అలర్ట్ జారీ చేసిన తొమ్మిది జిల్లాలు మినహా మిగిలిన జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రాత్రి కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వడగాల్పుల ప్రభావం ఉందని.. ఆదిలా బాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కామారెడ్డి, మెదక్ మహబూబ్‌నగర్ జిల్లాలకు వడ గాల్పుల హెచ్చరికలను వాతావరణ శాఖ జారీ చేసింది.

## జమ్ము కశ్మీర్ లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి బాధాకరం

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23:**
దేశంలో వివిధ అంశాల మీద బేధాభిప్రాయాలు ఉంటాయి కావచ్చు కానీ దేశ అంతర్గత భద్రతకు సంబంధించి అంతర్జాతీయ అంశాలకు సంబంధించి వచ్చినప్పుడు అందరూ ముక్తకంఠంతో అందరం ఏకాభిప్రాయంతో ఉంటాం కేంద్ర ప్రభుత్వానికి ఈ అంశంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా అండగా ఉంటుంది ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్న ఈ సంఘటన తలవంచుకునే కార్యక్రమం.. మూడు రోజుల క్రితం ఈ ప్రాంతానికి పోయి వచ్చిన టూరిస్ట్ లు ఎవరైనా రావచ్చు అని అక్కడి స్థానికులు చేస్తున్నారు..టూరిస్ట్ లు వస్తేనే మాకు ఉపాధి అని తెలిపారు టూరిస్టులకు స్థానికులు సహకరిస్తున్నారు ఈ దుశ్చర్యం వల్ల ఆ వర్గానికి సంబంధించిన వారి ఉపాధి అవకాశాలు దెబ్బతీసినట్టే 15 లక్షల మంది 15 రోజుల్లో అక్కడ విజిటింగ్ చేశారు శాంతి భద్రతల సమస్య వస్తె అక్కడికి టూరిస్ట్ లు రారు.. ఇది జమ్మూ కాశ్మీర్ స్థానికులకే ఇబ్బంది .. వాళ్ళ కడుపు కొట్టినట్టే. కేంద్రం ఎటువంటి సంకోచం లేకుండా కఠినంగా వ్యవహరించాలనీ కోరుతున్న మృతుల కుటుంబాలకు సంతాపాన్ని వ్యక్తం చేస్తున్న..

## కాశ్మీర్ నుంచి పర్యాటకులు తిరుగుప్రయాణం

బయలుదేరరు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యటకులపై జరిగిన భీకర ఉగ్రదాడి భయభ్రాంతులకు గురిచేసింది. ఈ ఘటన తో వణికిపోయిన పర్యాటకులు వీలైనంత త్వరగా ఆ ప్రాంతాన్ని వీడుతున్నారు. ఇప్పటికే వేల సంఖ్యలో ప్రజలు సొంత ప్రాంతాలకు తిరుగు ప్రయాణమయ్యారు. కేవలం 6 గంటల వ్యవధిలోనే 3,300 మంది శ్రీనగర్‌ను వీడినట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఉగ్రదాడి నేపథ్యంలో శ్రీనగర్ నుంచి పర్యటకుల సురక్షిత ప్రయాణం కోసం అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. విమానాశ్రయంలో రద్దీ దృష్ట్యా ప్రత్యేక సదుపాయాలు కల్పించాం. ఆహారం, నీరు అందించాం. బుధవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీనగర్ ఎయిర్‌పోర్టు నుంచి 20 విమానాలు వెళ్లాయి. 3,337 మంది పర్యటకులు ఈ ప్రాంతాన్ని వీడారని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ప్రయాణికుల సౌకర్యం కోసం అదనపు విమానాలు అందుబాటులో ఉంచాం. టికెట్ ధరలు పెంచొద్దని విమానయాన సంస్థలను ఆదేశించాం. ఇప్పటికే అన్ని ఎయిర్‌లైన్లు టికెట్ క్యాన్సిలేషన్, రీషెడ్యూల్ ఛార్జీలను రద్దు చేశాయి. ఈ విపత్కర పరిస్థితుల్లో మనమంతా పర్యటకులకు అండగా నిలవాలని కేంద్రమంత్రి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మరోవైపు తాజా పరిణామాలపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి స్పందించారు. కశ్మీర్ లోయ నుంచి అతిథులు వీడుతుంటే నా హృదయం ద్రవిస్తోందని అన్నారు. అయితే వారు ఎందుకు వెళ్లిపోవాలనుకుంటున్నారనేది నేను అర్థం చేసుకోగలను. పర్యాటకుల తిరుగు ప్రయాణం కోసం అన్ని ఏర్పాట్లు- చేస్తున్నాం. కేంద్రం కల్పించిన అదనపు విమానాలతో పాటు- రోడ్డు మార్గంలోనూ ప్రయాణ సౌకర్యాలు కల్పించాం అని సీఎం వెల్లడించారు. కశ్మీర్‌లో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు మంగళవారం భీకర దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. మధ్యాహ్నం 3గంటల సమయం సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు పర్యాటకులను చుట్టు-ముట్టి.. అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు గాలింపు చేపట్టాయి. మృతుల కుటుంబాలకు జమ్మూకశ్మీర్ ప్రభుత్వం రూ.10లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించింది. జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా మాట్లాడుతూ.. పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన దాడి పిరికిపంద చర్యగా ఆయన అభివర్ణించారు. ఈ ఉగ్రవాద దాడిని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. అత్యంత దారుణమైన ఈ దాడి వెనుక ఉన్న వారిని వదిలిపెట్టబోమని ప్రజలకు హామీ ఇస్తున్నాని స్పష్టం చేశారు. డీజీపీతోపాటు- భద్రతా అధికారులతో ఈ అంశంపై మాట్లాడానన్నారు. ఆర్మీ, జమ్మూ కాశ్మీర్ పోలీసు బృందాలు ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్నాయని వివరించారు. తన మరో ఎక్స్ ఖాతా ద్వారా లెఫ్టినెంట్ జనరల్‌ఎల్జీ సిన్హా మాట్లాడుతూ.. ఉగ్రవాదులను తటస్థీకరించడానికి ఉగ్రవాద నిరోధక ఆపరేషన్ ప్రారంభించామన్నారు. యావత్ దేశమంతా కోపంగా ఉందని చెప్పారు. తమ దళాలు రక్తం కారుస్తున్నాయని చెప్పారు. పహల్గామ్ దాడికి పాల్పడిన వారు.. భారీ మూల్యం చెల్లించు కుంటారని తాను దేశానికి హామీ ఇస్తున్నానని పేర్కొన్నారు.

## ఉగ్రవాదులను ఊరికే వదలం

ఉగ్రవాదులను హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడి పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఉగ్రదాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించాలనేది భారత్ విధానమని.. ఉగ్రవాదులను ఎదుర్కొనే విషయంలో దేశ ప్రజలంతా ఐక్యంగా ఉన్నారని పేర్కొన్నారు. తమ కుటుంబసభ్యులను కోల్పోయిన బాధిత కుటు-ంబాలకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. దాడికి పాల్పడిన వారిని..కుట్ర పన్నిన వారిని బయటకు లాగి, తగిన బుద్ధి చెబుతామని అన్నారు. పహల్గాం ఘటనకు సంబంధించిన విషయాలు, శ్రీనగర్‌లో భద్రతా చర్యలు వంటి వాటి గురించి ఆయన ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠితో చర్చలు జరిపిన అనంతరం ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరగనున్న భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ- సమావేశంలోనూ ఆయన పాల్గొననున్నారు. కశ్మీర్‌లో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు మంగళవారం భీకర దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. మధ్యాహ్నం 3 గంటల సమయంలో సైనిక దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు పర్యటకులను చుట్టు-ముట్టి.. అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 28 మంది ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఈ ఘటన అనంతరం అడవుల్లోకి పారిపోయిన ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు ముమ్మర గాలింపుచర్యలు చేపట్టాయి.

## కాశ్మీర్ నరమేధంపై సుప్రీం ఆగ్రహం

బుధవారం ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. బాధితులకు, వారి కుటుంబాలకు సంఘీభావం తెలిపేందుకు కోర్టు కాంప్లెక్స్‌లో జడ్జీలు, న్యాయవాదులు, సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ బుద్ధిహీనమైన హింసాత్మక చర్య అందరి మనస్సాక్షిని కదలించింది. ఉగ్రవాదపు క్రూరత్వం, అమానవీయతకు గుర్తుగా మిగిలిందని తీర్మానంలో పేర్కొంది. 'మృతిచెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటు-న్నాం. బాధితులు, కుటుంబాలకు దేశం అండగా నిలుస్తుంది. భారతదేశానికి మకుటాయ మానంగా నిలిచే కాశ్మీర్‌లోని సహజ సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్న పర్యాటకులపై జరిగిన ఈ దాడి నిస్సందేహంగా మానవత్వ విలువలకు, జీవిత పవిత్రతకు అవమానకరం. దాడిని కోర్టు తీవ్రంగా ఖండిస్తుందని తీర్మానంలో పేర్కొంది. ఉగ్రదాడులకు గురయ్యే కొండ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాలను సందర్శించే పర్యాటకుల భద్రత కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని, జమ్ముకాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతాన్నిఆదేశించాలని కోరుతూ న్యాయవాది విశాల్ తివారీ సుప్రీంకోర్టులో పిల్‌ను దాఖలు చేశారు.

## ఉగ్రదాడి తీవ్రంగా కలచివేసింది

మన భారత ఐక్యతను ఉగ్రవాదం విచ్ఛిన్నం చేయలేదని పేర్కొన్నారు. ఉగ్రదాడిలో మరణించిన వారి గౌరవార్థం జనసేన పార్టీ తెలుగు రాష్ట్రాల్లో మూడు రోజుల పాటు సంతాప దినాలను పాటిస్తుందని పవన్ కల్యాణ్ చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో బైసరన్ లోయలోకి సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు.. పర్యాటకులపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 30 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఉగ్రదాడిని ఖండిస్తూ మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో పార్టీ జెండాను పవన్ కల్యాణ్ అవనతం చేశారు. 'పహల్గాంలో జరిగిన దాడి నన్ను తీవ్రంగా కలచివేస్తోంది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. చనిపోయిన వారి గౌరవార్థం జనసేన పార్టీ తెలుగు రాష్ట్రాల్లో మూడు రోజుల పాటు- సంతాప దినాలను పాటిస్తుంది. పార్టీ జెండాను అవనతం చేస్తున్నాం. ఈ క్లిష్ట సమయంలో అందరం దృఢంగా ఉందాం, మన భారత ఐక్యతను ఉగ్రవాదం విచ్ఛిన్నం చేయలేదు. ఎప్పటి-కై-నా న్యాయమే గెలుస్తుంది. ఇలాంటి దారుణాలు మరలా జరగకుండా చూడాలి. భారత సాయుధ దళాలపై పూర్తి నమ్మకం ఉంది.

# ఉగ్రమూకలు సైనికి దుస్తుల్లో వచ్చి కాల్పులు

**(మొదటి పేజీ తరువాయి..)**
ఆర్మీ దుస్తుల్లో తమపై దాడి చేయడానికి వచ్చారేమో అనుకొని సైనికులను చూసిన ఓ మహిళ తన చిన్నారిని ఏమీ చేయొద్దని బోరున విలపిస్తూ.. చేతులు జోడించి వారిని వేడుకుంది. ఇతర పర్యటకులు కూడా భయంతో తమ పిల్లలను దాచడానికి ప్రయత్నించారు. ఓ సైనికుడు వారికి ధైర్యం చెప్తూ.. తాము భారత ఆర్మీ నుంచి.. మిమ్మల్ని రక్షించడానికే ఇక్కడికి వచ్చామని భరోసా ఇచ్చారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఉగ్రవాద దాడిలో తన భర్త మరణాన్ని చూసి షాక్‌కు గురైన ఆ మహిళ అందులో నుంచి బయటకు రాలేకపోతున్నారని.. ఆ బాధలో రోదిస్తూనే ఉన్నారని భద్రతా బలగాలు పేర్కొన్నాయి. కశ్మీర్‌లో పౌరులపై జరిగిన అత్యంత దారుణమైన ఉగ్రదాడుల్లో ఇది ఒకటి. పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత 'లష్కరే తయ్యిబా' అనుబంధ విభాగం 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్' ఈ మారణహోమానికి తెగబడినట్లు ప్రకటించుకుంది. సైనికుల దుస్తుల్లో వచ్చిన అయిదుగురు ముష్కరులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని తెలుస్తోంది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఈ దారుణం చోటుచేసుకుంది. దుండగులు అతి సమీపం నుంచి తుపాకులు ఎక్కుపెట్టి తూటాల వర్షం కురిపించారు. మహిళలు, చిన్నారులను వదిలిపెట్టి పురుషులే లక్ష్యంగా దాడి చేశారు. 28 మంది పర్యటకులు ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. కాల్పుల శబ్దం విని అప్రమత్తమైన భద్రతా బలగాలు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని ఉగ్రవాదుల కోసం వేట మొదలుపెట్టాయి. ప్రధాని మోదీ సూచన మేరకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మంగళవారం రాత్రి శ్రీనగర్‌కు చేరుకున్నారు. మృతుల్లో ఇద్దరు విదేశీయులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

# జనతా గ్యారేజ్‌లా తెలంగాణ భవన్

**(మొదటి పేజీ తరువాయి..)**
ప్రాంగణం వద్ద రెండు నిమిషాల పాటు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఒక ఉద్యమ సంస్థగా ఏర్పడి.. బోధించు, సమీకరించు, పోరాడు అనే ప్రజాస్వామ్య పద్ధతిలో తెలంగాణను సాధించాలనే నినాదంతో పురుడు పోసుకుంటున్న సంస్థ టీఆర్ఎస్ అని తెలిపారు.హిమాలయాల స్థాయికి తెలంగాణను తీసుకొచ్చి పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతను అద్భుతంగా నిర్వహిస్తున్న పార్టీ బీఆర్ఎస్ అని తెలిపారు. దేశం మొత్తంలో గుర్తింపు తెచ్చుకున్న పార్టీ బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల గుండె ధైర్యం గులాబీ జెండా అని చెప్పారు. రాష్ట్రంలో ఏ వర్గ ప్రజలకు కష్టమొచ్చినా తెలంగాణ భవన్‌కు వస్తున్నారని అన్నారు. జనతా గ్యారేజీ మాదిరిగా ప్రజల కోసం పనిచేస్తున్న పార్టీ బీఆర్ఎస్ అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజలందరూ గులాబీ జెండాకు జై కొడుతున్నారని చెప్పారు. రజతోత్సవ సభకు వరంగల్ వేదిక కావడం గర్వకారణమని కేటీఆర్ అన్నారు. ఎల్కతుర్తి సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా వెయ్యి ఎకరాల్లో పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు- చేశామని చెప్పారు. 30-40 వేల వాహనాలు వచ్చినా ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. 10 లక్షల వాటర్ బాటిల్స్, మజ్జిగ ప్యాకెట్లు-, వెయ్యికి పైగా వైద్య బృందాలు, 20 అంబులెన్స్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఇంత చక్కటి ఏర్పాట్లు చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటు మీద నమ్మకం లేదని కేటీఆర్ అన్నారు. అందుకే సభ కోసం 200 జనరేటర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులందరూ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ చరిత్రలోనే ఎల్కతుర్తి సభ భారీ బహిరంగ సభగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను చూడాలె... ఆయన మాట వినాలని ప్రజలు ఉర్రూతలు ఊగుతున్నారని అన్నారు. బండి ఎనక బండి గట్టి పద్ధతిలో పెద్ద ఎత్తున సూర్యాపేట రైతన్నలు వస్తున్నారని తెలిపారు. సభ కోసం 2వేల మంది వాలంటీ-ర్లు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నెల 27న 12796 గ్రామ పంచాయతీల్లో గులాబీ జెండాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కదం తొక్కిన ఉత్సాహంతో ఛలో వరంగల్ సభకు చేరుకుందామని అన్నారు. కాంగ్రెస్ అరాచక పాలనను వరంగల్ సభలో ఎండగడుదామని అన్నారు.11 ఏళ్లుగా బీజేపీ తెలంగాణకు అన్యాయం చేస్తుందని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ సందేశాన్ని గులాబీ సైనికులు ప్రతి గ్రామానికి చేర్చాలని సూచించారు.

# అందరి ఆమోదంతోనే భూభారతి


**(మొదటి పేజీ తరువాయి..)**
వరకు సమస్యలు పరిష్కరించేందుకు వెసులుబాటు కల్పిస్తామన్నారు. భూమి రిజిస్ట్రేషన్ కు ముందు తప్పనిసరిగా భూ సర్వే చేసి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుదని.. భూభారతి పోర్టల్ లో అన్ని సమస్యలకు స్వయంగా దరఖాస్తు చేసుకునేలా రూపొందించారు. భూమిలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్నారు. భూ సమస్యలు పరిష్కరించేందుకు అధికారులే ప్రజల వద్దకు వస్తారని.. భూములున్న ఆసాములు, రైతులు తమ భూమి భద్రంగా ఉందని గుండెపై చేయి వేసుకుని నిద్దురపోవాలన్న లక్ష్యంతో భూభారతి రూపొందించామన్నారు. రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో భూభారతి పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్నామని, ఒక్క రూపాయి ఫీజు లేకుండా భూ సమస్యలను పరిష్కరిస్తామని.., అధికారులనే క్షేత్రస్థాయికి పంపిస్తున్నామన్నారు. నెలాఖరులోగా నాలుగు మండలాల్లో అన్ని వివరాలు సేకరించి, జూన్ 2న పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నా రు. మే1వ తేదీ నుంచి మరో 28 జిల్లాల్లో ఒక్కో మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకుని భూభారతిని అమలు చేస్తామన్నారు. పైలెట్ మండలాల్లో క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యల పరిష్కారంకోసం ఏమైనా సూచనలు వస్తే నియమనిబంధనల్లో మార్పులు, చేర్పులు చేస్తామన్నారు. గత ప్రభుత్వం అనాలోచనతో 2020 ధరణి చట్టాన్ని తీసుకొచ్చి... ప్రజలకు అనేక ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ధరణి చట్టాన్ని తీసుకొచ్చిన మూడేళ్ల వరకు నియమ నిబంధనలు రూపొందించలేదని... విధివిధానాలు స్పష్టంగా తెలియజేయలేదని.. కేసీఆర్ నోట ఏది వస్తే ఆ మాట ప్రకారమే నడుచుకుందన్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందుల నుంచి విముక్తి చేసేందుకు ఇందిరమ్మ రాజ్యంలో 2025లో భూభారతి చట్టాన్ని తెచ్చామన్నారు. ఏ చట్టమైన ప్రజలకు చుట్టంలాగా, భద్రత కల్పించేలా ఉండాలే తప్ప ప్రజలకు శాపంగా మారకూడదన్నారు. ధరణి పేరుతో భూములు లాక్కున్న వారిపై చర్య లు ఉంటాయని, రాష్ట్రంలో అన్ని రెవెన్యూ గ్రామాలకు అధికారులను నియమిస్తామని మంత్రి తెలిపారు. మే10వ తేదీలోగా సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలే మండలాలకు వస్తారని తెలిపారు. గ్రామాల్లో భూదాన్, వక్ఫ్, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే నేరుగా ఫిర్యా దు చేసే అవకాశం ఈ చట్టంలో ఉందని, ఇందుకు సంబంధించిన సమాచారం రెవెన్యూ మంత్రి, కార్యదర్శి వద్దే ఉంటు-ందన్నారు. అధికారులు ఉద్దేశ్యపూర్వకంగా తప్పులు చేస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సాదాబైనామాలన కింద ఆన్‌లైన్‌లో ఉన్నటు-వంటి అర్హత గల దరఖాస్తులను పరిష్కరిస్తామన్నారు. మే నెల నుంచి ఇళ్లను ప్రారంభించేందుకు ప్రొసిడింగ్స్ అందిస్తామన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్నా ప్రభుత్వం రైతుభరోసా, రుణమాఫీ, మహాలక్ష్మి, సబ్సిడీగ్యాస్, సన్నబియ్యం పంపిణీ, ఆరోగ్యశ్రీ, రాజీవ్ యువ వికాసం, తదితర పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు.సదస్సులో మంత్రి పొంగులేటితో పాటు- , భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు, కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ పాల్గొన్నారు.

# ఎపి టెన్త్ ఫలితాలు విడుదల

**అమరావతి,ఏప్రిల్ 23( వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ టెన్త్ ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ఈ సంవత్సరం 6,14,459 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 4,98,585 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. 81.14 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలియజేశారు. పార్వతీపురం మన్యం జిల్లా 93.90 శాతం ఉత్తీర్ణతతో తొలి స్థానంలో ఉందని అన్నారు. 1,680 పాఠశాలలు 100 శాతంఫలితాలు సాధించాయని ఆయన ప్రశంసించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ మంత్రి లోకేష్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విజయం సాధించని విద్యార్థులు నిరుత్సాహపడవద్దని, జీవితంలో రెండో అవకాశం కూడా ఉంటుందని చెప్పారు. సప్లిమెంటరీ పరీక్షలు మే 19 నుంచి 28 వరకు జరుగుతాయని, విజయం సాధించడానికి మరొక అవకాశాన్ని అందిస్తున్నామని లోకేష్ వివరించారు. ఫలితాల్లో 93.90 శాతం ఉత్తీర్ణతతో పార్వతీపురం మన్యం జిల్లా అగ్రస్థానంలో ఉండగా.. అల్లూరి సీతారామరాజు జిల్లా చివరి స్థానంలో నిలిచింది. బాలికల్లో 84.09 శాతం, బాలురలో 78.31 శాతం పాసయ్యారు. 1,680 పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించాయి. మే 19 నుంచి 28 వరకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇకపోతే ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్ సొసైటీ- నిర్వహించిన పది, ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. పదోతరగతి రెగ్యులర్ పబ్లిక్ పరీక్షల ఫలితాలతో పాటు వీటిని కూడా మంత్రి నారా లోకేష్ విడుదల చేశారు. ఓపెన్ ఎస్.ఎస్.సి పరీక్షలు 26,679 మంది రాయగా, ఇంటర్ పరీక్షలకు 63,668 మంది విద్యార్థులు హాజరయ్యారు. పదిలో 37.93 శాతం, ఇంటర్ లో 53.12 శాతంఉత్తీర్ణత నమోదు అయినట్లు అధికారులు వెల్లడించారు. విద్యార్థులు తమ అడ్మిషన్ నెంబర్ లేదా రోల్ నంబర్ ఎంటర్ చేసి ఫలితాలు పొందొచ్చు.రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఏప్రిల్ 26 నుంచి మే 5 వరకు విద్యార్థులు ఏదైనా ఏపీ ఆ÷-లనైన్ కేంద్రంలో రుసుం చెల్లించవచ్చని అధికారులు సూచించారు. ఒక్కో సబ్జెక్టు రీ- కౌంటింగ్ కోసం రూ.200, జవాబు పత్రాల రీ-వెరిఫికేషన్ కోసం రూ.1000 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని పేరొన్నారు.

# వీరయ్య చౌదరికి సిఎం చంద్రబాబు నివాళి

కత్తుల దాడిలో వీరయ్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వీరయ్య చౌదరి హత్య జీర్ణించుకోలేకపోతున్నానని బాబు అన్నారు. నిన్న నేను ఢిల్లీలో ఉన్నప్పుడు ఈ వార్త తెలిసింది.. హత్య పైన నిన్నటి నుంచి అన్ని విధాల అన్వేషిస్తున్నాం.. 12 టీములతో దర్యాప్తు చేస్తున్నాం.. కరుడు కట్టిన నేరస్తులతో హత్య చేయించారు.. 53 చోట్ల కత్తిపోట్లు-ఉన్నాయి. ఇలాంటివి చూసినప్పుడు రాష్ట్రంలో ఇలాంటి వ్యక్తులు కూడా ఉన్నారా అని పిస్తుంది.. వీరయ్య చౌదరి మంచి నాయకుడు, సమర్థమైన వ్యక్తి అన్నారు. యువగళం సమయంలో 100 రోజులు నారా లోకేష్ తో తిరిగారు.. అమరావతి రైతుల పాదయాత్ర సమయంలో రైతులకు అండగా నిలబడ్డాడు.. ఎన్నికల సమయంలో చీరాల, సంతనూతలపాడు నియోజక వర్గాల్లో వీరయ్య చౌదరి పని చేశారు.. టిడిపి ప్రభుత్వ హయాంలో ఇలాంటి ఘోరాలు జరగడం జీర్ణించుకోలేక పోతున్నా.. సీసీటీవీ కెమెరాల నుంచి క్లూస్ కూడా తీసుకుంటున్నాం.. ఎవరికైనా హత్యపై సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 9121104784 కి సమాచారం ఇవ్వండి.. హత్యా రాజకీయాలు చేసే వాళ్ళు కూడా చివరకు కాలగర్భంలో కలిసిపోతారని హెచ్చరించారు. నేరగాళ్లను పట్టుకుని తీరుతాం, కఠిన శిక్ష విధిస్తాం.. మా కుటుంబ సభ్యుల లాగా వీరయ్య కుటుంబాన్ని చేసుకుంటాం.. నేర రాజకీయాలు చేసేవాళ్లను తుదముట్టించే వరకు పోరాటం చేస్తాం.. రాష్ట్రం నేరస్థుల అడ్డాగా మారకూడదు.. హత్యలు చేయడం దుర్మార్గమైన పని.. హత్య కేసును ఛేదించే వరకు పోలీస్ వ్యవస్థ నిద్రపోదు.. రాజకీయ కోణం, వ్యాపారం, ఆయన ఎదుగుదల జీర్ణించుకోలేక పోవడం లాంటి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం.. నేరస్తులు భూమి మీద ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టమని సిఎం వార్నింగ్ ఇచ్చారు. టీడీపీ ముఖ్యనేత, ఎన్‌జీపాడు మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు ముప్పవరపు వీరయ్యచౌదరి హత్యకు గురయ్యారు. వంటిపై మొత్తం 38 కత్తిపోట్లు ఉండటాన్ని బట్టి చూస్తే ఆయన్ను ఎంత కర్కశంగా పొడిచారో అర్థమవుతోంది. ఈ ఘటనతో నగర ప్రజలు ఉలిక్కిపడ్డారు. యావత్తు పార్టీశ్రేణుల్లో ఆందోళన నెలకొంది. నగరంలోని పాత బైపాస్ రోడ్డులోని వీరయ్య కార్యాలయంలోకి ప్రవేశించిన నలుగురు యువకులు కత్తులతో విచక్షణారహితంగా పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. రాత్రి 7.30 ప్రాంతంలో ఈ హత్య జరిగింది. నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన వీరయ్య చౌదరి దాదాపు మూడు దశాబ్దాలకుపైగా ఒంగోలు నగరంతోపాటు ఉమ్మడి జిల్లాలోని రాజకీయ, వ్యాపార వర్గాల వారందరికీ సుపరిచితుడు. జడ్పీ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు దగ్గర బంధువుగా తొలుత ప్రజలకు పరిచయమైన వీరయ్యచౌదరి క్రమంగా రాజకీయ వ్యాపార వర్గాల్లో ఎదుగుతూ వస్తూ ఉమ్మడి జిల్లాలో గుర్తింపు పొందిన నాయకుడిగా ఉన్నారు.



ప్రస్తుతం ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ టీడీపీ ముఖ్యనేతగా బాపట్ల పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. గతంలో 2014-19 మధ్య నాగులుప్పలపాడు ఎంపీపీగా పనిచేసిన వీరయ్యచౌదరి గత పదేళ్లుగా రాజకీయాల్లో మరింత క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఊహించని రీతిలో జరిగిన హత్యతో ఒంగోలు ప్రజానీకం ఉలిక్కిపడ్డారు.

# ఉగ్రదాడికి నిరసనగా వైసిపి క్యాండిల్ ర్యాలీ

పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నారాయణమూర్తి, అధికార ప్రతినిధులు కారుమూరి వెంకటరెడ్డి, శివశంకర్, మాజీ ఎంపీ నందిగం సురేష్, ఎన్.చంద్రశేఖర్ రెడ్డి, మంగళగిరి ఇన్‌ఛార్జి వేమారెడ్డి, అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. కశ్మీర్‌లోని పహల్గామ్‌లో టూరిస్టులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ.. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో క్యాండిల్ ర్యాలీలు చేపట్టింది. ఉగ్రవాద దాడిని ఖండిస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాండిల్ ర్యాలీలు నిర్వహించాలని పార్టీ నాయకులకు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఉగ్రవాదుల దాడిని అమానుష చర్యగా పేర్కొన్న వైఎస్ జగన్.. దేశం అంతా ఒక్కతాటిపై నిలవాలన్నారు. పహల్గాం ఘటనలో పలువురు మరణించడం అత్యంత బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఏపీకి చెందిన ఇద్దరు వ్యక్తులు మరణించడం అత్యంత బాధాకరమన్నారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాంతిర్యాలీకి పిలుపునిచ్చారు. ఈ మేరకు, పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ బుధవారం సాయంత్రం అన్నీ జిల్లా కేంద్రాల్లోనూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించాలని ఆదేశించారు. వైఎస్ జగన్ పిలుపుతో సాయంత్రం పార్టీ శ్రేణులు క్యాండిల్ ర్యాలీలు నిర్వహించారు. పహల్గాం ఉగ్రదాడిలో తెలుగు ప్రజల మృతిపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన జగన్.. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి గురించి విని షాకయ్యా. ఈ పిరికిపందల హింసాత్మక చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాను. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని ట్వీట్‌లో పేర్కొన్నారు.



గాంధీభవన్ లో తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన గౌరవ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23:

# ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నిక

- ఓటు హక్కు వినియోగించుకున్న 66మంది
- 25న కౌంటింగ్‌కు ఏర్పాట్లు



**హైదరాబాద్,ఏప్రిల్ 23( వెలుతురు):**

హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 77.56 శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. 66 మంది బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎం కార్పొరేటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే 22 మంది బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎం ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఈ ఎన్నికలో ఓటు వేయగా.. బీఆర్ఎస్ మినహా అన్ని పార్టీల ఎక్స్ అఫీషియో, కార్పొరేటర్లు ఓటింగ్‌లో పాల్గొన్నారు. బుధవారం ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమవగా.. సాయంత్రం 4 గంటలకు ముగిసింది. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం ఓటర్ల సంఖ్య 112 మంది ఉన్నారు. వీరిలో 31 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు ఓటు- వేసేందుకు భవన నిర్వహణ విభాగం గదిలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు- చేయగా.. 81 మంది కార్పొరేటర్ల కోసం లైబ్రరీ హాల్‌లో ఓటు- వేసేందుకు ఏర్పాట్లు- చేశారు. ఈ నెల 25న జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కౌంటింగ్ జరుగనుంది. గత 22 ఏళ్లుగా హైదరాబాద్ లోకల్ బాడీ ఎన్నికలు ఏకగ్రీవం అవుతూ వస్తోంది. అయితే 22ఏళ్ల తర్వాత తొలిసారిగా హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికల్లో బీజేపీ, ఎంఐఎం పార్టీలు పోటీ- చేస్తున్నారు. ఎంఐఎం అభ్యర్థిగా మీర్జా రియాజ్ ఉల్ హాసన్, బీజేపీ అభ్యర్థిగా గౌతమ్ రావు బరిలోకి దిగారు. ఎన్నిక నేపథ్యంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. దాదాపు 200 మీటర్ల నుంచే రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. జీహెచ్ఎంసీ కార్యాలయం చుట్టూ బారికేడ్లను ఏర్పాట్లు- చేశారు. దాదాపు 500 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు- చేశారు. దాదాపు 22 సంవత్సరాల తరువాత జరుగుతున్న ఈ ఎన్నికకు కోసం ఎన్నికల అధికారులు కూడా కట్టు-దిట్టమైన ఏర్పాట్లు- చేశారు. ఈరోజు జీహెచ్ఎంసీ కార్యాలయానికి సెలవు ప్రకటించారు. ఈనెల 25న ఉదయం 10 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభంకానుంది.

# కొత్త లోగోను ఆవిష్కరించిన హైడ్రా




**హైదరాబాద్,ఏప్రిల్ 23( వెలుతురు):**

నగరంలోని ప్రభుత్వ స్థలాలు, చెరువుల పరిరక్షణకు కృషి చేస్తున్న హైడ్రా.. ఇకపై కొత్త లోగోతో తన కార్యకలాపాలను కొనసాగించనుంది. ఇన్నాళ్లు ఈవీడీఎం లోగోతోనే ప్రజల్లోకి వచ్చిన హైడ్రా.. తాజాగా లోగోను మార్చింది. హైదరాబాద్ నగరాన్ని సూచిస్తూ హెచ్(ఐ) అక్షరంపై నీటి బొట్టు ఉన్న లోగోను రూపొందించింది. జల సంరక్షణ చేపడుతూనే నగరాన్ని విపత్తుల నుంచి రక్షించుకుందామని సూచిస్తూ కొత్త లోగోను తీర్చిదిద్దారు. ఈ లోగోను అధికారికంగా ఆమోదించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.. హైడ్రా కార్యాలయంతోపాటు- సిబ్బంది యూనిఫాం, వాహనాలపై కొత్త లోగోను ముద్రించాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు సిబ్బంది హైడ్రా అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో కొత్త లోగోను అప్‌డేట్ చేసింది.

# కాశ్మీర్‌లో ఉగ్రవాదులతో కాల్పులు

- ఇద్దరు చొరబాటు దారుల హతం

**శ్రీనగర్,ఏప్రిల్ 23( వెలుతురు):**

జమ్మూకశ్మీర్‌లో మరోసారి కాల్పుల మోత మోగింది. కుల్గామ్‌లో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య భీకరంగా ఎదురు కాల్పులు కొనసాగాయి. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నించిన ఇద్దరు ఉగ్రవాదుల్ని భారత్ సైన్యం మట్టుబెట్టిన కొన్ని గంటలకే తంగ్‌మార్గ్ ప్రాంతంలో ఈ ఎదురు కాల్పులు జరుగుతున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' కీలక కమాండర్ భద్రతా బలగాలకు చిక్కినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. నిన్నటి పహల్గాం ఘటనకు పాల్పడింది తామేనంటూ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' ప్రకటించుకున్న సంగతి తెలిసిందే. మరోవైపు నేటి తెల్లవారుజామున ఇద్దరు ఉగ్రవాదులు భారత్‌లోకి చొరబడేందుకు యత్నిస్తుండగా.. వారిని సైన్యం కాల్చి చంపింది. ఎన్‌కౌంటర్ అనంతరం భారీగా మందుగుండు సామగ్రి, ఆయుధాలు, పాకిస్థాన్ కరెన్సీ భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

# తెలంగాణ సాయుధపోరాట యోధుడు దొడ్డి కొమురయ్య గారి విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్

- కురుమ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్
- కార్యక్రమంలో భారీగా పాల్గొన్న కురుమ సంఘం నేతలు..



**కోహెడ మండలం వెలుతురు ఏప్రిల్ 23:**

హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండల కేంద్రంలో తెలంగాణ సాయుధపోరాట యోధుడు దొడ్డి కొమురయ్య గారి విగ్రహాన్ని ఆవిష్కరించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్.. అనంతరం శ్రీ లక్ష్మీ గార్డెన్ లో కురుమ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యక్రమంలో భారీగా పాల్గొన్న కురుమ సంఘం నేతలు.. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య గారి విగ్రహ ఆవిష్కరణ చేసుకోవడం జరిగింది 19 ఏళ్లు బతికి చరిత్ర సృష్టించిన దొడ్డి కొమురయ్య వందేళ్లైన మనకు ఆదర్శం అనిచివేతలకు వ్యతిరేకంగా పోరాడిన దొడ్డి కొమురయ్య మనకు స్ఫూర్తి విగ్రహాలు మనకు స్ఫూర్తిగా పెట్టుకుంటాం. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని సాధించాలి రాజకీయంగా మీ దగ్గర ఉన్న స్ఫూర్తి అవకాశాలు వస్తాయి సమాజంలో తల ఎత్తుకొని బతికేలా విద్యా అవసరం.. గొర్రెల దగ్గరకు పంపాలని ఆలోచన మనేయండి మంచిగా చదివించండి..సమాజానికి ప్రయోజకుడిని చేయండి 42 శాతం రిజర్వేషన్లు అమలు ఐతే రాజకీయంగా అందరికీ న్యాయం జరుగుతుంది త్వరలోనే కురుమ ,గొల్ల కార్పొరేషన్ వేరు వేరుగా ఏర్పాటు అయ్యేలా ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకుపోతాం ప్రభుత్వంలో ఉండి సబ్ ప్లాన్ అడుగుతున్నాం.. ఆనాడు ప్రభుత్వంలో ఉండి తెలంగాణ కోసం కోట్లాడినట్టు ఇప్పుడు బలహీన వర్గాల కోసం ప్రభుత్వంలో ఉన్న పెద్దల సహకారంతో పోతున్నాం కొమురెల్లి చైర్మన్ వచ్చేలా చేస్తాం. గొర్ల స్కీమ్,ఫంక్షన్ హాల్ అయ్యేలా చూస్తాం.. 1987 లో నేను కాలేజి అధ్యక్షుడిని 37 ఏళ్ల తరువాత మంత్రి అయ్యాను ప్రజల మనస్సు గెలవాలి.. ప్రజా సమస్యలు పరిష్కారం చేయాలి స్థానిక సంస్థల ఎన్నికల్లో కురుమ లకి అవకాశం ఇస్తాం సమాజంలో అందరినీ కలుపుకొని బీసీ లమంతా ఐక్యంగా ముందుకు పోతేనే విజయం సాధిస్తాం.. హుస్నాబాద్ నియోజకవర్గం లోని అన్ని మండల కేంద్రాల్లో దొడ్డి కొమురయ్య విగ్రహాలు పెడతాం కుల పరమైన అంశాల్లో ప్రభుత్వంలో ఉన్న మంత్రిగా మీకు అండగా ఉంటా.. మన సమస్యలు పరిష్కారం చేసుకోవడానికి దొడ్డి కొమురయ్య స్ఫూర్తి తో చాకలి ఐలమ్మ,సర్దార్ సర్వాయి పాపన్న,కొమురం భీం లను స్ఫూర్తిగా తీసుకొని పోవాలి ఆనాడు నియంతృత్వానికి వ్యతిరేకంగా నేనున్న అని కొట్లాడిండు.. మీరంతా ధైర్యంగా కోట్లడడానికి దొడ్డి కొమురయ్య విగ్రహం ఉపయోగపడుతుంది.. మీకు ఏ సమస్యలు ఉన్నా ఎప్పటికీ అందుబాటులో ఉంటా..

# పార్టీ పదవుల్లో సీనియర్లకే పెద్దపీట

- పిసిసి అబర్వర్ల సమావేశంలో మీనాక్షి వెల్లడి
- సమావేశానికి రానివారి పేర్లు తొలగింపు



**హైదరాబాద్,ఏప్రిల్ 23( వెలుతురు):**

కాంగ్రెస్ పార్టీ పదవుల్లో సీనియర్లకు పెద్ద పీట వేయనున్నారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో బుధవారంగాంధీభవన్ లో పీసీసీ అబ్జర్వర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 70 మంది అబ్జర్వర్లను ఆహ్వానించగా.. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితోపాటు మరో ఐదుగురు రాలేదు. దీంతో వారని ఆ పదవి నుంచి తొలగించారు. అదే విధంగా మీటింగ్ కు ఆలస్యంగా వచ్చిన వారిపైనా వేటు- పడింది. 2017 నుంచి పార్టీలో ఉన్న వారికే పదవులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. మండల, బ్లాక్ అధ్యక్షుల నియామకం కోసం జిల్లాకు ఇద్దరు అబ్జర్వర్లను నియమిస్తున్నట్టు కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ తెలిపారు. ప్రతి మండలం నుంచి పార్టీ మండలాధ్యక్ష పదవి కోసం ఐదుగురి పేర్లను పంపాలని సూచించారు. అదే విధంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం మూడు పేర్లను పీసీసీకి పంపాలని అబ్జర్వర్లకు మీనాక్షి నటరాజన్ సూచించారు. పార్టీ నాయకత్వంలో మహిళల ప్రాతినిధ్యం పెరగాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి చాలా చరిత్ర ఉందని, బ్రిటీష్ వాళ్లతో పోరాటం చేసిందని అన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ అని, జాతీయ స్థాయి ఆలోచనలతోనే ముందుకు పోతుందని అన్నారు. గాంధీ సిద్ధాంతాలతోనే పార్టీ ముందుకు సాగుతుందని అన్నారు. పార్టీ సిద్ధాంత ప్రచారం, సంస్థాగత పటిష్టత గ్రామస్థాయి నుంచి జరగాలని అన్నారు. ఈ విషయంలో పార్టీ నాయకత్వం చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని గుజరాత్ మోడల్ గా చేపట్టాలని అధినాయకత్వం నిర్ణయించిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను విస్తారంగా జనంలోకి పోవాలని అన్నారు. సిద్ధాంత పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశంలోనే మొదటి సరిగా తెలంగాణ లో కులగణన, 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ చేపట్టడం చరిత్రాత్మకమని కొనియాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. ప్రభుత్వం విప్లవాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలను మనం ప్రజల్లోకి విస్తృతంగా తీస్కెళ్లాలని అన్నారు. ఏప్రిల్ 25 నుంచి 30వ తేదీ వరకు జిల్లా స్థాయి సమావేశాలు జరగనున్నాయని ప్రకటించింది. ఈ సందర్భంగా ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ జాతీయ పార్టీ జాతీయ స్థాయి ఆలోచనలతో పార్టీ పని చేస్తుంది.. పార్టీ సిద్ధాంత ప్రచారం, సంస్థాగత పటిష్టత గ్రామస్థాయి నుంచి జరగాలి అని సూచనలు చేసింది. ఈ విషయంలో పార్టీ నాయకత్వం చాలా చిత్తశుద్ధితో సీరియస్ గా పని చేయాలని హెచ్చరించింది. ఈ దేశంలోనే మొదటి సరిగా తెలంగాణలో కుల గణన చేసి 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ చేపట్టడం చరిత్రాత్మక నిర్ణయం అన్నారు. అలాగే, దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది.. అయితే, దేశంలో మోడీ సర్కార్, గత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మన ప్రభుత్వం చేపట్టింది.. ప్రభుత్వం విప్లవాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలను మనం ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి అని మీనాక్షి నజరాజన్ పేర్కొన్నారు.

# ఎన్నికల కేసు కొట్టివేతకు రేవంత్ పిటిషన్



**హైదరాబాద్,ఏప్రిల్ 23( వెలుతురు):**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉన్న కేసు కొట్టివేయాలని పిటిషన్‌లో కోరారు. గతేడాది ఎన్నికల ప్రచారంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెంలో కాంగ్రెస్ నిర్వహించిన సభలో రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగంపై భాజపా నేత కాసం వెంకటేశ్వర్లు పరువు నష్టం దావా వేశారు. భాజపాకు పరువు నష్టం కలిగేలా రేవంత్ రెడ్డి మాట్లాడారంటూ ఫిర్యాదు చేశారు. కాసం పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ప్రజాప్రతినిధుల కోర్టు.. విచారణలో భాగంగా సాక్షుల వాంగ్మూలం నమోదు చేసింది. భాజపా మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో చెప్పారని కాసం తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రజాప్రతినిధుల కోర్టు విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ప్రసంగం ఆడియో, వీడియో క్లిప్పింగ్‌లను సైతం కాసం కోర్టుకు సమర్పించారు. దీంతో విచారణలో ఉన్న ఈ కేసును కొట్టేయాలని సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. కేసు విచారణ చేపట్టవద్దని, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అలాగే, కోర్టు హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది.

# దిగొచ్చిన బంగారం ధరలు

## 3వేలకు పైగా తగ్గిన రేట్లు



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 23( వెలుతురు):**

అంతర్జాతీయ పరిణామాలతో దేశీయ మార్కెట్‌లో ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరిన బంగారం ధర బుధవారం కాస్త దిగొచ్చింది. 10 గ్రాముల పుత్తడి ధర దాదాపు రూ.3వేలు తగ్గింది. బుధవారం 11 గంటల సమయంలో బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పసిడి ధర రూ.98,700గా ఉంది. అటు- వెండి ధర కూడా స్వల్పంగా తగ్గింది. బులియన్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.98,720గా ఉంది. మంగళవారం నాటి మల్టీ కమోడిటీ- ఎక్స్ఛేంజీ ట్రేడింగ్‌లో జూన్ నెల డెలివరీ కాంట్రాక్ట్ ధర ఇంట్రాడేలో రూ.99,358 వద్ద సరికొత్త రికార్డును తాకిన సంగతి తెలిసిందే. బుధవారం ఈ ధర కూడా తగ్గుముఖం పట్టింది. నేడు రూ.96,500 వద్ద ప్రారంభమైన ఈ ధర.. ఇంట్రాడేలో రూ.95,457 వద్ద కనిష్ఠాన్ని తాకింది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఔన్సు బంగారం ధర 3,320.40 డాలర్లు పలికింది. నిన్న ఈ ధర 3,467 డాలర్లు దాటింది. చైనాతో వాణిజ్య ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సానుకూల వ్యాఖ్యలు చేయడంతో అగ్రరాజ్య మార్కెట్లు- లాభాలను దక్కించుకున్నాయి. డాలర్ విలువ కూడా బలపడుతోంది. ఈ పరిణామాలన్నీ బంగారం ధరపై ప్రభావం చూపించాయని నిపుణులు చెబుతున్నారు. వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, అంతర్జాతీయ మార్కెట్లు- పసిడి ధరను ప్రభావితం చేస్తున్నాయి. సాంకేతికంగా చూస్తే.. రానున్న రోజుల్లో పుత్తడి మరింత దిగి రావొచ్చని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. మరోవైపు ఏప్రిల్ 30న అక్షయతృతీయ నాటికి బంగారం ధరలు తగ్గకపోతే అమ్మకాలపై ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# బట్టతలకు మందంటూ ప్రచారం

- భారీగా తరలివచ్చిన బట్టతల బాధితులు
- ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**హైదరాబాద్,ఏప్రిల్ 23( వెలుతురు):**



హైదరాబాద్ ఉప్పల్‌లో బట్టతల మందు కోసం బాధితులు క్యూ కట్టారు. ఉప్పల్ బాగాయత్‌లో ఏర్పాటు చేసిన శిబిరం.. వేలాది మంది బట్టతల బాధితులతో నిండిపోయింది. వెయ్యి రూపాయలు పెట్టి బట్టతలకు బాధితులు మందు తీసుకున్నారు. 300 ఎంట్రీ- ఫీజు.. 700 ఆయిల్ కాస్ట్ అంటూ హారీశ్ అనే వ్యక్తి భారీగా డబ్బులు వసూళ్లు చేసాడు. ఢిల్లీ నుంచి ఫ్రాంచైజ్ తీసుకొని బట్టతలకు ఆయిల్ ఇస్తామంటూ మోసానికి పాల్పడుతున్న హరీష్, వినోద్, రాజశేఖర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గతంలో కూడా బట్టతలపై వెంట్రు-కలు మొలిపిస్తానని ఓ యువకుడు పాతబస్తీలో హల్‌చల్ చేసిన సంగతి తెలిసిందే. ఢిల్లీకి చెందిన వకీల్ గత కొంత కాలంగా పాతబస్తీ రామనాస్పుర రోడ్డులో కింగ్ పేరుతో కటింగ్ షాపును నిర్వహిస్తున్నాడు. నెల రోజుల నుంచి బట్టతలపై జుట్టు- మొలిపిస్తానంటూ ప్రచారం చేయడంతో పెద్ద ఎత్తున యువకులు క్యూలో నిలబడి మందు పెట్టించుకున్నారు. ఈ వార్త సోషల్ మీడియాలో కూడా వైరల్‌గా మారింది. వకీల్ మొదట బట్టతల గుండు కొట్టి రూ.100 తీసుకొని తర్వాత జుట్టు- మొలిపించేందుకు కెమికల్‌ను బట్టతలపై రాసేవాడు. ఉన్న కాస్త జుట్టు- కూడా పోయిందంటూ ఆందోళనకు గురయ్యారు.


# సంపాదకీయం..

## నాటి పాలకుల పాపమే నేటి కాశ్మీర్ హింస !

దేశ విభజన తెచ్చి పెట్టిన చిచ్చు ఇంకా రావణ కాష్టంలా కాలుతూనే ఉంది. మత ప్రాతిపదికన దేశాన్ని ముక్కలు చేసిన కాంగ్రెస్ పెద్దలు ఇప్పుడు సమాధానం చెప్పడం లేదు. ఆనాడు దేశాన్ని విభజించకుండా మహాత్ముడు కూడా అడ్డుకోలేక పోయాడు. కేవలం నెహ్రూకు ప్రధాని పదవి కావాలన్న పట్టుదలతో దేశం ముక్కలైనా ఫర్వాలేదన్న రీతిలో ఆనాడు వ్యవహరించారు. దాని ఫలితాలను నేటికీ అనుభవిస్తున్నారు. సరిగ్గా దేశ విభజన జరగక పోదం, కాశ్మీర్ విషయంలో నాన్చివేత ధోరణి, 370 అధికరణ, యుద్ధాల్లో ఓడిన పాక్‌ను దయతలచి వదిలి పెట్టడం లాంటివన్నీ ఇవాళ మనకు గుదిబండగా మారాయి. ఆనాడే పటిష్టమైన విధానాలు అవంబించి, ఆక్రమిత కాశ్మీర్‌ను స్వాధీనం చేసుకుని, పక్కాగా విభజన ఒప్పందాలు చేసుకుని ఉంటే ఇవాళ పాక్ తీవ్రవాదం నుంచి ముప్పును ఎదుర్కొని ఉండేవారం కాదు. ఆనాటి పాలకులు దూరదృష్టి లోపం కారణంగా దేశం ఇవాళ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది.ఇకపోతే కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దయితే స్వాగతించాల్సిన కాంగ్రెస్ ఇతర పార్టీలు, ఎంఐఎం వంటి మతఛాందస పార్టీలు సంకుచిత రాజకీయాలు ప్రదర్శించాయి. ఇప్పటికీ ప్రదర్శిస్తున్నాయి. లక్షలాది మంది కాశ్మీరీ పండిట్లను ఊచకోత కోసినా, మతమార్పిళ్లు చేసినా పట్టించుకోని కాంగ్రెస్ తదితర పార్టీలు ఆర్టికల్ 370 గురించి చేసిన ప్రకటనలు ఉగ్రవాదులకు ఊతం ఇస్తున్నాయి. ఈ విషయంలో ఉగ్రవాదులకు అండ దక్కుతుందంటే అది మన పార్టీలు అవంబిస్తున్న రాజకీయ వైఖరి అని చెప్పక తప్పదు. తాజాగా కాశ్మీర్‌లో నరమేథం అన్నది కేవలం... ఉగ్రదాడిగా చూడరాదు. పనిగట్టుకుని హిందువులే లక్ష్యంగా చేసిన దాడి. ఇది ముస్లిం ఉగ్రవాదుల పనే అయినా...ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లిం సమాజం దీనిని ఖండించాలి. ఇలాంటి మతఛాందసాన్ని ఒప్పుకోబోమని ఉగ్రవాదులకు సందేశం ఇవ్వాలి. అలా చేయకుంటే వారి నిజాయితీ లేనివారుగా గుర్తించాలి. ముందుగా మనదేశంలో ఉన్న ముస్లిం పార్టీలు, ఎంఐఎం లాంటి పార్టీలు ఇందుకు బహిరంగా ప్రకటనలు చేసి ఉగ్రవాదుల దుశ్చర్యలను నిలదీయాలి. నిరసించాలి. పాలకపక్షంగా ఉన్న ఫరూక్ అబ్దుల్లా పార్టీ, మెహబూబా ముఫ్తీ పార్టీలు కూడా అసవరమైన నిరసన ప్రదర్శనలు చేయాలి. పాక్ తీరును ఎండగట్టాలి. కానీ పాక్ పాటపాడే వీరు అలా చేస్తారని అనుకోవడం భ్రమే అవుతుంది. కశ్మీర్ భూమిపై మరోసారి భారతీయుల ముఖ్యంగా హిందువలను లక్ష్యంగా చేసుకుని చేసిన దాడిని ఏ మాత్రం క్షమించరాని నేరంగా చూడాలి. కాశ్మీర్‌లోనే కాదు..దేశంలో ఉగ్రవాదుల చర్యలను ఉపేక్షించరాదు. శాంతి వచనాలు పలకుతూ పోతే వారికి బుద్ధి రాదు. సెలవుల్లో ఆహ్లాదంగా గడుపుదామని పహల్గామ్ సందర్శించ దానికి వెళ్లిన పర్యాటకులు లక్ష్యంగా ముష్కర మూక జరిపిన దాడిని ఒక్క ఖండనతో వదిలిపెట్టరాదు. కొత్తగా పెళ్లయిన జంటలు ఆనందంగా కాలక్షేపం చేద్దామని వెళితే భర్త కాటికి చేరగా భార్య గూడు చెదరి కన్నీరు మున్నీరయ్యింది. ఇప్పటివరకు కాశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన అతిపెద్ద ఉగ్రవాద దాడిగా దీనిని పరిగణిస్తున్నారు. ఇందులో 28 మంది మరణించిన తీరు ఉగ్రవాదుల రాక్షస కాండకు నిదర్శనంగా చూడాలి. కాందహార్ విమానం హైజాక్ చేసినప్పుడు కూడా ఇలాగే ఉగ్రమూకలు ఎందరినో పొట్టన పెట్టుకున్నారు. పాకిస్థాన్ కేంద్రంగా ఉగ్ర కార్యకలాపాలు సాగిస్తున్న 'లష్కరే తయ్యిబా' అనుబంధ విభాగం 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్' ఈ దాడికి తెగబడినట్లు ప్రకటించుకుంది. సైనికుల దుస్తుల్లో వచ్చిన అయిదుగురు ముష్కరులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని స్పష్టమయ్యింది. కాల్పుల అనంతరం సమీప అడవుల్లోకి పారిపోవడంతో భద్రతా సిబ్బంది వారికోసం గాలిస్తున్నారు. అయితే.. ఇప్పుడు ఈ దాడి వెనక పాకిస్థాన్ హస్తం ఉందన్నదానికి అనుమానాలు అక్కర్లేదు. మనదేశంలో ఏ దాడి జరిగినా దాని మూలాలు అక్కడే ఉంటున్నాయి. ఇటీవల దాయాది దేశంపాక్  ఆర్మీచీఫ్ అసిమ్ మునీర్ మళ్లీ కశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. అది తమ జీవనాడి అని, దానిని మర్చిపోలేమని వ్యాఖ్యానించారు. విదేశాల్లో నివసిస్తోన్న పాకిస్థానీయులంతా దేశ రాయబారులు. మీరు ఉన్నతమైన భావజాలం, సంస్కృతికి చెందినవారనే విషయాన్ని మర్చిపోకూడదు. మీరు మీ పిల్లలకు పాక్ స్టోరీ చెప్పాలి. హిందువులతో పోలిస్తే మనం భిన్నమని మన పూర్వీకులు భావించారు. మన సంస్కృతి, ఆచార సంప్రదాయాలు, ఆశయాలు భిన్నం. అదే రెండు దేశాల సిద్ధాంతానికి పునాది వేసింది. ఈ దేశం ఏర్పాటు- కోసం మన పూర్వీకులు ఎంతో పోరాడారు. ఈ స్టోరీని తర్వాత తరాలకు చెప్పడం మర్చిపోవద్దు. అప్పుడే వారికి పాకిస్థాన్‌తో ఉన్న బంధం దృఢంగా ఉంటుందంటూ చేసిన వ్యాఖ్యలు ఏ రకంగా ఉగ్రవాదాన్ని ప్రేరేపించేదిగా ఉంది.  నిజానికి భారత్‌లో వీరంతా ఎక్కడి వారు...ఎందుకు హిందువులతో పోరాడారు అన్న చరిత్ర కూడా చెప్పివుంటే బాగుండేది. ఓ రకంగా భారత్‌లో ఉగ్రదాడికి ఆర్మీ చీఫ్ మునీర్ వ్యాఖ్యలు ఊపిరి పోశాయని చెప్పాలి. అలాగే కశ్మీర్ గురించి మాట్లాడుతూ.. ఈ విషయంలో మా వైఖరి స్పష్టం. కశ్మీర్ సోదరులను మేం అలా వదిలేయం అంటూ బీరాలు పలికారు. నిజానికి కాశ్మీర్ చరిత్ర,భారతదేశ చరిత్ర తెలియని మూర్ఖుడుగా అతడిని గుర్తించాలి. మొత్తంగా పాక్ ఆర్మీ చీఫ్  వ్యాఖ్యలు చేసిన వారంలోపే దాడి జరిగిందన్నది గుర్తించాలి. దీంతో పాకిస్థాన్ సైన్యం, పాక్ ప్రభుత్వంపై కూడా  అనుమానాలు బలపడుతున్నాయి. ఈ దాడికి పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాదులను నిందిస్తూ భారతదేశం వైపు నుంచి ఇప్పటివరకు ఎటువంటి అధికారిక వ్యాఖ్య వెలువడ నప్పటికీ.. పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ముందుగానే స్పందించడంపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు భారత ప్రభుత్వం లేదా భారత సైన్యం ఈ దాడిపై ఎలాంటి ప్రకటన చేయలేదు. కానీ..  ఈ ఉగ్రదాడితో పాకిస్థాన్ కు ఎటువంటి సంబంధం లేదు. ఇదంతా ఆదేశంలో పుట్టిందే. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉద్యమాలు, విప్లవాలు జరుగుతున్నాయి. ఒకటి కాదు, రెండు కాదు.. డజన్ల కొద్దీ ఉద్యమాలు జరుగుతున్నాయి. నాగాలాండ్ నుంచి కాశ్మీర్ వరకు, దక్షిణాన ఛత్తీస్‌గఢ్, మణిపూర్ లాంటి ప్రదేశాలన్నింటిలోనూ భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ వరుస ఘటనలు చూస్తుంటే పాకిస్థాన్‌పైనే అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా ఈ నరమేధంతో మనం మరింత అప్రమత్తం కావాలి. ఉగ్రవాదుల ఏరివేతలో మరితం కఠినంగా ఉండాలి. బుజ్జగింపు రాజకీయాలు చేసే పార్టీలను ప్రజలు నిలదీయాలి. కాశ్మీర్ 370 ఆర్టికల్ గురించి మాట్లాడే కాంగ్రెస్, ఎంఐఎం , అబ్దుల్లా పార్టీలను ఎండగట్టాలి. ప్రజలు ఒక్కటిగా నిలబడి బాధిత కుటుంబాలకు భరోసా ఇవ్వాలి.

# లష్కరే తోయిబాకు కొత్త ముసుగు

- ద రెసిస్టెన్స్ ఫ్రంట్ ఏర్పాటు వెనక పాక్ హస్తం
- తాజా దాడితో మరోమారు టీఆర్ఎఫ్ దుశ్చర్య






**శ్రీనగర్,ఏప్రిల్23( వెలుతురు):** పహల్గాంలోని బైసరన్‌లో ఉగ్రదాడి చేసి పర్యాటకులను పొట్టనబెట్టుకున్న 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)' కొత్తగా ఏర్పాటైందే. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత ఈ సంస్థ ఏర్పడింది. తొలుత ఆన్‌లైన్‌లో ఉగ్ర కార్యకలాపాలను నిర్వహించేది. ఆ తరువాత 6 నెలల్లోగా లష్కరే తోయిబా వంటి పలు ఉగ్ర సంస్థల సభ్యులను తీసుకుని భౌతిక గ్రూపుగా ఏర్పాటైంది. దీని వెనుక పాకిస్థాన్ హస్తం ఉంది. పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐనే టీఆర్ఎఫ్‌ను సృష్టించిందని నిఘా వర్గాల సమాచారం. లష్కరే తోయిబా నుంచి ప్రపంచం దృష్టిని మళ్లించడానికి ఈ టీఆర్ఎఫ్‌ను ఏర్పాటు చేయించినట్లు చెబుతున్నారు. లష్కరే తోయిబా ఉగ్ర కార్యకలాపాల కారణంగా 2018లో నిషేధిత దేశాల జాబితాలో పాకిస్థాన్‌ను ఆర్థిక చర్యల టాస్క్‌ఫోర్స్ చేర్చింది. దీంతో పాక్ దిద్దుబాటు-చర్యల్లో భాగంగా టీఆర్ఎఫ్‌ను ఏర్పాటు చేయించిందనన్న అనుమానాలు ఉన్నాయి. 2019లో ఏర్పాటైనప్పటి నుంచి టీఆర్ఎఫ్ దాడులకు దిగుతోంది. కశ్మీర్ ప్రాంతంలో ఉనికిని చాటుకోవాలని ప్రయత్నిస్తోంది. దీంతో 2023లో టీఆర్ఎఫ్‌ను ఉగ్రసంస్థల జాబితాలో భారత్ చేర్చింది. టీఆర్ఎఫ్‌ను సృష్టించింది షేక్ సజ్జాద్ గుల్ అలియాస్ షేక్ సజ్జాద్. అతడు కశ్మీరీ మిలిటెంటు-. శ్రీనగర్‌లో ప్రముఖ జర్నలిస్టు అయిన షుజాత్ బుఖారీ, అతడి భద్రతా సిబ్బంది ఇద్దరిని 2018 జూన్ 14వ తేదీన హతమార్చడానికి కుట్ర పన్నింది సజ్జాదే. ఉగ్ర కార్యకలాపాల కారణంగా ఉపా చట్టం కింద సజ్జాద్‌ను ఉగ్రవాదిగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. గతంలో అతడు లష్కరే తయ్యిబా కమాండర్‌గా పని చేశాడు. టీఆర్ఎఫ్‌లో పనిచేసే వారిలో సాజిద్ జాట్, సలీం రెహ్మానీ ఉన్నారు. వీరిద్దరూ గతంలో లష్కరేలో పనిచేసిన వారే. అన్ని మతాలకు చెందిన వ్యక్తులను టీఆర్ఎఫ్ లక్ష్యంగా చేసుకుంటుంది. ఆ సంస్థ దాడులు చేసిన వారిలో కశ్మీరీ పండిట్లు, సిక్కులు, హిందువులు, ముస్లింలు ఉన్నారు. 2020 ఏప్రిల్ 1న నియంత్రణ రేఖ వెంబడి కుప్వారాలోని కేరన్ సెక్టార్‌లో నాలుగు రోజులపాటు- ఎదురు కాల్పులు జరిగినప్పుడు తొలిసారిగా టీఆర్ఎఫ్ పేరు వెలుగులోకి వచ్చింది. అక్టోబరు 30న  దక్షిణ కశ్మీర్‌లోని కుల్గాంలో ముగ్గురు భాజపా కార్యకర్తలను టీఆర్ఎఫ్ ఉగ్రవాదులు హతమార్చారు.  నవంబరు 26న శ్రీనగర్‌కు సమీపంలోని లాయేపోరా ప్రాంతంలో 2 రాష్ట్రీయ రైఫిల్స్‌పై దాడి చేసిన టీఆర్ఎఫ్ ఉగ్రవాదులు దానిని చిత్రీకరించారు. ఇద్దరు సైనికులకు కాల్చి చంపారు. 2023 ఫిబ్రవరి 26న పుల్వామాలో సంజయ్ శర్మ అనే కశ్మీరీ పండిట్‌ను టీఆర్ఎఫ్ ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్నారు. 2024 అక్టోబరు 20న గండేర్‌బల్‌లోని సోన్‌మార్గ్‌లో ఒక వైద్యుడు, ఆరుగురు వలస కార్మికులను ఉగ్రవాదులు హతమార్చారు. తమ గురించి చర్చించుకోవాలని, తాము బలంగా ఉన్నామని చెప్పుకోవడానికి ఈ ఉగ్రమూక పనిచేస్తోంది. తాజా మారణహోమం కూడా ఇందులో భాగమే.

# అరుదైన వ్యక్తిత్వం పోప్ ఫ్రాన్సిస్ సొంతం

## ప్రపంచ శాంతి కోసం తపించిన మానవతావాది



**రోమ్,ఏప్రిల్23( వెలుతురు):** మానవతావాదిగా పోప్ ఫ్రాన్సిస్‌ది సమకాలీన ప్రపంచంపై చెరగని ముద్ర వేశారు. వాటికన్ సిటీలో ఉండే మతపెద్దలు ఎప్పుడూ ప్రపంచశాంతిని కోరుకునే వారే. మత ఛాందసం ఎక్కడా వారు తమ ఛాయలకు రానీయరు. తాము ఫలానా మతానికి పెద్దలమైనా.. సర్వమానవాళిని కోరుకునే వారుగానే నిలిచారు. ఈ క్రమంలో మరో అడుగు ముందుకు వేసి ప్రపంచ శాంతితో పాటు, ప్రజల పక్షాన నిలిచిన పోప్‌గా ఫ్రాన్సిస్ పేరు గడించారు. కేవలం మాటలకే కాకుండా ప్రపంచ శాంతి కోసం తనవంతుగా ప్రయత్నం చేశారు. అందుకే పోప్ ఫ్రాన్సిస్ విలక్షణ వ్యక్తిత్వాన్ని ప్రశంసిస్తూ విశ్వవ్యాప్తంగా సంతాప సందేశాలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలే మరణించిన పోప్ ఫ్రాన్సిస్ అత్యంత సామాన్య జీవితం నుంచి వచ్చి పోప్ స్థాయికి ఎదిగారు. అర్జెంటీనాలోని బ్యూనస్ ఎయిర్స్ వలస వచ్చిన ఒక సామాన్య కుటుంబంలో జన్మించిన జార్జ్ మారియో బెర్గోగ్లియో నైట్‌క్లబ్ బౌన్సర్‌గా జీవితాన్ని ప్రారంభించారు. సొసైటీ ఆఫ్ జీసస్‌లో చేరి కాథలిక్ ప్రీస్ట్ నుంచి అత్యున్నత పోప్ పదవిని చేపట్టడానికి పేదల పట్ల కరుణ, దయ, వినమ్రతే ప్రధాన కారణం. అర్జెరటీనా నుంచి తొలుత బాధ్యతలు చేపట్టిన వ్యక్తిగా చరిత్రకెక్కిన ఆయన తన పేరును పేదల కోసం పాటుపడిన సెయింట్ ఫ్రాన్సిస్‌లోని ఫ్రాన్సిస్‌గా మార్చుకోవడం మానవత్వానికే తన ప్రాధాన్యత అని చాటిచెప్పారు. విలాసవంతమైన రాజభవనాల్లో, అడుగడుగునా హంగు ఆర్భాటాలతో జీవించే మత పెద్దలందరికీ ఫ్రాన్సిస్ భిన్నం. జీవితాంతం నిరాడంబరతను చాటిచెప్పడమే గాకుండా ఆచరించి చూపాడు. వృద్ధులు, ఖైదీల కాళ్లు కడిగి ముద్దుపెట్టుకోవడం అణగారిన వర్గాలకు సన్నిహితంగా, అండగా ఉండాలనే తపనను గుర్తు చేస్తుంది. వాటికన్‌లో తన తొలి ఈస్టర్‌కు ముందుగా ఇటలీ ద్వీపకల్పమైన లాంపెడుసాను ఎంపిక చేసుకోవడమే కాదు... 88వ ఏట... తీవ్ర అస్వస్థతతో ఉన్నా, తన మరణానికి ముందురోజున ఈస్టర్ నాడూ సామాన్యులను కలుసుకోవడం ఆయన విశిష్టత. యూరప్ చేరుకునేందుకు వేలాదిమంది శరణార్థులు ప్రవేశించే లాంపెడుసాను ఎంచుకోవడం ప్రపంచీకరణ పేదల పట్ల చూపే ఉదాశీనతకు నిరసన. ప్రమాదకరంగా సముద్ర ప్రయాణాలు చేస్తూ మరణిస్తుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ మార్పుల వల్ల పేద దేశాలకు జరుగుతున్న అన్యాయానికి ధనిక దేశాలదే బాధ్యత అని కుండబద్దలు కొట్టి పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి అమెరికా బయటకు రావడాన్ని నిరసించిన తీరు ఆయనలోని మానవతావాదిని గుర్తు చేస్తుంది. అమెరికన్ కాంగ్రెస్‌లో ప్రసంగించిన తొలి పోప్ కూడా ఫ్రాన్సిసే. భూమిని, ప్రకృతిని, వాతావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రపంచంలోని అత్యంత ధనిక దేశానిదేనని నిస్సంకోచంగా చెప్పారు. మెక్సికోకు వ్యతిరేకంగా సరిహద్దు గోడను ట్రంప్ తన తొలి విడత పదవీ కాలంలో నిర్మించడం క్రైస్తవ విరుద్ధమైన చర్య అంటూ ఖండించారు. ఇటీవల శరణార్థులను అమానవీయంగా సంకెళ్లు వేసి తరలించడంపైనా గళమెత్తారు. ప్రపంచ దేశాల మధ్య సయోధ్య, ప్రేమ, సత్సంబంధాల పెంపులోనూ ఆయన ముద్ర ఉంది. అమెరికా, క్యూబాల మధ్య చారిత్రక సయోధ్యకు, కొలంబియాలో శాంతికి తన వంతు ప్రయత్నాలు చేశారు. మత బోధకులు పిల్లల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడటంపై సమాజానికి క్షమాపణ చెబుతూనే... వారి పట్ల, అవినీతికి పాల్పడిన వారి పట్ల కఠినంగా వ్యవహరించడం ఆయన ప్రత్యేకత. మరణ శిక్షను, పచ్చి మితవాద భావజాలాన్ని నిరసించారు. యుద్ధాలను మానవతకు ఓటమిగా నిర్వచించడంతోపాటు- మూడో ప్రపంచయుద్ధం తప్పదంటూ హెచ్చరించారు. యుద్ధాలు, అరాచకాల వల్ల కాందిశీకులుగా మారిన వారికి కాథలిక్ సంస్థల ద్వారా సహాయాన్ని అందించే పక్రియను చేపట్టారు. ఇజ్రాయిల్, పాలస్తీనా, ఉక్రెయిన్ తదితర దేశాల అత్యున్నత స్థాయి బృందాలతో మాట్లాడి, యుద్ధాలను ఆపివేయాలంటూ శాంతి సందేశాన్నిచ్చారు. రోమన్ కాథలిక్‌లలో ఉన్నత స్థానాల్లో పురుషులకే స్థానం కల్పించే సాంప్రదాయానికి స్వస్తి పలికి, అనేక మంది మహిళలకు ఉన్నత స్థానాలిచ్చారు. పోప్‌గా లభించే అధికారాన్ని అనుభవించడం కన్నా, సామాన్య ప్రజల కష్టసుఖాలు తనవిగా భావించి, సమాజానికి మేలు చేయాలని భావించిన ఆయన కాథలిక్ సమాజానికే కాదు, మత పెద్దలందరికీ ఆదర్శనీయంగా నిలిచారు. తన 88వ ఏట మరణించినా, ఆయన ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా ఉండిపోతారు.



# క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్

## 52వ పడిలోకి లిటిల్ మాస్టర్

**ముంబయి,ఏప్రిల్23 (వెలుతురు):** భారత క్రికెట్ దిగ్గజం, ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది అభిమానులను సొంతం చేసుకున్న సచిన్ టెండూల్కర్ అంటే తెలియని వారు ఉండరు. పిన్న వయసులోనే క్రికెట్లోకి అడుగు పెట్టిన సచిన్ ఎన్నో ఉన్నత శిఖారుల అధిరోహించాడు. భారతరత్నను అందుకున్నాడు. ఇప్పటికీ పిల్లలంతా బ్యాట్ చేతపబడితే సచిన్‌లాగా ఫీలవుతుంటారు. ఈ నెల 24తో 52వ పడిలోకి సచిన్ ప్రవేశించబోతున్నాడు. క్రికెట్‌లో ఎన్నో మైలురాళ్లను అధిగమించి తన పేరుపై లెక్కలేనని రికార్డులు రాసుకున్న సచిన్ బర్త్ పుట్టిన రోజు అభిమానులకు చాలా ముఖ్యమైన రోజు. భారత క్రికెట్ చరిత్రలో సచిన్ లేకుండా పేజీ లేదు.  సచిన్ పుట్టిన రోజు సందర్భంగా అతని గురించి అనేక ఆస్తకర విషయాల్లో కొన్ని ... ఫిబ్రవరి 1988లో సచిన్ టెండూల్కర్-వినోద్ కాంబ్లీ కలిసి 664 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. పోటీ క్రికెట్‌లో ఇదే అత్యధిక భాగస్వామ్యం. ఆ మ్యాచ్‌లో సచిన్ 326 పరుగులతో అజేయంగా నిలిచాడు. నవంబరు 1989లో 16 ఏళ్ల వయసులో సచిన్ కరాచీలో పాకిస్థాన్‌తో జరిగిన టెస్టు మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగు పెట్టాడు. అయితే తరువాత ఏడాది అంటే ఆగస్టు 14, 1990లో ఓల్డ్ మాంచెస్టర్‌లో జరిగిన టెస్టులో సచిన్ తొలి సెంచరీ నమోదు చేశాడు. 1996 వన్డే ప్రపంచకప్‌లో 523 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 24 ఫిబ్రవరి 2010లో దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డేలో అజేయంగా 200 పరుగులు చేశాడు. దీంతో వన్డేల్లో డబుల్ సెంచరీ సాధించిన తొలి క్రికెటర్‌గా రికార్డులకెక్కాడు. అతని రికార్డులకు గాను భారతరత్న కూడా వరించింది.

# జమ్మూ కాశ్మీర్ ఉగ్రదాడి అమానుషం..

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు...



**కూకట్ పల్లి ఏప్రిల్ 23 వెలుతురు:**
జమ్మూ కాశ్మీర్ ఉగ్రదాడి లో అమాయక ప్రజలను చంపడం హేయమైన చర్య అని ఈ సంఘటన తనను చాలా బాధ కలిగించిందని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఇలాంటి వారిని క్షమించకూడదని భారత దేశ ప్రతిష్ఠన దిగజార్చడానికి కొంతమంది ఉగ్రవాదులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని కేంద్ర ప్రభుత్వం వీరిని కఠినంగా శిక్షించాలని కోరారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరు ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. దేశ రక్షణ కోసం పోరాడుతున్న సైనికుల సేవకు తాము ఎప్పుడూ రుణపడి ఉంటామని అన్నారు.

# రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే.. రజతోత్సవ సభకు భారీగా తరలివెళ్దాం

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు..

**కూకట్ పల్లి ఏప్రిల్ 23 వెలుతురు:**
ఈ నెల 27న వరంగల్‌లో జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు అందరం ఒక్కటై కదిలి భారీగా తరలివెళ్లి విజయవంతం చేద్దాం అని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు. బుధవారం శేర్లింగంపల్లి, కూకట్పల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక పరిపాలనను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. బిఆర్ఎస్ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో ఎంతోమంది నిరుపేదలకు సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధి పొందామో రైతులకు జరిగిన మేలు వివరించి ప్రజలకు తెలిసేలా చేయాలని, ప్రజలందరూ కూడా స్వచ్ఛందంగా తరలివచ్చేటట్లు వారికి గత ప్రభుత్వ పరిపాలన విధానాన్ని నేడు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను తెలపాలని సూచించారు. అలాగే సభకు వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంచినీరు, భోజన సదుపాయం నాయకులు, కార్యకర్తలు దగ్గరుండి చూసుకోవాలన్నారు. ఎండలు తీవ్రత అధికంగా ఉండటం వల్ల మంచినీటి సదుపాయంకు అంతరాయం కలగకుండా ఎలాంటి ఇబ్బంది ఉన్నా నేరుగా తనకి ఫోన్ చేయాలని తెలిపారు. ఈ రజతోత్సవ వేడుకలను ఒక పండగ వాతావరణం గా చేసుకోవాలని ఎంతో కష్టపడి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని అన్నారు. గత పది ఏళ్లుగా ఎంతో అభివృద్ధి చేసుకున్న రాష్ట్రం నేడు వ్యాపారాలు లేక చెరువులు, ప్రాజెక్టులు ఎండిపోయి భూగర్భ జలాలు అడుగంటిపోయి అటు రైతులకు ఇటు ప్రజలకు ఇబ్బందులు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

# మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు కృషి

- పిఎసి చైర్మన్ అరికపూడి గాంధీ..



**కూకట్ పల్లి ఏప్రిల్ 23 వెలుతురు :**
బస్తీలు, కాలనీల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ అన్నారు. నియోజకవర్గం పరిధిలోని ధీనబంధుకాలనీలో సుమారు రూ.30 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణం పనులకు బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. బస్తీలు, కాలనీల్లో మౌలిక వసతులు కల్పించేందుకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడ రాజీ పడకుండా నాణ్యత ప్రమాణాలతో సకాలంలో పూర్తయ్యేలా శ్రద్ధ తీసుకుంటున్నట్లు గాంధీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కాలనీ అధ్యక్షుడు ఎం.మహేందర్ నాయక్, నాయినేని చంద్రకాంత్ రావు, సంజీవరెడ్డి, వెంకటేశ్వరశెట్టి, దత్తులూరి అశోక్, వార్డ్ మెంబర్ వెంకటయ్య, మహేష్, ఇబ్రహీం, సత్తిరెడ్డి, అనిల్, లక్ష్మయ్య, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ లో సత్తా చాటిన పేదింటి విద్యార్థిని

**వెలుతురు, తుర్కయంజాల్ ఏప్రిల్ 23:**
తుర్కయంజాల్ గ్రామానికి చెందిన గుడ్ల జనార్ధన్, జానకి దంపతుల కుమార్తె గుడ్ల యక్షిత గురుకుల కళాశాలలో సీటు సాధించి బైపిసి ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ ఫలితాలలో 912 /1000 మార్కులు పొంది విజయం సాధించింది. పేదింటి బిడ్డ ప్రభుత్వం గురుకుల కళాశాలలో చదివి ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల తల్లి సంతోషం వ్యక్తపరిచారు కొన్ని సంవత్సరాల క్రితం తండ్రి ఆకస్మితంగా మరణించడంతో ఆర్థిక పరిస్థితులు ఎన్ని అడ్డంకులు వచ్చిన పట్టు వీడని విక్రమార్కుడు లాగా ఎంబిబిఎస్ లో సీటు సాధించడమే లక్ష్యంగా చదువుతానని అన్నింది



# సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన పిఎసి చైర్మన్ అరికపూడి గాంధీ



**కూకట్ పల్లి ఏప్రిల్ 23 వెలుతురు:**
శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ లోని వివేకానంద నగర్ కాలనీ, శ్రీనివాస్ నగర్ మెడికల్ సొసైటీ, వడ్డేపల్లి ఎంక్లేవ్ వద్ద కోటి ఆరు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న బిటి రోడ్డు, సిసి రోడ్డు పనులను శాసనసభ్యులు అరికెపూడి గాంధీ , జిహెచ్ఎంసి ఈ ఈ గోవర్ధన్ గౌడ్ లతో కలిసి కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రోజా దేవి మాట్లాడుతూ డివిజన్ లో ఎక్కడైతే దెబ్బతిన్న రోడ్లు ఉన్నాయో జిహెచ్ఎంసి నిధుల తోటి మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. మంజూరైన పనులు ఇంకా మిగిలిన వాటిని కూడా కాంట్రాక్టర్ తో మాట్లాడి వీలైనంత తొందరగా చేయించడానికి ప్రయత్నం చేస్తామని అన్నారు. కాలనీ వాసులు, ప్రజలు వారికి ఇంకేమైనా ఇబ్బందులు ఉంటే నేరుగా తమని సంప్రదించాలని వాటిని కూడా మంజూరు చేయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టిముక్కుల పెద్ద భాస్కర్ రావు, ఆంజనేయులు, బాబు, మోహన్ రావు, జగదీష్ గౌడ్, శ్రీనివాస్, జై, అఖిల్ వివేకానంద కాలనీ సెక్రటరీ వెంకటేశ్వరరావు మెడికల్ సొసైటీ ప్రెసిడెంట్ జి.పి రెడ్డి, వడ్డేపల్లి ఎంక్లేవ్ సెక్రటరీ సంతోష్ రావు, భగవాన్, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థి మహాత్మ జ్యోతిరావు పూలే గురుకులానికి ఎంపిక



**శంకర్పల్లి వెలుతురు ఏప్రిల్ 23**
ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని శంకర్పల్లి మండలం మోకిలా తండా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి రాములు అన్నారు. ఆ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న చందు చవాన్ విద్యార్థి మొన్న జరిగిన మహాత్మ జ్యోతిరావు పూలే ప్రవేశ పరీక్షలో పాసై గురుకుల పాఠశాలలో సీటు పొందినాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి రాములు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరుగుతుందని, అదేవిధంగా నిష్ణాతులైనటువంటి ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలను ఉండి విద్యాబోధన చేస్తారని కావున తల్లిదండ్రులు ఆలోచించి తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థిని మరియు అతని తల్లిదండ్రులను సన్మానించడం జరిగింది. అదేవిధంగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించి విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో రిపోర్ట్ కార్డ్స్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ శాంతభాయి ప్రధానోపాధ్యాయులు బి రాములు ఉపాధ్యాయులు శివకుమార్ భక్తప్ప మహేష్ అంగన్వాడి ఉపాధ్యాయురాలు మల్లీశ్వరి మరియు గ్రామ పెద్దలు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.




# పహల్గామ్ లో జరిగిన దాడికి ప్రతి చర్య ఉంటుంది

- మాజీ ఎంపీ బీబీ పాటేల్...

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 22:**
జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ లో హిందువులపై జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ బీజేపీ జహీరాబాద్ పట్టణ అధ్యక్షులు పూల సంతోష్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు ఉగ్రవాదుల దిష్టి బొమ్మ చిత్రపటాలు దహనం చేసి నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చనిపోయిన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు దీనికి ప్రతి చర్య ఉంటుంది అని ఇస్లామిక్ తీవ్రవాదని వెంటనే నశింప చేయాలని తీవ్ర ముక్త్ భారత్ ను చేసే పనిలో కేంద్ర ప్రభుత్వం ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ నౌబత్ జగన్నాథ, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ గౌడ్, గొల్ల భాస్కర్, విజేందర్ రెడ్డి, సుధీర్ భండారి, జిల్లా నాయకులు శ్రీనివాస్ గుప్తా, అల్లాడి బక్కయ్య గుప్తా, మఠం విశ్వనాథ్, మండల అధ్యక్షులు దుర్గయ్య, జహీరాబాద్ పట్టణ II అధ్యక్షులు రమేష్ రెడ్డి, మల్లేష్, బంటు విశ్వనాథ్, వైజ్యనాథ్, మహిళా నాయకులు అర్చన శారదా, కుసుమ్, వైష్ణవ్ ప్రీతి, ఓజా, ఉమా రాణి, బిజెపి నాయకులు అరుణ్ సోమ అనిల్, బొగ్గుల సంతోష్, రాఘవేందర్ నాయక్, జీవన్ జైన్, నరేష్ పటేల్, కరకం నాగేందర్, సురేష్ పూరీ అప్పం రమేష్, సందీప్, భాను చందర్ గుప్తా శ్రీకాంత్, విదేశీ మాడపాటి గడ్డం శ్రీధర్ అఖిలేష్ యాదవ్, బస్వరాజ్, ప్రభాకర్ రెడ్డి, జగన్నాథ్ సంగారెడ్డి, ఉప్పల శ్రీకాంత్, నిఖిల్ యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు



# ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవు...

## విత్తన, ఎరువులు, పురుగు మందుల చట్టాల మీద అధీకృత డీలర్లకు అవగాహన

## వ్యవసాయ అధికారుల హెచ్చరిక...



**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 22:**
సంగారెడ్డి జిల్లా రంజోల్ రైతు వేదికలో డివిజన్ పరిధిలోని అధీకృత డీలర్లకి ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల చట్టాల మీద జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు భిక్షపతి కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత వానాకాలం కి సంబందించి దుకాణదారులు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరకి మించి అమ్మితే వారి మీద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రతి దుకాణంలో ధరల పట్టిక, ఎరువులు, విత్తనాల నిల్వల పట్టిక ఏర్పాటు చేయాలి అని తెలిపారు. ప్రతి రోజు జరిగిన అమ్మకాలు, కొనుగోలు వివరాలు నమోదు చేయాలి అని ఆదేశించారు. అలాగే డీలర్లు ఎవరైనా విత్తనాలు కొంటేనే ఎరువులు ఇస్తాం అని రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలా ఎవరైనా ఇబ్బంది పెడితే తమ దృష్టికి తీసుకురావాలని రైతులను కోరారు. ప్రతి రోజు వ్యవసాయ శాఖ అధికారులు మండలంలోని అన్ని దుకాణాలను సందర్శించి ఎరువులు, విత్తనాలు నిల్వల వివరాలను తనిఖీ చేయడం జరుగుతుంది అని తెలిపారు. ప్రస్తుతం మండలంలో ఎలాంటి విత్తనాలు, ఎరువుల కొరత లేదు అని తెలిపారు. ప్రతి రైతుకూ కొనుగోలుకు సంబంధించి రశీదు తప్పనిసరిగా అందజేయాలి అని తెలిపారు. అలాగే ఈ రశీదు పంట కాలం పూర్తి అయ్యేదాకా జాగ్రత్త గా భద్రపరచుకోవాలి అని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు లావణ్య, వెంకటేశ్వర్లు, అభినాష్ వర్మ, హసునుద్దీన్, మరియు వినోద్ కుమార్, స్థానిక విస్తరణ అధికారి ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

# హాజ్ యాత్ర దిగ్విజయంగా సాగించాలి

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు
- డా.. సిద్దం.ఉజ్వల్ రెడ్డి...





**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 22:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం రంజోల్ గ్రామంలోని జామా మసీదులో బుధవారం జహీరాబాద్ నియోజకవర్గం నుండి హాజ్ యాత్రకు వెళ్ళే ముస్లిం సోదరులను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా..సిద్దం.ఉజ్వల్ రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతం సుభిక్షంగా ఉండాలని, యావత్తు భారత దేశం శాంతి సౌభ్రాతృత్వాలతో, సుఖశాంతులతో, పాడిపంటలతో మరింత అభివృద్ధి చెందాలని అల్లాతో ప్రార్థించాలని హాజ్ యాత్రకు వెళ్తున్న భక్తులకు కోరారు. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ ముబీన్, నియోజకవర్గ మైనార్టీ విభాగం అధ్యక్షులు జమిలాలోద్దిన్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ అక్బర్, మాజీ కోప్షన్ మెంబర్ అర్షద్ జమా పటేల్, ఇమామ్ పటేల్, బర్కత్ నియోజకవర్గ మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

# ఎసిబికి చిక్కిన ఇద్దరు అధికారులు

**పెద్దపల్లి,ఏప్రిల్ 23( వెలుతురు):**
అవినీతి నిరోధక శాఖకు మరో రెండు అవినీతి తిమింగళాలు చిక్కాయి. పెద్దపల్లి జిల్లాలో లంచం తీసుకుంటూ ఇద్దరు అధికారులు రెడ్ హ్యాండెడ్ గా ఎసిబి అధికారులకు పట్టుబడ్డారు. ఎస్ఆర్ఎస్పీ సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ సురేష్.. ఓ ఉద్యోగి సెలవు విషయంలో లంచం డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో సదరు ఉద్యోగి ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో పక్కా ప్లాన్ ప్రకారం.. సదరు ఉద్యోగి నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఇద్దరు అధికారులను పట్టు-కున్నారు. వారిని అదుపులోకి తీసుకున్న ఎసిబి అధికారులు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మీనాక్షి నటరాజన్‌తో రాజగోపాల్ భేటీ

**జానారెడ్డిపై వ్యాఖ్యలకు వివరణ ఇచ్చినట్లు సమాచారం**

**హైదరాబాద్,ఏప్రిల్ 23( వెలుతురు):**
గాంధీ భవన్‌లో ఇంఛార్జి మీనాక్షి నటరాజన్‌తో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. వారం క్రితం జానారెడ్డిపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తనకు మంత్రి పదవి రాకుండా మాజీ మంత్రి జానారెడ్డి ధృతరాష్ట్రుడి పాత్ర పోషిస్తున్నాడంటూ తీవ్ర వ్యాఖ్యలే చేశారు అయితే, జానారెడ్డి ఎపిసోడ్‌పై రాజగోపాల్‌రెడ్డి.. బుధవారం స్పందించారు. 'జానారెడ్డి అంటే నాకు గౌరవం. ఆయన మా పార్టీ సీనియర్ నేత. జానారెడ్డి రాసిన లెటర్‌పై ఒక సభలో మాట్లాడాను. మంత్రి పదవి పార్టీ తీసుకోవాల్సిన నిర్ణయం అంటూ రాజగోపాల్‌రెడ్డి చెప్పుకొచ్చారు. కాగా, మంత్రి వర్గ విస్తరణపై సీఎం రేవంత్‌రెడ్డి గట్టి హెచ్చరికలే చేశారు. పార్టీ లైన్ దాటితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యేలకు వార్నింగ్ ఇచ్చారు. సీఎల్పీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదవులు ఎవరికి ఇవ్వాలనేది అధిష్టానం చూసుకుంటుంది. మంత్రి పదవి కోరే వాళ్లు మాట్లాడితే వారికే నష్టం. ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు. అలా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కుంటారు' అంటూ రేవంత్ తేల్చి చెప్పారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్. మంత్రివర్గ విస్తరణపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదన్నారు. ఈ క్రమంలో రాజగోపాల్ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

# అఘోరీకి లింగ నిర్ధారణపరీక్షలు

**న్యాయమూర్తి ఆదేశాలు**

**సంగారెడ్డి,ఏప్రిల్ 23( వెలుతురు):**
చీటింగ్ కేసులో అరెస్టయిన అఘోరీకి సంగారెడ్డి జైలు అధికారులు షాక్ ఇచ్చారు. ఆడ, మగ తేలకుండా ఏ బ్యారక్‌లోనూ ఉంచలేమంటూ అధికారులు తేల్చి చెప్పారు. అఘోరీని తిరిగి పంపించిన సంగారెడ్డి జైలు అధికారులు.. లింగ నిర్ధారణ జరిగితే గాని ఇక్కడ ఉంచుకోలేమని స్పష్టం చేశారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు డాక్టర్ల వైద్య పరీక్షల అనంతరం లింగ నిర్ధారణ జరిగే అవకాశం ఉంది. పరీక్షల తర్వాత చంచల్ గూడ జైలుకు తరలించే అవకాశం ఉంది. కాగా, తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన అఘోరీని పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఓ మహిళను మోసం చేసిన కేసులో అఘోరీని చేవెళ్ల కోర్టులో హాజరుపర్చగా.. న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. మరో వైపు, సంగారెడ్డి జైలుకు తరలిస్తున్న సమయంలో అఘోరీ అరుపులతో హడావుడి చేశాడు. తన భార్య వర్షిణిని తనతోనే ఉంచాలంటూ పట్టుబట్టాడు.

# ఘనంగా కేఎల్ఆర్ జన్మదిన వేడుకలు



**వెలుతురు,తుక్కుగూడ 23ఏప్రిల్:**
తుక్కుగూడ మున్సిపాలిటీ రావి రాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నా యకులు కేఎల్ ఆర్ జన్మదిన వేడు కలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ ఆయురా రోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని సూర్యగిరి ఎల్ల మ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్బంగా యూ త్ కాంగ్రెస్ నాయకులు రంజిత్ మా ట్లాడుతూ కే ఎల్ ఆర్ చేస్తున్న సేవా లని కొనియాడారు. సేవకుడే నాయ కుడు అనే నినాదంతో కార్యకర్తల్లో విశ్వాసాన్ని నింపుతున్నారు. ఈ కా ర్యక్రమంలో బిఆర్ స్వామి, అర్జున్, దర్శన్, మురళీ తదితరులు పా ల్గొన్నారు.

# పిఎస్ఆర్ రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు

- అధికార దుర్వినియోగంతో నటి జెత్వానిపై కేసు
- ఇంటిలిజెన్స్ చీఫ్‌గా ఆదేశాలతోనే అక్రమ అరెస్టులు




**అమరావతి,ఏప్రిల్ 23( వెలుతురు):**
నటి జెత్వాని కేసులో అరెస్ట్ అయిన ఇంటెలిజెన్స్ మాజీ బాస్ పీఎస్ఆర్ ఆంజనేయులు రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ముంబై నటి జెత్వాని కేసులో ఆమె, ఆమె తల్లిదండ్రులను పథకం ప్రకారమే ఆంజనేయులు అరెస్ట్ చేయించారని పోలీసులు తెలిపారు. ఆయన అప్పటిలో ఇంటెలిజెన్స్ బాస్‌గా ఉండటంతో ఆయన ఆదేశాలు మేరకే అక్రమ అరెస్టులు జరిగాయని.. ముందుగా నిర్ణయించిన ప్రణాళిక ప్రకారమే ఈ అక్రమ అరెస్టులు జరిగాయని వెల్లడించారు. ఇందుకు సంబంధించి పీఎస్ఆర్ ఆంజనేయులు, అప్పటి సీపీ కాంతి రాణా తాతా, విశాల్ గున్ని కాల్ రికార్డ్ డేటా కూడా స్పష్టంగా ఉందన్నారు. 2024 జనవరి 30 నుంచి 2024 ఫిబ్రవరి 3 వరకు వీరి ముగ్గురి కాల్ డేటా కూడా సేకరించినట్లు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ తెలిపారు. పీఎస్ఆర్ ఆంజనేయులు ముంబై పోలీస్ అధికారులతో కూడా ఆ సమయంలో టచ్‌లో ఉన్నారని తేలిందన్నారు. ముందుగా నిర్ణయించడం వల్లే అసలు జెత్వానీపై కేసు రిజిస్టర్ చేయకముందే అంటే రెండు రోజులు ముందు ముంబై ఫ్లైట్ టికెట్స్ కొన్నారన్నారు. అసలు కుక్కల విద్యాసాగర్ ముంబై నటి జెత్వానీపై చేసిన ఫిర్యాదులో కూడా నిజం లేదని తేలిందని పోలీసులు పేర్కొన్నారు. దీనికి సంబంధించి న్యాయమూర్తి ముందు ఇచ్చిన 164 వాంగ్మూలం కూడా ఉన్నాయన్నారు. పైగా తనను విశాల్ గున్ని ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను కూడా రిమాండ్ రిపోర్ట్‌లో దర్యాప్తు అధికారి పేర్కొన్నారు. తనని పీఎస్ఆర్ ఆంజనేయులు సీఎంవోకు పిలిపించి జెత్వానీని అరెస్ట్ చేసే టాస్క్ అప్పగించారని విశాల్ గున్ని చెప్పారు. తనకు అసలు ఈ కేసుతో సంబంధం లేకపోయినప్పటికీ టాస్క్ అప్పగించారని విశాల్ గున్ని చెప్పారు. తాను ఈ టాస్క్ పూర్తి చేస్తేనే తనను విశాఖకు రిలీవ్ చేస్తామని చెప్పారని కూడా వివరించారు. అప్పటి ఇంటెలిజెన్స్ బాస్‌గా ఉండటం, తన అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఈ అక్రమ అరెస్ట్ చేయించారని.. ఒక మహిళ వ్యక్తిగత స్వేచ్ఛ ను హరించారని.. అప్పటి డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డికి కూడా ఈ విషయం అప్పటి సీపీ కాంతి రాణా తాతా చెప్పారని.. ఆయన గో ఎహెడ్ అన్నారని రిమాండ్ రిపోర్ట్‌లో తెలిపారు. పీఎస్ఆర్ ఆంజనేయులు అసలు విచారణకు సహకరించలేదని.. ఆయన వద్ద నుంచి ఐఫోన్‌ను సీజ్ చేశామన్నారు. ఆయనను విచారించేందుకు మళ్ళీ కస్టడీకి కూడా తీసుకోవాల్సి ఉందని రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొన్నారు. పీఎస్ఆర్ ఆంజనేయులకు విజయవాడలోని కోర్టు రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. ముంబయి నటి కాదంబరి జెత్వానీ కేసులో మంగళవారం పీఎస్ఆర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. ఆయనకు మే 7 వరకు రిమాండ్ విధిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే, రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పీఎస్ఆర్ ఆదేశాలతో ఫోర్జరీ డాక్యుమెంట్లతో నకిలీ ఆధారాలు సృష్టించారని తేలింది. పీఎస్ఆర్ ఆంజనేయులే కేసు నమోదు చేయాలని కాంతిరాణా, విశాల్ గున్నికి చెప్పినట్లు- రిపోర్టులో పేర్కొన్నారు. పీఎస్ఆర్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. అలాంటి అధికారి సాక్ష్యాలు తారుమారు చేసే, సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉంది. మహిళపై అక్రమ కేసు నమోదుకు అధికారులను ప్రభావితం చేశారు. కిందిస్థాయి అధికారులకు తప్పుడు దిశానిర్దేశం చేశారని రిపోర్టులో పేర్కొన్నారు.

# ఉర్సా భూ కుంభకోణం డైవర్షన్

- అందుకే వైసిపి నేతల అరెస్టులు: మార్గాని

**రాజమండ్రి,ఏప్రిల్ 23( వెలుతురు):**
చంద్రబాబు సమయంలోనే కొత్త డిస్టిలరీలకు అనుమతులు వచ్చాయని వైసీపీ నేత, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడే నాలుగైదు డిస్టిలరీలకు అత్యధికంగా ఆర్డర్లు ఇచ్చేవారని ఆరోపించారు. లిక్కర్ స్కామ్ వ్యవహారంతో సంబంధం లేని ఎంపీ మిథున్ రెడ్డిని ఎందుకు లాగుతున్నారని ప్రశ్నించారు. ప్రైవేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో మద్యం అమ్మకాలు చేపడుతూ... స్కామ్ ను గత ప్రభుత్వానికి అంటకట్టడం దారుణమని వ్యాఖ్యానించారు. ఇవి కేవలం చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న డైవర్షన్ పాలిటిక్స్ మాత్రమేనని మార్గాని భరత్ విమర్శించారు. అయితే, ఉర్సా కంపెనీకి కేటాయించిన భూముల కుంభకోణాన్ని డైవర్ట్ చేయడానికి రాష్ట్రంలో వైఎస్ఆర్సీపీకి చెందిన ప్రముఖులను ప్రభుత్వం అరెస్టు చేసే ప్రయత్నం చేస్తుందని మాజీ ఎంపీ భరత్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్ ఆసుపత్రిల్లో ఆరోగ్య శ్రీ పథకం కింద వైద్యం జరుగుతుందా అని మార్గని భరత్ అడిగారు.

# కోహెడ మండల కేంద్రంలో కొత్త ఆర్ ఓ ఆర్ చట్టం భూ భారతి పై రైతు అవగాహన సదస్సు

- ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్
- రైతుల వద్ద భూ సమస్యలు అడిగి తెలుసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్
- కొత్త ఆర్ ఓ ఆర్ చట్టం భూ భారతి ద్వారా భూసమస్యల పరిష్కారం పై అవగాహన కల్పించిన అధికారులు



**కోహెడ వెలుతురు ఏప్రిల్ 23:**
సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మను చౌదరి,అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్,సిద్దిపేట గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, హుస్నాబాద్ ,కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్ లు తిరుపతి రెడ్డి, బోయిని నిర్మల తదితర అధికారులు

**మంత్రి పొన్నం ప్రభాకర్**

తెలంగాణ ప్రభుత్వం భూములకు సంబంధించి ధరణి చట్టం ద్వారా ఇబ్బందులు పడుతున్నారని లక్షల మంది పిటిషన్ పెట్టుకున్న ధరణి లొసుగులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన విధముగా కొత్తగా భూ భారతి చట్టాని తీసుకొచ్చాం.. రాష్ట్రంలో ప్రతి మండలంలో భూ భారతి పై అవగాహన కల్పిస్తున్నాం రైతులకు భూ భారతి ద్వారా చట్టం అమలు చేస్తున్న వాటిపై అడిషనల్ కలెక్టర్ వివరణ ఇచ్చారు గతంలో తెల్ల కాగితాల పై రాసుకున్న కాగితాలు ,రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉన్నాయి ఇప్పుడు భూముల ధరలు పెరిగిన తర్వాత ఒకరి భూమి ఇద్దరు రిజిస్ట్రేషన్ చేసుకోవడం.. రిజిస్ట్రేషన్ చేసిన చేయలేదనడం లాంటివి 2014 తరువాత జరిగాయి గ్రామాల వారిగా గతంలో రెవెన్యూ రికార్డులు ఉండేవి ఎవరి భూమి ఎవరు కొనుక్కుంటున్నారు అని మొత్తం డీటెయిల్స్ రెవెన్యూ రికార్డుల్లో ఉండేవి ప్రతి గ్రామంలో భూములకు సంబంధించినా సమాచారాన్ని గ్రామ రెవెన్యూ



అధికారి ఉండాలని 10 వేల పోస్టుల నియామకం జరుగుతుంది రాష్ట్రంలో భూముల పంచాయితీ ఉండకూడదని ఈ నిర్ణయం తీసుకుంది మా తండ్రి గారి భూమి నా పేరుకు రాసుకోవడానికి కూడా రికార్డుల్లో కనిపించడం లేదు ఈ చట్టం అమలు ద్వారా గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు లేకుండా హద్దులతో సహా అన్ని రకాల భూ వ్యవస్థకు ఒక పద్ధతిగా ఇది ఉపయోగపడుతుంది భూ హక్కులపై ఆధార్ లాగ భూధార్ తీసుకొస్తున్నాం గ్రామాల్లో చదువులేకున్న భూముల పై అవగాహన ఉన్నవారు ఉంటారు నిజాం ప్రభుత్వం నుండి ఇప్పటిదాకా భూ చట్టాలు ఏమున్నాయి అని ఉంది అందులో దరిద్రమైన చట్టం ధరణి.. దాని ద్వారానే సమస్యలు వచ్చాయి పరంపోగు భూములు ,ప్రభుత్వ భూములు తీసుకున్న వారి లెక్కలు తీయండి దానిని అభివృద్ధి కోసం వాడండి.. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎక్కడైనా ప్రభుత్వ భూమి కబ్జా చేశారు అంటే ప్రభుత్వం ఆ భూమి గుంజుకుంటుంది .. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం ఆ భూములను తీసుకొని వాటిని అభివృద్ధికి వాడదాం మీకు భూములపై ఏమైనా సమస్య ఉంటే వచ్చి అడగండి సలహా ఇవ్వండి ప్రజాస్వామ్యంలో అందరం భాగస్వామ్యులం. మీ అందరి భాగస్వామ్యంతో ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడింది మేము చెప్పిన అన్ని కార్యక్రమాలు చేస్తున్నాం.. కొంత ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి..ఇచ్చిన హామీలు అన్ని అమలు చేస్తాం..

**మను చౌదరి, సిద్దిపేట జిల్లా కలెక్టర్**

భూ భారతి - 2025 పై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టాం అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ భూభారతి పై క్లుప్తంగా అవగాహన కల్పించారు ప్రజావాణి లో ధరణి టైంలో మా భూమి వేరే వాళ్ళ పేరు మీద ఉంది అని పిర్యాదు లు అందేవి భూభారతి చట్టంలో రెవెన్యూ రికార్డుల్లో తప్పిదం అయిన నేమ్ తప్పుగా వచ్చిన ఇద్దరికి నోటీసు ఇచ్చి వారిని పిలిపించి సమస్య పరిష్కారం అయ్యే విధంగా భూభారతి లో ఉంది సాధబైనామా 2014 జూన్ 2 కి ముందు తెల్ల కాగితం మీద రాసుకున్నటువంటి వారివి సదాబైనామా క్లియర్ చేయాలని ఉంది శాశ్వత ఐడీ కార్డులు ఇవ్వడం జరుగుతుంది తహసీల్దార్ నిర్ణయం తీసుకున్నప్పుడు రైతు అన్యాయం జరిగింది అని అర్జీలు పెట్టుకుంటే ఆర్డీవో ,కలెక్టర్ దాని మీద మళ్ళీ విచారణ చేయవచ్చు భూభారతి చట్టంలో రైతులకు పట్టెదారులకు ఇబ్బంది కలగకుండా చూడడం జరిగింది 14 ఏప్రిల్ 2025 నుండి ఈ చట్టం అమలులోకి వచ్చింది 30 తారీఖు వరకు భూభారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సు కల్పిస్తాం..

# భూభారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం

**రంగారెడ్డి వెలుతురు ఏప్రిల్ 23:**
భూభారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం జరుగుతుందని, భూ భారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతీ మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం రంగారెడ్డి జిల్లా హయాత్ నగర్ ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సులో కలెక్టర్ నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ భారతి చట్టం-2025 ను ఈ నెల 14న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి నాడు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. చట్టం పై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ధరణి స్థానంలో కొత్తగా భూభారతి (భూమి హక్కుల చట్టం) తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఇందులో అన్ని రకాల అప్లికేషన్స్ ఉన్నాయని, హక్కుల రికార్డులలో తప్పుల సవరణ చేసుకోవచ్చని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం జరుగుతుందని సూచించారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ, పాసు పుస్తకాలలో భూమి పటం, భూముల సమస్యలు పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉంటుందని తెలిపారు. తహసీల్దార్ చేసిన మ్యుటేషన్లపై లేదా జారీచేసిన పాసుపుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే ఆర్డీఓ కు అప్పీలు చేసుకోవచ్చని, ఆర్డీఓ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే జిల్లా కలెక్టర్ కు అప్పీలు చేసుకోవచ్చని, కలెక్టర్ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ కు అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. భూదార్ కార్డుల జారీ, రైతులకు ఉచిత




న్యాయ సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ చట్టంలో ఏమైనా అభ్యంతరాలు, అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చని అన్నారు. సాదా బైనామాలు, వారసత్వంగా వచ్చిన భూములపై 30 రోజుల్లోగా విచారణ చేయడం జరుగుతుందని, ఒకవేళ అట్టి గడువులోగా విచారణ చేయని పక్షంలో రిజిస్ట్రేషన్ అయినట్లుగా భావించవచ్చని తెలిపారు. ప్రజలు ఈ చట్టం పై అవగాహన ఏర్పర్చుకోవాలని, వారికి ఉన్న భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం మే మొదటి వారం నుండి గ్రామాలలో సదస్సులు నిర్వహించేందుకు వచ్చే అధికారులకు అర్జీలు సమర్పించవచ్చని సూచించారు. అంతకుముందు సరూర్ నగర్ మున్సిపల్ వార్డులో నిర్వహించిన భూభారతి చట్టం-2025 అవగాహన సదస్సులో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొని రైతులకు భుభారతి చట్టంలోని కీలక అంశాల గురించి పవర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ధరణి సమయంలో రైతులు భూ సమస్యలకు చాలా ఇబ్బందులు పడేవారని అట్టి సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి తెస్తే వారు ఏం చేయలేని పరిస్థితిలో ఉండేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్ఓఆర్ చట్టం భూభారతి చట్టం-2025 ద్వారా రైతులకు సులభతరమైన న్యాయమైన సేవలు అందిస్తామన్నారు. రెవెన్యూ సదస్సుకు హాజరైన రైతులు అడిగిన ప్రశ్నలకు అదనపు కలెక్టర్, కలెక్టర్ సమాధానాలు ఇవ్వడం జరిగినది. ఈ సదస్సులలో కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, సరూర్ నగర్ మున్సిపల్ కమిషనర్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్ రెడ్డి, స్థానిక అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# డొల్ల కంపెనీలకు వేలకోట్ల భూ పందేరం

- విశాఖలో 99 పైసలకే ఎకరం ఎలా ఇస్తారు
- తెరపైకి లోకేశ్ బినామీల డొల్ల కంపెనీలు
- భూ పందేరాలపై విచారణ చేయించాలి
- వైఎస్సార్‌సీపీ జాయింట్ సెక్రటరీ కారుమూరు వెంకటరెడ్డి

**అమరావతి,ఏప్రిల్ 23( వెలుతురు):**
విశాఖలో రూ.3 వేల కోట్ల విలువైన భూములను 99 పైసలకే డొల్ల కంపెనీ ఉర్సా క్లస్టర్స్‌కు కేటాయించడం వెనుక మంత్రి నారా లోకేష్, ఆయన బినామీలే సూత్రధారులని వైఎస్సార్‌సీపీ జాయింట్ సెక్రటరీ కారుమూరు వెంకటరెడ్డి మండిపడ్డారు. తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ తన సన్నిహితుడు కిలారు రాజేష్ ద్వారా పెద్ద సంఖ్యలో డొల్ల కంపెనీలను సృష్టించి, వాటికి ప్రభుత్వం ద్వారా కారుచౌకగా విలువైన భూములను కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంపద సృష్టిస్తానని చెబుతున్న చంద్రబాబు ప్రజల సంపదను దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం విలువైన భూములను ప్రైవేటు సంస్థలకు దోచిపెడుతోందన్నారు. ఊరు, పేరు లేని ఉర్సా క్లస్టర్స్ అనే సంస్థకు విశాఖలో అత్యంత ఖరీదైన భూమిని కారుచౌకగా కట్టబెట్టింది. గత వారం రోజులుగా దీనిపై రాష్ట్ర ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ డొల్ల కంపెనీ హైదరాబాద్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో రెండు నెలల కిందటే రిజిస్టర్ అయ్యింది. అటువంటి కంపెనీకి 56 ఎకరాల భూమిని కట్టబెడతారనే దానిపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వ అవినీతిపై ఇంత పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నా, దీనిపై రాష్ట్రంలోని ఒక్క మంత్రి కూడా ధైర్యంగా ప్రజల ముందుకు వచ్చి వివరణ ఇవ్వలేదన్నారు. ఇద్దరు డైరెక్టర్లు తప్ప ఒక్క ఉద్యోగి కూడా లేని ఈ కంపెనీకి ఎకరం రూ.50 కోట్ల విలవైన భూములు, అంటే దాదాపు రూ.3 వేల కోట్ల విలువైన భూమిని కేవలం 99



పైసలకే కట్టబెట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఇటువంటి సూట్‌కేస్ కంపెనీలను పెద్ద ఎత్తున రిజిస్టర్ చేయించడం, వాటికి కారుచౌకగా ఖరీదైన భూములను కట్టబెట్టించడం చేయిస్తున్నారు. ఇది ఒక ఆర్గనైజ్డ్ స్కామ్. ప్రభుత్వమే బినామీలను ముందు పెట్టి, ఆస్తులను దోచేస్తోందని ఆరోపించారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలోనే టీసీఎస్ ప్రతినిధులతో చర్చలు జరిగాయి. తరువాత కోవిడ్ కారణంగా టీసీఎస్ ఏపీకి రావడం ఆలస్యం అయ్యింది. 2022లో టీసీఎస్‌కు చెందిన చంద్రశేఖరన్ ఏపీకి వచ్చి ప్రభుత్వ అధికారులతో భేటీ అయ్యారు. తరువాత ఎన్నికలు రావడంతో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. టీ-సీఎస్‌తో ప్రభుత్వ సంప్రదింపులు కొనసాగాయి. టీ-సీఎస్‌కు విశాఖలో 21.16 ఎకరాల భూమిని కేవలం 99 పైసలకే విక్రయిస్తూ కూటమి ప్రభుత్వం ఈనెల 21వ తేదీన జీవో జారీ చేసింది. ఈ భూముల విలువ వేలకోట్ల రూపాయలు ఉంటుంది. కనీసం వాటి మార్కెట్ విలువపై కొంతశాతం తగ్గించి విక్రయించినా ప్రభుత్వానికి ఆదాయం సమకూరేదని అన్నారు. అలా కాకుండా 99 పైసలకు విక్రయించడం చూస్తే, దేశంలో ఎక్కడైనా ఇలా జరిగిందా అనే అనుమానం కలుగుతోంది. ప్రజాసంపదను ప్రైవేటు-సంస్థలకు ఇచ్చే సమయంలో ప్రోత్సహకరంగా విధానాలు ఉండాలే తప్ప, పూర్తిగా ఉచితంగా దారాదత్తం చేసేలా ఏ ప్రభుత్వమైనా వ్యవహరిస్తుందా అని ప్రశ్నించారు. ఈ కేటాయింపులను ప్రశ్నిస్తే, పరిశ్రమలను, ఐటీ సంస్థలను అడ్డుకుంటున్నారని మాపైన దుష్ప్రచారం చేస్తున్నారని వెంకట్ రెడ్డి అన్నారు. ఉర్సా ప్రతినిధులు పెందుర్తి విజయ్‌కుమార్, ఆయన కుమారుడు పెందుర్తి కౌశిక్, మరో వ్యక్తి అబ్బూరి సతీష్. వీరు అమెరికాలోని తన సొంత ఇంట్లో ఒక కంపెనీని రిజిస్టర్ చేసుకున్నారు. ఈ కంపెనీని చూపించి ఇటీవల దావోస్‌లో తెలంగాణలో అయిదు వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెడతామంటూ ఎంఓయు చేసుకున్నారు. తరువాత ఎపీలో కూడా ఇదే తరహాలో మరో అయిదు వేల కోట్ల రూపాయల పెట్టుబడులు అంటూ స్కామ్‌ను నడిపించారు. గతంలో ఐఎంజీ భరత్ పేరుతో వేల కోట్ల రూపాయల విలువైన భూములను బిల్లీరావుకు కట్టబెట్టేందుకు చంద్రబాబు ఏరకంగా ప్రయత్నించాడో అందరికీ తెలుసు. ఇప్పుడు లోకేష్ తండ్రిని మించిన తనయుడిగా ఉర్సా సంస్థను తెరమీదికి తీసుకువచ్చారని ఆరోపించారు. డొల్ల కంపెనీలకు విలువైన భూములను దోచిపెడుతుంటే చూస్తూ ఊరుకోవాలా? వైఎస్సార్‌సీపీ హయాంలో అనేక కంపెనీలను ప్రోత్సహించాం, మీలా ఉచితంగా భూములను ధారాదత్తం చేయలేదన్నారు. . తెలుగుదేశం ప్రభుత్వం దిగిపోయే నాటికి విశాఖలో 161 స్టార్ట్ అప్ ఐటీ- కంపెనీలు ఉంటే, వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో కొత్తగా 425 కంపెనీలు ఏర్పాటయ్యాయి. తెలుగుదేశం దిగిపోయే నాటికి ఐటీ- ఉద్యోగులు ఏపీలో 27643 మంది ఉంటే వైయస్ జగన్ ప్రభుత్వ హయాంలో 75,551 మందికి పెరిగారు. మేం అడ్డుకునే వారిమే అయితే వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో కంపెనీలు ఎలా పెరిగాయి, ఉద్యోగులు ఎలా పెరిగారు? ఉర్సా, లులూ వంటి సంస్థలకు కారుచౌకగా భూములను కట్టబెట్టడం ద్వారా, పెద్ద ఎత్తున లబ్ధి పొందాలని చంద్రబాబు, లోకేష్ ప్రయత్నిస్తున్నారు. ఇటువంటి విధానాలను ఖచ్చితంగా ప్రశ్నించి తీరుతాం అని అన్నారు.

## ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన భీమ లక్ష్మణ్ ముదిరాజు



**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23:** బుధవారం రోజున రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు భీమ లక్ష్మణ్ ముదిరాజు ఏఐసీసీ ఇన్‌చార్జి గౌరవ మీనాక్షి నటరాజన్ మేడం గారిని మర్యాదపూర్వకంగా కలిసి, కలియుగ దైవమైన శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి వారి తీర్థప్రసాదాన్ని అందజేశారు. అనంతరం పలు అంశాలను మేడం గారి దృష్టికి తీసుకువచ్చారు. మేడం గారు వాటిని క్షుణ్ణంగా విని, అన్ని విషయాలను సమగ్రంగా పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. అంతేకాక, ముదిరాజుల కులానికి మన కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ అండగా నిలుస్తుందని స్పష్టంగా తెలియజేశారు.

## నూతన దంపతులు ఆవుల మహేష్ నాయుడు, పూజితలను ఆశీర్వదించిన బీసీ నేత జాజుల లింగంగౌడ్



**దామచర్ల వెలుతురు ఏప్రిల్ 23:** నల్గొండ జిల్లా దామచర్ల మండలం తేట్టేకుంట గ్రామానికి చెందిన ఆవుల మహేష్ నాయుడు,పూజితల వివాహము దామచర్ల మండలంలోని లక్ష్మారెడ్డి ఫంక్షన్ హాల్ లో జరిగిన వివాహానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

## నలుగురు వికలాంగులకు వీల్ చైర్ ఇచ్చిన తిరుమలగిరి అంగన్వాడి సూపర్వైజర్ కందుకూరి మంగమ్మ



**తిరుమలగిరి వెలుతురు ఏప్రిల్ 23:** సూర్యాపేట జిల్లా కలెక్టర్ గారి ఆదేశాలతో తుంగతుర్తి సిడిపిఓ ఆదేశాల మేరకు నలుగురు వికలాంగులకు వీల్ చైర్ ఇవ్వడం జరిగింది తిరుమలగిరి అంగన్వాడి సూపర్వైజర్ కందుకూరి మంగమ్మ తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామానికి చెందిన నక్క లింగయ్య యాదవ్ వల్లపు సుభద్ర బందెల అరవింద్ కోర్ణ వెంకన్న నలుగురి వికలాంగులకు ఉన్నారు. గత మూడు సంవత్సరం లో 100 శాతం శారీరక వికలాంగునిగా డాక్టర్ ధృవీకరణ పత్రం కలిగి ఉన్నాడు. కానీ ఇంతవరకు ఈ నలుగురికి వికలాంగుల పింఛన్ రావడం లేదని, కనీసం కూర్చోవడానికి వీల్ చైర్ కూడా అధికారులు అందించకపోవడంతో తాటిపాముల గ్రామానికి చెందిన కోలా రమేష్ గౌడ్ జిల్లా కలెక్టర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్ గారు వెంటనే స్పందించి తుంగతుర్తి సిడిపిఓ ఆదేశాల మేరకు వీల్ చైర్ . ఈరోజు తాటిపాముల గ్రామంలో ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది పుష్పలత సునీత భూషణమ్మ పాల్గొనడం జరిగిందిద.

## పాల్గాంలో ఉగ్రదాడిని ఖండిస్తూ మృతి చెందిన వారందరికీ నివాళులు అర్పించిన కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23:** మంగళవారం జమ్మూ కాశ్మీర్ లోని పాల్గాంలో జరిగినటువంటి ఉగ్రదాడిని ఖండిస్తూ బుధవారం రోజున నాయక్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ డివిజన్ లో మీ మెయిల్కోటే పార్క్ లో మృతి చెందిన వారందరికీ నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు ప్రజలు ఇతరులు పాల్గొన్నారు.

## రాజీవ్ వికాసం..దరఖాస్తుల అందజేతకు నేడే చివరి తేదీ

- లబ్ధిదారులు మండల కార్యాలయాల్లో దరఖాస్తు పత్రాలు అందజేయాలి
- చారకొండ ఎంపీడీవో ఇసాక్ హుస్సేన్

**వెలుతురు చారకొండ 23 ఏప్రిల్:**



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కోసం ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు ఆ దరఖాస్తు ఫారాలను నేడు మండల కార్యాలయాల్లో అందజేయా లని చారకొండ ఎంపీడీవో ఇసాక్ హుస్సేన్ అన్నారు. బుధవారం మండల కార్యాలయంలో ఎంపీడీవో మాట్లా డుతూ..నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు ఫామ్ పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీక రణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ అకౌంట్, విద్యార్హత పత్రాలను జత చేసి కార్యాలయంలో అంద జేయాలని తెలిపారు. ఈ నెల 24 (నేడు, చివరి తేదీ) గురువారం ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని, కార్యాలయంలో అందుబాటులో ఉన్న అధికారులకు అందజేయాల ని సూచించారు.

## కాశ్మీర్ లోయలో కాల్పులు జరిపిన ఉగ్రవాదులను పట్టుకొని కాల్చి చంపాలి

### - జాజుల లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23:** కాశ్మీర్ లోయలోని అనంత నాగ్ జిల్లా పహల్గంలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో మరణించిన వారి కుటుంబాలకు బీసీ సంక్షేమం తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉగ్రవాదుల దాడిలో మరణించిన హైదరాబాద్ కు చెందిన ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి మనీశ్ తివారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ ప్రకృతి అందాలను వీక్షించడానికి వచ్చిన పర్యాటకులపై హఠాత్తుగా దాడికి పాల్పడడం పిరికి పందుల చర్యగా అభివర్ణించారు. సైనిక దుస్తుల్లో వచ్చి అమాయకులపై విచక్షణ రహితంగా కాల్పులు జరపడం అనేది చేతకానితనానికి నిదర్శనం. ఉగ్రవాదుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కటినంగా వ్యవహరించాలని,దీనికి ప్రతీకారం తీర్చుకోవాల్సిందేనని కాల్పులకు పాల్పడిన నిందితులను త్వరగా పట్టుకొని కాల్చి చంపాలని అప్పుడే చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరుతుందని అన్నారు. ఇలాంటి చెత్త వేదవలకు భూమిపై జీవించే హక్కు లేదని అన్నారు. మృతుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు మహేష్ గౌడ్, మునుకుంట్ల సైదులు శరత్ వంశీ సందీప్ వీర రాజు జగన్ శ్రీనివాస్ వెంకటేష్ సతీష్ నరేశ్ రవి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానించిన రత్న సాన్వి వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ సత్యరాజ్ ఉపారపు







**గుడిహత్నూర్ వెలుతురు ఏప్రిల్ 23:** ప్రతి విద్యార్థికీ ప్రోత్సాహం అనేది ఎంతో బలాన్ని ఇస్తుందని అలాగే మరిన్ని విజయాలు సాదించాలనే లక్ష్యాన్ని నిర్దేశిస్తుందని రత్న సాన్వి వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ సత్యరాజ్ ఉపారపు అన్నారు. ఇటీవల వెలువడిన ఇంటర్ పలితాల్లో గుడిహత్నూర్ మండల కేంద్రంలో గల తెలంగాణ ఆదర్శ పాఠశాల/ కళాశాలకు చెందిన ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బుధవారం అభినందనలు తెలిపారు. శాలువాతో సన్మానించి, సావిత్రి బాయి పూలే ఫొటో బహుకరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతు ప్రయివేటు కళాశాలకు దీటుగా మెరుగైన ఫలితాలు సాధించడం సంతోషకరమని పట్టుదలతో చదివితే విజయం సొంతం అవుతుందని విద్యార్థులు ఉన్నంతంగా ఎదిగేందుకు తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సాహించాలని అయన అన్నారు. భవిష్యత్ లో ఉన్నత విద్యను అబ్యసించి గొప్ప ప్రయోజకులు అవ్వాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సొసైటీ సభ్యులు అతీష్ కుమార్, చట్ల సంతోష్ ఉపాధ్యాయులు రమేష్ విద్య సాగర్, జయ కుమారి, ఇందిరా, సుప్రజ, తదితరులు ఉన్నారు.

## సన్న బియ్యం లబ్ధిదారు తలారి చంద్రయ్య నివాసంలో భోజనం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఇతర అధికారులు

### రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి పౌరుడు సన్న బియ్యం తినాలని ఉగాది పండుగ నుండి సన్న బియ్యం పంపిణీ

### మంత్రి పొన్నం ప్రభాకర్





**కోహెడ మండలం వెలుతురు ఏప్రిల్ 23:** కోహెడ మండల కేంద్రంలో సన్న బియ్యం లబ్ధిదారు తలారి చంద్రయ్య నివాసంలో భోజనం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ ,జిల్లా కలెక్టర్ మను చౌదరి,ఇతర అధికారులు సన్న బియ్యం పథకం ప్రారంభించిన తరువాత తమ కుటుంబానికి ఎంతో లబ్ది జరుగుతుందని తెలిపిన తలారి చంద్రయ్య కుటుంబ సభ్యులు.. వారికి ఎన్ని కిలోల సన్న బియ్యం వస్తున్నాయి గతంలో ఉన్నప్పుడు ఇప్పుడున్న పరిస్థితుల పై ఆరా తీసిన మంత్రి పొన్నం ప్రభాకర్ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి పౌరుడు సన్న బియ్యం తినాలని ఉగాది పండుగ నుండి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది కోహెడ మండలంలోని తలారి చంద్రయ్య మల్లవ్వ ఇంట్లో జిల్లా కలెక్టర్, నేను ,మండల పార్టీ నాయకులు అందరం కలిసి వారింట్లో భోజనం చేశాం మల్లవ్వ మంచి భోజనం పెట్టింది.. వారిది రేకుల గుడిసె.. వారికి ఇందిరమ్మ ఇళ్లు కావాలని అడిగారు.. వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం ఒకవైపు సన్న బియ్యం మరోవైపు ఇందిరమ్మ ఇల్లు ,కొత్త రేషన్ కార్డులు ,200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, గురుకులాల్లో నాణ్యమైన భోజనం అందించడానికి మెస్ చార్జీలు ,కాస్మోటిక్ ఛార్జీలు పెంచాం , ఉద్యోగ నియామకాలు చేశాం, సన్న వడ్లకి 500 బోనస్,ప్రభుత్వం అనేక రకాల కార్యక్రమాలు చేపట్టింది తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు న్యాయం చేయాలనీ చాలా కార్యక్రమాలు కొనసాగిస్తుంది సన్న బియ్యం కార్యక్రమం చారిత్రాత్మక నిర్ణయం దేశంలో తెలంగాణలో మాత్రమే ఈ కార్యక్రమం జరుగుతుంది దీనిని కూడా రాద్ధాంతం చేసే ప్రయత్నం వద్దు దీనిని కూడా మిగతా రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకునేలా కేంద్రంలో ప్రాతినిధ్యం వహిస్తున్న వారు చెప్తే సంతోషిస్తాం ఎవరు హక్కుదారులు ఎవరు వాటదారులు అనే సందర్భం కాదు సన్న బియ్యం తింటున్న ప్రజలకు ఇంకా ఏవిధంగా మేలు చేయాలనే ఆలోచిస్తున్నాం..

## లిక్కర్ కేసులో బిగ్‌బాస్‌ను బయటపెడతాం

### మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి




**అమరావతి,ఏప్రిల్ 23( వెలుతురు):** రాష్ట్రంలో గత ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణం కేసు హాట్ టాపిక్‌గా నడుస్తోంది. ఈ స్కామ్‌లో నిందితులను పట్టుకునేందుకు సిట్ అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే పలు ఆధారాలను సేకరించిన సిట్... ఈ స్కామ్‌లో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డిని అరెస్ట్ చేసి విచారించగా.. షాకింగ్ విషయాలు బయటకు వచ్చాయి. జగన్ చెప్పడం వల్లే తాను చేసినట్లు అంగీకరించారు రాజ్ కసిరెడ్డి. ఇదిలా ఉండగా.. మద్యం కుంభకోణానికి సంబంధించి ఒక్కొక్కటిగా వాస్తవాలు బయటకు వస్తుండటంపై మంత్రి కొల్లు రవీంద్ర స్పందించారు. గత ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారంటూ మండిపడ్డారు. అంతేకాకుండా అరాచక శక్తులకు స్థానం లేదంటూ వైసీపీకి మంత్రి మాస్ వార్నింగ్ ఇచ్చారు. బిగ్ బాస్ బండారం మొత్తం బయటపెడతామని హెచ్చరించారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కో ఇటుక పేర్చుకుంటూ రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం నిర్మిస్తోందన్నారు. అభివృద్ధి సంక్షేమాన్ని చూసి ఓర్వ లేక వైసీపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. మద్యం స్కాంలో బాగోతాలన్నీ బయటకొస్తున్నాయని తెలిపారు. పేదల బియ్యాన్ని బొక్కిన పేర్ని నాని నేడు బీరాలు పోతున్నాడంటూ విమర్శించారు. మచిలీపట్నంలో కనీ వినీ ఎరుగని అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ప్రజాస్వామ్యంలో అరాచక శక్తులకు స్థానం లేదని మంత్రి కొల్లు రవీంద్ర మాస్ వార్నింగ్ ఇచ్చారు. కాగా.. లిక్కర్ స్కామ్ కేసులో గత కొద్దిరోజులుగా తప్పించుకు తిరుగుతున్న రాజ్ కసిరెడ్డిని ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లో అరెస్ట్ చేసిన పోలీసులు విజయవాడకు తీసుకొచ్చి.. లిక్కర్ స్కామ్‌పై సుదీర్ఘంగా విచారించారు. ఈ విచారణలో పలు కీలక విషయాలను సిట్ అధికారులు రాబట్టారు. అనంతరం కసిరెడ్డిని కోర్టుకు తరలించగా రిమాండ్ విధించడంతో విజయవాడ జైలుకు తరలించారు. మద్యం కుంభకోణం కేసులో మొత్తం 29 మందిని నిందితులుగా చేర్చారు. ఈ కేసులో రాజ్ కసిరెడ్డి ఏ1గా ఉన్నారు. అలాగే కసిరెడ్డి రిమాండ్ రిపోర్టులోనూ సంచలన విషయాలు బయటకు వచ్చాయి. ప్రభుత్వానికి, పార్టీకి బాగా నిధులు వచ్చేలా మద్యం పాలసీపై వర్కవుట్ చేసే బాధ్యతను అప్పటి సీఎం జగన్ తనకు చెప్పినట్లు- కసిరెడ్డి ఒప్పుకున్నారు. అందరూ కలిసే మద్యం నుంచి ముడుపులు రాబట్టేందుకు పథకం రచించినట్లు- చెప్పుకొచ్చారు. అయితే ఈ కేసులో తన పాత్ర, కుట్ర, నేరాన్ని అంగీకరించిన కసిరెడ్డి నేరాంగీకారపత్రంపై సంతకం చేసేందుకు అంగీకరించనట్లు- సిట్ అధికారులు తెలిపారు.

## నూతన వదూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు



**వెలుతురు, హైదరాబాద్ 23 ఏప్రిల్ :** తెలంగాణ గౌడ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బద్దం ధనుంజయ గౌడ్, భార్గవి దంపతుల కుమార్తె హైందవి, బుచ్చిదాసు గౌడ్ కుమా రుడు నిఖిల్ కుమార్ గౌడ్ కుమారు డి వివాహ వేడుక బుధవారం నగ రంలోని ఓ కన్వెన్షన్ హాల్లో ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్. హరినాథ్ రెడ్డి, జీవీ.హరీష్ గౌడ్, దేవిరెడ్డి విజితారెడ్డి, భూదాన్ సాగర్ రెడ్డి తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదిం చి, శుభాకాంక్షలు తెలియజేశారు.

## కాశ్మీర్లోని పెహల్గాం సంఘటన అమానవీయం

- టెర్రరిస్టుల దుశ్చర్యలు ఇకనైనా మానుకోవాలి
- బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్
- మనోహరాబాద్ లో నల్ల బ్యాడ్జిలతో కోవొత్తుల ర్యాలీ



**మనోహరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23:** కాశ్మీర్లోని పెహల్గాంలో 28 మంది హిందువులను కిరాతకంగా చంపినటువంటి ఇస్లామిక్ టెర్రరిస్టుల దుశ్చర్యకు నిరసనగా బుధవారం రోజున మనోహరాబాద్ మండల కేంద్రంలో నల్ల బ్యాడ్జి లతో కోవొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు బక్క వెంకటేష్ గౌడ్,రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు నత్తి మల్లేష్ ముదిరాజ్ గారు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కమ్మరి నరేందర్ చారి,మాజీ సర్పంచ్ ఐలయ్య యాదవ్, మాజీ ఉపసర్పంచ్ సాదు సత్యనారాయణ, కొత్తూరి నర్సింలు, మండల సీనియర్ నాయకులు పాగాలా అజయ్, కొల్తూరి నరేష్ గౌడ్,కొత్తూరి మల్లేష్, హరిబాబు గౌడ్,కరాటే మల్లేష్, మామిళ్ళ ప్రణయ్, చాపల విజయ్, కిరణ్, రాజేష్ గౌడ్, శ్రీశైలం యాదవ్, రితీష్ ముదిరాజ్, ఎర్ర కృష్ణ, ఉసిరిక పల్లి రాజు, బాలకృష్ణ, కర్రె కనకరాజు, ప్రవీణ్ యాదవ్, పంది నవీన్, మంచి గిరీష్, కళ్లెం యాదగిరి, నరేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

# నరెడ్కో భేటీ

హైదరాబాద్ , ఏప్రిల్ 23, ( వెలుతురు)

తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన భూ భారతి, బిల్డ్ నౌ అప్లికేషన్లు రియల్ ఎస్టేట్ రంగానికి ఎంతో దోహదపడనున్నాయని నేషనల్ రియల్ ఎస్టేట్ డెవల్మెంట్ కౌన్సిల్ తెలంగాణ చాప్టర్ పేర్కొంది. ధరణి స్థానంలో భూ భారతితో గతంలో ఉన్న భూముల లావాదేవీలకు సంబందించిన వివాదాలకు తెర పడనుందని నరెడ్కో స్పష్టం చేసింది. టీజీ బీ పాస్ స్థానంలో బిల్డ్ నౌ అప్లికేషన్ ద్వార భవన నిర్మాణాలకు గంటల్లోనే అనుమతులు లభించేలా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని నరెడ్కో ప్రతినిధులు తెలిపారు. రానున్న రోజుల్లో హైదరాబాద్ నిర్మాణరంగానికి మంచి భవిష్యత్తు ఉందని, రియల్ ఎస్టేట్ రంగానికి తెలంగాణ సర్కార్ మంచి ప్రోత్సాహాన్ని అందిస్తోందని అన్నారు.

## ఎపిలో పదో పరగతి పరీక్షల ఫలితాల్లో చరిత్ర సృష్టించిన కాకినాడ విద్యార్థిని




అమరావతి , ఏప్రిల్ 23, ( వెలుతురు)

ఎపిలో పదో పరగతి పరీక్షల ఫలితాల్లో కాకినాడ విద్యార్థిని చరిత్ర సృష్టించింది. ఇప్పటివరకూ ఎవరికీ సాధ్యం కాని అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకుంది. బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో కాకినాడకు చెందిన విద్యార్థిని యల్ల నేహాంజని 600కు 600 మార్కులు సాధించింది. వందకు వందశాతం మార్కులు తెచ్చుకున్న తొలి విద్యార్థినిగా నేహాంజని నిలిచింది. దీంతో ఆమెపై అందరూ ప్రశంసలు కురిపిస్తున్నారు.కాగా.. ఎపి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బుధవారం టెన్త్ ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడారు. ఈ సంవత్సరం 6,14,459 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 4,98,585 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. 81.14 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలియజేశారు. పార్వతీపురం మన్యం జిల్లా 93.90% ఉత్తీర్ణతతో తొలి స్థానంలో ఉందని, 1,680 పాఠశాలలు 100% ఫలితాలు సాధించాయని ఆయన ప్రశంసించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ మంత్రి లోకేష్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విజయం సాధించని విద్యార్థులు నిరుత్సాహపడవద్దని, జీవితంలో రెండో అవకాశం కూడా ఉంటుందని చెప్పారు. సప్లిమెంటరీ పరీక్షలు మే 19 నుంచి 28 వరకు జరుగుతాయని, విజయం సాధించడానికి మరొక అవకాశాన్ని అందిస్తున్నామని లోకేష్ వివరించారు.

## జమ్ముకాశ్మీర్ లోని పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా రాష్ట్ర బిజెపి నేతలు నిరసన




హైదరాబాద్ ఏప్రిల్ 23, ( వెలుతురు)

జమ్ముకాశ్మీర్ లోని పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా రాష్ట్ర బిజెపి నేతలు నిరసన చేపట్టారు. బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద బిజెపి నిరసన కార్యక్రమం చేపట్టింది.ఈనిరసనలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపిలు లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, తదితర నేతలు పాల్గొని పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చేతులకు నల్ల బ్యాడ్జీలు ధరించి.. చేతిలో జాతీయ జెండా పట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మృతులకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఉగ్రదాడి దోషులను విడిచిపెట్టే ప్రసక్తి లేదన్నారు. పాకిస్థాన్ అసమర్థ నాయకత్వానికి ఈ ఘటన పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని కిషన్ రెడ్డి తెలిపారు. కాగా, ఈ ఉగ్రదాడిలో ఇప్పటివరకు 26మంది ప్రాణాలు కోల్పోయారు. మరికొంత మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

## అంతిమ యుద్ధానికి సిద్ధమవుతున్న పోలీస్ బలగాలు, మావోయిస్టులు

- కర్రెగుట్టపై భద్రతా బలగాలు హెలికాప్టర్ ఏరియల్ సర్వే



ములుగు ఏప్రిల్ 23, ( వెలుతురు)

కర్రెగుట్టపై భద్రతా బలగాలు హెలికాప్టర్ ఏరియల్ సర్వే నిర్వహిస్తున్నాయి. పోలీస్ బలగాలు, మావోయిస్టులుఅంతిమ యుద్ధానికి సిద్ధమవుతున్నారు. మందు పాతరలు పేల్చడానికి మావోయిస్టులు సిద్ధంగా ఉన్నారు. మావో అగ్ర నేతలు హింస వద్దంటున్నారు. పౌర హక్కుల నేతలు కేంద్రంతో చర్చలు జరుపుతామని హామీ ఇస్తున్నారు. కర్రె గుట్టలపై మావోయిస్టు దళాలు ఉన్నాయి. మావోయిస్టు అగ్రనేత హిడ్మా దళం కూడా అక్కడే ఉన్నట్టు సమాచారం.గత రెండు రోజుల నుంచి చత్తీస్‌గఢ్, తెలంగాణ పోలీసు బలగాలు సంయుక్త ఆపరేషన్‌లో 50 వేల మంది భద్రతా బలగాలు కర్రెగుట్టలను చుట్టుముట్టారు. దీనితో కర్రెగుట్టల అడవిలో భీకరపోరు మొదలైంది. ములుగు జిల్లా వాజేడు వెంకటాపురం ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కడచూసినా పోలీసులే దర్శనమిస్తున్నారు. దీంతో ఏజెన్సీ ప్రాంతంలో ఏ క్షణం ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మావోయిస్టులకు కేంద్రంగా ఉన్న కర్రెగుట్టలను, అటునుంచి చత్తీస్‌గఢ్ పోలీస్ బలగాలు ఇటువైపు నుంచి తెలంగాణ పోలీస్ చుట్టుముట్టాయి. ఈ నేపథ్యంలో కర్రెగుటల్లో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకోనుందని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇరు రాష్ట్రాల సంయుక్త ఆపరేషన్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగలనుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఒకవైపు కేం ద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా 2025 సంవత్సరాంతానికల్లా మావోయిస్టులను పూర్తిగా మట్టుపెడతామని ప్రకటించిన విషయం విధేయతమే. ఈ నేపథ్యంలోనే పోలీసు బలగాలు సంయుక్త ఆపరేషన్ మొదలు పెట్టినట్లు సమాచారం.

# కసిరెడ్డి అప్రవూర్.. తూచ్... నాకేమి తెలియదు... వాళ్లు చెప్పినట్టే చేశా

గుంటూరు, , ఏప్రిల్ 23, ( వెలుతురు)

ఏపీలో వైసీపీ పాలనలో చీపు లిక్కరును మద్యం బాబులకు అంటగట్టి.. భారీ ధరలతో వారిని దోచేసిన విషయం తెలిసిందే. అన్నీ ప్రభుత్వ మద్యం దుకాణాలే కావడం.. ఎక్కడా ఫోన్‌పే, గూగుల్ పే వంటి వాటినివినియోగించకపోవడం ద్వారా భారీ ఎత్తున నగదు అక్రమాలు జరిగాయని అప్పట్లోనే ఆరోపణలు గుప్పుమన్నాయి. దీనిని కూటమి సర్కారు వచ్చాక దుమ్ముదులిపే ప్రయత్నం చేసింది. తాజాగా కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి..ఉరఫ్ రాజ్ కసిరెడ్డిని పోలీసులు మంగళవారం సాయంత్రం వరకు విచారించారు.వాస్తవానికి సోమవారం.. అర్ధరాత్రి నుంచి విడతల వారీగా రాజ్ కసిరెడ్డిని విచారిస్తూనే ఉన్నారు.. ఈ సందర్భంగా పలు కీలక విషయాలు కసిరెడ్డి వెల్లడించినట్టు అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. వీటిలో ప్రధానంగా నాలుగు అంశాలపై అధికారులు దృష్టి పెట్టారు. వైసీపీ హయాంలో తీసుకువచ్చిన మద్యం విధానానికి రూపకర్త ఎవరు? అన్నది ప్రధాన ప్రశ్న. దీనికి కసిరెడ్డి ఎలాంటి తడబాటు లేకుండానే.. వైసీపీ ముఖ్య నాయకులు అని చెప్పినట్టు తెలిసింది.ఈ ముఖ్య నాయకుల్లో వైవీ సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్ రెడ్డి ఉన్నట్టు చెప్పారు. అదేవిధంగా సాయిరెడ్డి పాత్ర కూడా ముఖ్యమేనని.. ఆయన ఇప్పుడు తప్పించుకుంటున్నారని చెప్పినట్టు తెలిసింది. ఇక, డిస్టిలరీల వ్యవహారం అంతా.. సాయిరెడ్డే చూసినట్టు చెప్పారని తెలిసింది. కొన్ని కొన్ని విషయాల్లో మాత్రమే తన ప్రమేయం ఉందని.. తాడేపల్లి, హైదరాబాద్, బెంగళూరు లలో జరిగిన నాలుగు కీలక సమావేశాల్లోనే నిర్ణయాలు జరిగాయని వివరించినట్టు సమాచారం.డిస్టరీల వ్యవహారం సహా.. మద్యం కేసుల విక్రయాలు.. లక్ష్యాలు పెట్టడం.. నిధుల విషయం అంతా.. కూడా.. తాడేపల్లికి చెందిన ముగ్గురు కీలక వ్యక్తులు చెబితేనే తాను చేసినట్టు కసిరెడ్డి వివరించినట్టు తెలిసింది. ఆ ముగ్గురులో అప్పటి సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కూడా ఉన్నట్టు చెప్పడం సంచలనంగా మారింది. ఎక్కడెక్కడ ఏయే మద్యం విక్రయించాలి. ఎవరిని వాడుకోవాలి.. అనే విషయాల్లో ఆయన ప్రమేయం ఉందని.. అదేవిధంగా అప్పటి ఓ మంత్రి ప్రమేయం కూడా ఉందని కసిరెడ్డి చెప్పినట్టు సమాచారం. ఇదిలావుంటే.. రాజ్ కసిరెడ్డి నుంచి మరిన్ని వివరాలు రాబట్టిన పోలీసులు కోర్టుకు ఆయనను హాజరుపరిచారు.



### అంబటి రాంబాబు వార్నింగ్

సీనియర్ ఐపీఎస్ అధికారి, ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్టుపై విపక్ష వైసీపీ ఘాటుగా స్పందించింది. ఈ మేరకు వైసీపీ కీలక నేత, మాజీ మంత్రి అంబటి కూటమి సర్కారే కక్షపూరితంగా అరెస్టు చేయించిందని సంచలన ఆరోపణ చేశారు. అంతేకాకుండా ఈ అరెస్టులకు మూల్యం చెల్లించుకోక తప్పదంటూ అంబటి ఏకంగా టీడీపీ అధినేత, సీఎం నారా చంద్రబాబునాయుడుకు వార్నింగులు జారీ చేశారు. చంద్రబాబుకు వార్నింగ్ ఇస్తూ అంబటి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఎంతమందిని అరెస్టు చేస్తారు? అరెస్టు చేసి జైల్లో పెడితే%% జైల్లోనే తాము చనిపోతామా? రాదా బెయిల్? ఏడాదికి అయినా వస్తుంది కదా. చాలా తప్పు చేస్తున్నారు చంద్రబాబు గారు, మీరు పెద్ద వారు. 75వ పుట్టిన రోజు జరుపుకున్న మీరు గుర్తు పెట్టుకోండి. దీనికి తగ్గ మూల్యం చెల్లిస్తారు" అంటూ అంబటి సంచలన వ్యాఖ్యలే చేశారు. అసలు పీఎస్ఆర్ ను అరెస్టు చేసిన కేసులో నిందితుడిగా ఉన్న కుక్కల విద్యా సాగర్ తో పాటు మరో ఇద్దరు ఐపీఎస్ అధికారులు కాంతి రాణా టాటా, విశాల్ గున్నీలకు కోర్టు ఇప్పటికే బెయిల్ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. కోర్టును ఆశ్రయించకుండా ఉన్న కారణంగానే పీఎస్ఆర్ ను అరెస్టు చేయగలిగారు అని ఆయన ఆరోపించారుఅయినా పీఎస్ఆర్ అరెస్టు చంద్రబాబు మార్గదర్శకత్వంలోనే జరిగిందని కూడా అంబటి ఆరోపించారు. చంద్రబాబు అరెస్టైన సమయంలో పీఎస్ఆర్ ఇంటెలిజెన్స్ చీఫ్ గా ఉన్నారని, తన అరెస్టులో కీలక భూమిక పీఎస్ఆర్ దేనని చంద్రబాబు భావించారని ఆయన ఆరోపించారు. తన అరెస్టుకు కారకుడిగా నిలిచారన్న భావనతోనే పీఎస్ఆర్ ను చంద్రబాబు అరెస్టు చేయించారన్నారు.

విధి నిర్వహణలో ఉన్న పోలీసులు కూడా ఓ విషయాన్ని గుర్తించాలని.. టీడీపీ సర్కారే ఎల్లకాలం అధికారంలో ఉండదని ఆయన హెచ్చరించారు. మరో పార్టీ ప్రభుత్వం వస్తే మీ పరిస్థితి ఏమిటని కూడా ఆయన పోలీసులను హెచ్చరించారు. ఐపీఎస్ లు అయినా, ఐఏఎస్ లు అయినా వారి పరిధి దాటి వ్యవహరించరని అంబటి అన్నారు. అయితే ఇప్పుడు మాత్రం పోలీసుల తీరు అందుకు విరుద్ధంగా ఉందని అంబటి ఆరోపించారు.

జగన్ కు ఎవరు దగ్గరగా ఉన్నా.. వారంతా తమకు శత్రువులే అన్నట్లుగానే చంద్రబాబు భావిస్తున్నారని అంబటి వ్యాఖ్యానించారు. అసలు ఏపీలో మద్యం కుంభకోణమే జరగకున్నా.., ఎదో జరిగిందంటూ రాజ్ కసిరెడ్డిని అరెస్టు చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వమే మద్యం విక్రయిస్తే అవినీతి ఎక్కడ జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. అయినా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడితే కదా అవినీతి జరిగేది అని కూడా ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు జరుగుతున్న వాటికంతా చంద్రబాబు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. చంద్రబాబు లేకుంటే ఆయన కుమారుడు లోకేశ్ అయినా మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కూటమి సర్కారు కేవలం 11 నెలల వ్యవధిలో వచ్చిన వ్యతిరేకత దేశంలో ఏ ఒక్క ప్రభుత్వం మీద రాలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న చంద్రబాబు.. అందులో భాగంగానే రోజుకు ఒకరిని అరెస్టు చేస్తూ ప్రజల దృష్టిని మరల్చుతున్నారని ఆయన ఆరోపించారు.

# ఎట్టకేలకు అఘోరి అరెస్ట్.. విచారిస్తున్న నార్సింగి పోలీసులు

హైదరాబాద్ ఏప్రిల్ 23, ( వెలుతురు)

తెలుగు రాష్ట్రాల్లో అఘోరి..అలియాస్ అల్లూరి శ్రీనివాస్ అంశం సంచలనంగా మారింది. అఘోరిని అరెస్ట్ చేయాలని పెద్దఎత్తున ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల నుంచి డిమాండ్ రావడంతో ఈ విషయంపై తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. అఘోరిపై నిఘా పెట్టిన పోలీసులు ఎట్టకేలకు ఉత్తరప్రదేశ్‌లో అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు ఇవాళ (బుధవారం) తీసుకువచ్చారు. నార్సింగి పోలీస్ స్టేషన్‌లో అఘోరీను ఏసీపీ విచారణ చేస్తున్నారు. సైబరాబాద్ మొకిలా పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసుతో పాటు బెదిరింపుల కేసులో అదుపులోకి అఘోరిని తీసుకున్నారు. ఓ మహిళ వద్ద నుంచి తాంత్రిక పూజల పేరుతో అఘోరి రూ. 10 లక్షలు కాజేసి మోసం చేశాడనే ఫిర్యాదులు కూడా పోలీసులకు అందాయి.ఉత్తరప్రదేశ్‌లోని ఉజ్జయినికి తీసుకెళ్లి తాంత్రిక పూజలు చేసినట్లు పోలీసులకు బాధిత మహిళ తెలిపింది. తనను మోసం చేసినట్లు ఫిబ్రవరి 25వ తేదీన మొకిలా పోలీసులకు బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. అఘోరితో పాటు శ్రీ వర్షిణిని కూడా హైదరాబాద్‌కు పోలీసులు తీసుకువచ్చారు. చాలా వివాదాల అనంతరం



అఘోరిని పోలీసులు అరెస్ట్ చేశారు. అఘోరి మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి రావడంతో అఘోరిని అరెస్ట్ చేయాలని ప్రజల నుంచి సైతం డిమాండ్ వచ్చింది. ప్రజల నుంచి డిమాండ్ రావడంతో ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు.నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో అఘోరిని విచారణ చేస్తున్నారు. ఈ విచారణలో పలు విషయాలు వెల్లడవుతున్నాయి. అఘోరి చేతిలో మోసపోయిన బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని పోలీసులు తెలిపారు.కాగా.. నార్సింగి పోలీస్ స్టేషన్‌లో అఘోరీ విచారణ ముగిసింది. చేవెళ్ల కోర్టుకు ఇవాళ అఘోరిని మోకిలా పోలీసులు తరలించారు. చేవెళ్ల కోర్టులో న్యాయమూర్తి ముందు అఘోరీని పోలీసులు హాజరుపర్చనున్నారు. అనంతరం అఘోరీని మోకిలా పోలీసులు రిమాండ్ చేయనున్నారు.

ఈ సందర్భంగా మీడియాతో అఘోరీ మాట్లాడారు. చట్టం తన పని తాను చేసుకుని పోతుందని చెప్పారు. తన కేసు కోర్టు పరిధిలో ఉందని.. ఇంతకన్నా ఎక్కువ మాట్లాడలేనని అన్నారు. తన భార్య వర్షిణి తనతోనే ఉంటుందని తెలిపారు.

# కాశ్మీర్ పహల్గాం లో జరిగిన ఉగ్రవాదుల దాడినీ బిజెపి ఖండించిన బిజెపి

### మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన ఆధ్వర్యంలో దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

వెలుతురు న్యూస్, చౌటుప్పల్ ఏప్రిల్ 23 :

పట్టణ కేంద్రం జాతీయ రహదారిపై మంగళవారం రోజు జరిగిన కాశ్మీర్ లో పహల్గాం నందు ప్రత్యేకంగా హిందు పర్యాటకులపై దాడిని ఖండిస్తూ భారతీయ జనతా పార్టీ మున్సిపల్ మరియు మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం రోజు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీతో పాటు పాకిస్తాన్ జెండాని దహనం చేయటమైనది పాకిస్తాన్ ఉగ్రవాదులకు మద్దతుగా నిలిచిన ఏ ఒక్కరిని, ఏ ఒక్క దేశాన్ని వదిలిపెట్టొద్దని నరేంద్ర మోడీ తెలియజేయడమైనది భారతదేశంలో ఉన్న పాకిస్తాన్ ప్రేమికులు ఈ దేశాన్ని వదిలి వెళ్లాలని బిజెపి డిమాండ్ చేస్తుంది ఈ దేశంలో ఉంటూ అన్ని అనుభవిస్తూ వివిధ పార్టీలో ఉన్న సంకరజాతి నాయకులు దేశాన్ని వ్యతిరేకించే నాయకులు తక్షణమే ఈ దేశం వదిలిపెట్టాలని భారతీయ జనతా పార్టీ నాయకులు డిమాండ్ చేస్తూ ఇలాంటి సంఘటన జరిగినప్పుడు కూడా కుటుంబాలకు గాని, దేశానికి గాని సానుభూతులు భద్రతా విషయంలో మద్దతు తెలిపే విషయం వదిలిపెట్టి, వైఫల్యాలను ఎండగడుతూ పాకిస్తాన్ కి మద్దతుగా హిందూ వ్యతిరేకులుగా ఈ దేశంలో ఉన్న మైనార్టీల ఓట్ల కోసం తప్పులు దేవులాడే వ్యక్తులు సంకరజాతి నాయకులు పద్ధతి మార్చుకోవాలనీ, ప్రతిపక్ష నాయకుడు విదేశాలలో ఉన్నప్పుడు ప్రతిసారి ఇలాంటి విపత్కర పరిస్థితులు ఏర్పడుతున్న ఈ దేశానికి మైనార్టీ ఓట్ల కోసం వివిధ పార్టీలు వారి వైపు ఉంటూ, మైనార్టీ పేద కుటుంబాల గురించి ఏనాడు ఆలోచించలే నేడు ముస్లిం మైనార్టీ లోని అత్యధిక పేద కుటుంబాల ఉద్దేశించి తీసుకునే నిర్ణయాలు ఒక్కోడు సవరణ బిల్లును జీర్ణించుకోలేని వివిధ పార్టీల నాయకులు ఒక్కటై బుధవారం రోజు హైదరాబాదులోని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎం కు మద్దతుగా నిలిచిన విధంగానే దేశంలో వారికి మద్దతుగా నిలిచి హిందువుల మనోధైర్యాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్న తీరును భారతీయ జనతా పార్టీ తీవ్రంగా



ఖండిస్తుంది ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు భారతీయులకు భారతదేశంలో ఉన్న అన్ని మతాల వారికి ముఖ్యంగా హిందువులకు మద్దతుగా నిలవని పార్టీల నాయకులని స్థానికంగా ఉన్న వివిధ పార్టీల నాయక కార్యకర్తలు వాళ్ళ నాయకులను నిలదీస్తూ చెప్పులతో కొట్టాలని బిజెపి డిమాండ్ చేస్తుంది మన కుటుంబం వరకు మన వరకు వస్తేనే ప్రమాదం కాదు ఇప్పటికే ఆరు రాష్ట్రాలు కాంగ్రెస్ పుణ్యమా అని దుర్భర పరిస్థితి ఎదుర్కొంటున్న హిందూమతం అక్కడ మైనార్టీలుగా మారిపోయాం ఇలాగనే ఉంటే మరో 20 సంవత్సరాల్లో మన పరిస్థితి ఏందో అర్థం చేసుకోవాలి మేలుకో భారతీయుడా, హిందువుడా ఇకనైనా మేలుకో జాగృతం అవుదాం జాతి నిర్మాణాన్ని ఏకం చేద్దాం, కాశ్మీర్లో ఉగ్రవాదులు దాడిలో మరణించిన హిందూ బంధువులకు నివాళులర్పిస్తూ పాకిస్తాన్ ఉగ్రవాద ప్రేరేపిత లష్కరోయిబా సంస్థ ను పురమిట్టించాలని భగవంతుని వేడుకుంటూ పాకిస్తాన్ జాతీయ పతాకాన్ని దగ్ధం చేయడమైనది ఈ కార్యక్రమంలో దూడల బిక్షం గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు రమణ గోని శంకర్, మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్, మండల అధ్యక్షులు కైరం కొండ అశోక్, గుజ్జుల సురేందర్ రెడ్డి, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, ముత్యాల భూపాల్ రెడ్డి, బాతరాజు సత్యం, ఉడుగు వెంకటేశం గౌడ్, ఊడుగు యాదయ్య గౌడ్, ఆలే చిరంజీవి, ఉబ్బు బుచ్చయ్య, తడక సురేఖ కట్ట కృష్ణ, కడారి ఐలయ్య, ఊడుగు విజయలక్ష్మి, షాగ చంద్రశేఖర్ రెడ్డి, దిండు భాస్కర్, ఫకీర్ శ్రీనివాస్ రెడ్డి, కాసుల వెంకటేశం, చికూరి వెంకటేశం, ఉష్కాగుల నాగరాజు, సప్పిడి లింగారెడ్డి, పర్ణ శ్రీనివాస్ రెడ్డి, అమృతం దశరథ, పోలోజు భాస్కర్ చారి, బుడ్డ సురేష్,గట్టు మొగలయ్య, కడవేరి పాండు, ఇడుదల ఐలయ్య ఓరగంటి భాను, వంగాల రమాకాంత్ , కానుగు శేఖర్ కానుగు కొండల్, ఇటుకల దామోదర్ రెడ్డి, గోపనగోని లింగస్వామి, బోల్లమౌని శ్రీశైలం చీకూరి సాయిరాం, చెరుకు సాయి,శివ, చిలువేరు సురేష్ తదితరులు పాల్గొన్నారు

## భూపాలపల్లి ఐ డీ వో సీ లో ఘనంగా పోషణ పక్షం కార్యక్రమం



**జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 23 వెలుతురు**

పోషణ పక్షం 8 ఏప్రిల్ 2025 నుండి 23 ఏప్రిల్ 2025 వరకు అవగాహన సదస్సులు, ఆరోగ్య సదస్సులు, పోషకాహార ప్రదర్శనలు, వైద్య శిబిరాలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా ఏప్రిల్ 23 చివరి రోజున పోషణ పక్షం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు హాజరై పోషణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని వివరించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.... భవిష్యత్ తరాల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు పోషణ పథకాలు కీలకం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సరైన పోషకాహారం అందించేందుకు అందరూ బాధ్యత వహించాలి. ప్రతి తల్లి తన శిశువును ఆరోగ్యవంతంగా పెంచేందుకు పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలి అన్నారు. అదనపు కలెక్టర్ శ్రీమతి విజయలక్ష్మి మాట్లాడుతూ.... పోషణ పక్షం సందర్భంగా గ్రామస్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు, ఆరోగ్య పరీక్షలు, పోషకాహార సదస్సులు నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకున్నాం. ఈ కార్యక్రమాల ద్వారా సమాజంలో పోషకాహార అవగాహన పెరుగుతుంది. పోషణ అభియాన్ ను విజయవంతం చేయడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్ల పాత్ర అమూల్యం" అని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ అధికారి మల్లేశ్వరి మాట్లాడుతూ.... పిల్లల్లో పోషకాహార లోపాలను నిర్ధారించేందుకు బరువు, ఎత్తు కొలతలు, హేమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించాం. గర్భిణులకు, బాలింతలకు ప్రత్యేకంగా పోషకాహార కిట్లు, అవగాహన పుస్తకాలు అందించామని ప్రత్యేకంగా 1000 రోజుల ప్రణాళికలు ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగింది అని వివరించారు సిడిపివో రాధిక మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో 15 రోజులపాటు పోషణ కార్యకలాపాలు, తల్లులకు పోషకాహార శిక్షణ, పోషణ పై నాటకాలు, పోటీలు నిర్వహిస్తాం. గ్రామస్థాయిలో ప్రతి కుటుంబాన్ని చేరి పోషకాహారాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక టీమ్స్ పనిచేస్తున్నాయి" అని తెలిపారు. తదుపరి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సీమంతాలు, అక్షరాబ్యాసం, అన్న ప్రాసన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది, కార్యక్రమంలో భాగంగా పోషకాహార ప్రదర్శన లు చేశారు వివిధ ధాన్యాలు, పప్పుదినుసులు, పండ్లు, కూరగాయలు, తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండే పోషకాహార వంటకాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఐ సీ డీ ఎస్ సూపర్వైజర్లు, సంక్షేమ శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు

## శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించినా కాల్పులకు దిగడం దుర్మార్గం

**పెద్దపల్లి ఏప్రిల్ 23 వెలుతురు**

శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించిన మావోయిస్టులపై కాల్పులకు దిగడం దుర్మార్గ చర్య అని పలువురు ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో పలు ప్రజాసంఘాలు, పౌర హక్కుల నాయకులు మాట్లాడారు. శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించిన మావోయిస్టు పార్టీతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని, కాల్పుల విరమణ, ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని వారు కోరారు. కేంద్ర ప్రభుత్వం ఛత్తీస్ ఘడ్, మహారాష్ట్ర గడ్చిరోలి, తెలంగాణ, ఒడిస్సా రాష్ట్ర అటవీ ప్రాంతాల్లో చేపట్టిన ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని గత కొన్ని రోజులుగా దేశంలోని మేధావులు, హక్కుల సంఘాలు, ప్రజాస్వామిక వాదులు, జర్నలిస్టులు, రచయితలు, ఎడిటర్లు, రాజ్యాంగాన్ని ఐదవ షెడ్యూల్, ఆరవ షెడ్యూల్ పెసా చట్టాలను కాపాడుకోవాలని ఆదివాసి హననాన్ని ఆపి వేయాలని, మావోయిస్టు ఉద్యమకారులను హతమార్చ డాన్ని నిలిపివేయాలని విజ్ఞప్తి చేస్తున్నారని అన్నారు. మావో యిస్టు పార్టీ శాంతి చర్చలకు సిద్ధమని, కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ పాటించాల ని కగార్ ఆపరేషన్ ఆపివేసి కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలకు విధి ఖరారు చేయాలని గతంలో లేఖ ద్వారా, బస్తర్ టాకీస్ అనే యూట్యూబ్ ఛానల్ ఇంటర్వ్యూలో నిన్న మావోయిస్టు పార్టీ ఉత్తర, పశ్చిమ సబ్ జోనల్ బ్యూరో ఇంచార్జ్ రూపేష్ వెల్లడించిన ప్పటికి నిన్నటి నుండి చత్తీస్ ఘడ్ తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్ట చుట్టూ పదివేల మంది సాయుధ పోలీసు బలగాలను హెలికాప్టర్లు, డ్రోణులను మోహరించి ఆదివాసులను, మావోయిస్టుల ను హతమార్చే లక్ష్యంతో జరుగుతున్న దాడిని నిలిపి వేసి శాంతి చర్చలు వెంటనే కొనసాగించాలని కోరారు. స మావేశంలో పౌర హక్కుల, ప్రజా సంఘాల నాయకులు మాదన కుమారస్వామి, శ్రీపతి రాజగోపాల్, పుల్ల సుచరిత, యాదవనేని పర్వతాలు, సత్యనారాయణ, కె.విశ్వనాథ్, బాలసాని రాజయ్య, గాండ్ల మల్లేశం, మార్వాడీ సుదర్శన్, రామిల్ల బాపు, ముడిమడుగల మల్లయ్య, పొన్నం రాజమల్ల య్య, వెల్తురు సదానందం, రత్న కుమార్, పులిపాక రవిందర్, పుట్ట రాజన్న పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ అధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టి బొమ్మ దగ్ధం.

**గోదావరిఖని ఏప్రిల్ 23 వెలుతురు**



లష్కరేతోయిబా ఉగ్రవాదులు కాశ్మీర్ లోని పహగంవ్ వద్ద టూరిస్టులపై దాడి చేసి 27 మందిని పొట్టన పెట్టుకున్న సంఘటన యావత్ భారత దేశాన్ని కలిచి వేసింది. ఈ సంఘటనను ఖండిస్తూ రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ ఆదేశాల మేరకు యూత్ కాంగ్రెస్ కార్పోరేషన్అధ్యక్షులు కౌటం సతీష్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టి బొమ్మను దహనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొంతల రాజేష్ మరియు మహంకాళి స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉగ్రవాద దాడిని కాంగ్రెస్ పార్టీ తరుపున ఖండిస్తున్నామన్నారు.. ఈ దేశంలో బీజేపీ ప్రభుత్వం ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నదని అనడానికి ఈ ఘటన నిదర్శనం అని..భారత దేశంలో ఎక్కడైనా ఎన్నికలు జరిగేముందు ఇలాంటి దాడులు జరుగుతుంటాయి. ఎన్నికల దృష్టి మళ్ళించి తిరిగి మేమే బాధ్యత వహిస్తున్నం అని అబద్ధాలు చెప్పడం బీజేపీ ప్రభుత్వానికి అలవాటు అని అన్నారు. ఈ ఘటన కి బాధ్యత వహిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ , మరియు కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సీనియర్ కాంగ్రెస్ నేతలు కాల్వలింగస్వామి, మదరబోయిన రవికుమార్, ధీటీ బాలరాజు తిప్పరపు శ్రీనివాస్, గట్ల రమేష్ ముస్తఫా, పెద్దెల్లి ప్రకాశ్, సింహాచలం, దూళికట్ట సతీష్ ,బెంద్రం రాజిరెడ్డి, బాబుమియా, గడ్డం శ్రీనివాస్, సాంబమూర్తి , బండి రాము బుర్ల శ్రీనివాస్ , మొహిద్ సన్నీ, గుండేటి శంకర్ ,ఫజల్ యువజన కాంగ్రెస్ నాయకులు నియోజకవర్గం అధ్యక్షుడు నాజిముద్దీన్, పెరుక జ్యోతి కుడిదుల శివ దాసరి విజయ్, మెంటం ఉదయ్ ,మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు బిళ్ళ కొమురయ్య ,నూనె రవి, గంగ మల్లేష్ , భరత్, శివ, బీసీ ఠాకూర్, చిత్ర, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదుల అనుమానితుల ఫోటోలు విడుదల

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 23 వెలుతురు**

ఉగ్రవాదుల అమానుష చర్య. వెతికి మరీ, గుర్తుపట్టిమరీ కాల్పులు జరిపిన హేయమైన చర్య- ప్రపంచానికి షాక్‌కు గురిచేసింది. జమ్ముకశ్మీర్ కనీవినీ ఎరుగని వికృతమైన ఉగ్రవాద దాడి. మొత్తం 28 మందిని పొట్టనబెట్టుకున్న ఈ ఘాతుకంపై ఆసేతుహిమాచలం కుతకుత ఉడికిపోతోంది. పహల్‌గామ్ ఉగ్ర దాడిలో పాకిస్తాన్ కుట్ర బట్టబయలైంది.. ముష్కరుల కోసం జల్లెడ పడుతున్న భద్రతా సంస్థలు అనుమానిత ఉగ్రవాదుల ఫోటోలతో పాటు వారి స్కెచ్‌లను విడుదల చేశాయి. ముగ్గురు ఉగ్రవాదులను ఆసిఫ్ ఫుజి, సులేమాన్ షా, అబు తల్హాగా గుర్తించారు. కాల్పులు జరిపిన మూకలో పాక్ ఆర్మీ రిటైర్డ్ జవాన్ ఆసిఫ్ ఉన్నట్లు గుర్తించారు. పహల్‌గామ్ ఉగ్రదాడి తర్వాత కీలక ఆధారాలను భద్రతా దళాలు సేకరిస్తున్నాయి.. నరమేధానికి నలుగురు ఉగ్రవాదులు పాల్పడినట్లు పేర్కొంటున్నారు. ఉగ్రవాదుల్లో ఆసిఫ్‌తోపాటు సులేమాన్, అబూ ఉన్నారని.. ఉగ్రవాదుల భాష, మాండలికం వివరాలను సేకరిస్తున్నారు. ప్రత్యక్షసాక్షుల నుంచి NIA బృందం పలు కీలక వివరాలను సేకరించింది. టెర్రరిస్టులు పష్తూన్ భాషలో మాట్లాడినట్లు గుర్తించారు.. పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులతో ఈ నలుగురు టచ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ ఉగ్రవాదులంతా నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా (ఎల్‌ఇటి) అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ సభ్యులుగా గుర్తించారు.కాగా.. జమ్ము కాశ్మీర్‌లో 120 మందికి పైగా విదేశీ ఉగ్రవాదులు ఉన్నట్లు ఇంటెలిజెన్స్ సమాచారం అందించింది. పాకిస్తాన్‌లో శిక్షణ పొందిన భారత్‌లోకి చొరబడినట్టు గుర్తించారు. వీరికి స్థానికంగా 10 మంది ఉగ్రవాదులు సహకరిస్తున్నారని.. కాశ్మీర్ లోయలో దాదాపు 75 మంది, జమ్మూ ప్రాంతంలో దాదాపు 50 యాక్టివ్‌గా ఉన్నట్టు గుర్తించారు. ఈ ఉగ్రవాదుల ఏరివేతకు భారీ ఆపరేషన్ చేపట్టేందుకు సైనిక బలగాలు సమాయత్తమవుతున్నాయి..పహల్‌గామ్ ఉగ్ర దాడి ఘటనపై ప్రపంచం మొత్తం స్పందిస్తోంది.. పలు దేశాల అధినేతలు, అధ్యక్షులు, ప్రతినిధులు ఉగ్ర దాడి ఘటనను ఖండిస్తున్నారు. అమెరికా, రష్యాతోపాటు.. చాలా దేశాల అధినేతలు ఉగ్రదాడిని ఖండించి.. భారత్ కు అండగా నిలుస్తామని ప్రకటించారు.

**పక్కా ప్లానింగ్ తోనే దాడి**

అప్పుడు అమెరికా అధ్యక్షుడి పర్యటన.. ఇప్పుడు ఉపాధ్యక్షుడి పర్యటన. ఉగ్రమూకలు సమయం చూసి దాడి చేసినట్లు తెలుస్తోంది. ప్రపంచ దేశాల నేతలు భారత్‌లో పర్యటిస్తున్న సమయంలో దాడి చేస్తే.. ఘటనను అంతర్జాతీయం చేయేచ్చునే కుట్ర దాగి ఉన్నట్లు స్పష్టమవుతోందిఅమెరికా ఉపాధ్యక్షుడు



%జీణ% వాన్స్ భారత్‌లో పర్యటిస్తున్న సమయంలో జరిగిన పహల్గామ్ దాడితో ప్రపంచ దేశాలు ఉలిక్కిపడ్డాయి. ఇప్పుడే కాదు 2000 ఏడాదిలోనూ ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. 2000 మార్చి 20న జరిగిన దాడిలో 36 మంది ప్రాణాలు పొట్టన పెట్టుకున్నారు ఉగ్రవాదులు. అనంత్‌నాగ్ జిల్లా ఛత్తీసింగ్‌పొరలో సిక్కు వర్గం లక్ష్యంగా ఉగ్రమూక దాడులకు పాల్పడింది. వాస్తవానికి ఆ సమయంలో అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. నాడు జమ్మూకశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయాలనే లక్ష్యంతోనే పాక్ ఈ దాడికి పాల్పడినట్లు భావించారు.పహల్గామ్ ఉగ్రదాడికి.. గతంలో జరిగిన ఛత్తీసింగ్‌పొర నరమేధానికి దగ్గరి సంబంధాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం భారత్‌లో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సతీసమేతంగా పర్యటిస్తున్నారు. మరోవైపు భారత ప్రధాని మోదీ సౌదీ అరేబియా పర్యటనకు వెళ్లారు. ఈ సమయంలో దాడి జరిగితే అంతర్జాతీయంగా చర్చ జరుగుతుందన్న ఉద్దేశంతో నరమేధానికి పాల్పడినట్లు తెలుస్తోంది. పైగా ఈ దాడిలో పురుషులనే టార్గెట్‌గా చేశాయి ఉగ్రమూకలు.జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో మంగళవారం(ఏప్రిల్ 22) ఒక పెద్ద ఉగ్రవాద దాడి జరిగింది. పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగింది. ఈ ఉగ్రవాద దాడిలో 28 మంది మరణించారు. మృతులు వివిధ రాష్ట్రాలకు చెందినవారు. దాడి జరిగిన వెంటనే, భద్రతా దళాలు మొత్తం ప్రాంతాన్ని ఖాళీ చేయించి, కూంబింగ్ ఆపరేషన్ ప్రారంభించాయి. ఉగ్రవాదులు పోలీసు యూనిఫాంలో వచ్చారని చెబుతున్నారు. దాడి వార్త అందిన వెంటనే, ప్రధాని నరేంద్ర మోదీ తన రెండు రోజుల సౌదీ అరేబియా పర్యటనను మధ్యలోనే ముగించుకుని ఢిల్లీకి తిరిగి వచ్చారు. కేంద్ర హెూంమంత్రి అమిత్ షా పహల్గాంలో ఉన్నారు. ఈ సంఘటనపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు

**పురుషులను కాల్చి చంపిన తీవ్రవాదులు**

**ముగ్గురు తెలుగువారు**

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో మంగళవారం జరిగిన ఉగ్రవాదుల దాడితో దేశం ఒక్కసారిగా ఉల్కిపడింది. ఈ దాడిలో 30 మంది మరణించాగా సుమారు 16 మంది గాయపడినట్లు సమాచారం. ఈ దాడిలో ఉగ్రవాదులు పురుషులపై మాత్రమే దాడి చేశారు. ఉగ్రవాద దాడుల బాధితుల్లో ఎక్కువ మంది పర్యాటకులే. మృతుల్లో ఇరు తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు ముగ్గురు ఉండగా.. గుజరాత్‌కు చెందిన ముగ్గురు పర్యాటకులతో పాటు పహల్గామ్‌కు చెందిన సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా కూడా ఉన్నారు. అయితే ఈ ఉగ్రవాద దాడిలో మహారాష్ట్రకు చెందిన ఐదుగురు మరణించారు. హేమంత్ సుహాస్ జోషి, సంజయ్ లక్ష్మణ్ లాలీ ముంబై నివాసితులు. అతుల్ శ్రీకాంత్ మోని, సంతోష్ జగ్దా, కస్తూబా గాంవోటే కూడా మహారాష్ట్ర వాసులు. ఇండోర్‌కు చెందిన సుశీల్ నథానియల్ కూడా ఉగ్రవాద దాడిలో మరణించాడు. అతను తన భార్య పుట్టిన రోజు జరపడానికి కాశ్మీర్ వెళ్ళాడు. సుశీల్ %జూ×జ% బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేసేవాడు.ఉగ్రవాద దాడిలో మరణించిన వ్యక్తుల్లో ఇద్దరు ఆంధ్రప్రదేశ్ కు చెందినవారు. ఒకరు విశాఖ వాసి రిటైర్డ్ ఉద్యోగ చంద్ర మౌళికాగా మరొకరు నెల్లూరుకి చెందిన మధుసూదన్లు.. కాగా హైదరాబాద్ లోని స్టేట్ బ్యాంక్ లో పని చేస్తున్న మనీష్ రంజన్ కూడా ఉగ్ర తూటాలకు బలి అయ్యారు. బీహార్ కి చెందిన మనీశ్‌రంజన్ కోఠిలోని సబ్సిడరీ ఇంటెలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ) ఆఫీస్ లో సెక్షన్ అధికారిగా పనిచేస్తున్నారు. తన కుటుంబ సభ్యులతో కలిసి కాశ్మీర్ పర్యటనకు వెళ్లారు. ఆయన్ని భార్య, ఇద్దరు పిల్లల ముందే ఉగ్రవాదులు కాల్చిచంపినట్లుగా తెలుస్తోంది. మనీష్ ఐడీ కార్డు చూసి మరీ ఉగ్రవాదులు కాల్పులు జరిపారని భార్య పిల్లలు చెబుతున్నారు.

# అనంత వైసీపీలో వర్గపోరు




**అనంతపురం, ఏప్రిల్ 23 వెలుతురు**

అనంతపురం ఉమ్మడి జిల్లాలో పెనుగొండ తెలుగుదేశం పార్టీకి అత్యంత పట్టున్న నియోజకవర్గం. అలాంటి చోట 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చిన సమయం లోనే పెనుకొండ లో కూడా మొట్టమొదటి సారి వైసిపి బోణీ కొట్టింది. దీంతో సరాసరి పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయనకీ సైతం జగన్ రెడ్డి మంత్రి పదవి కూడా కట్టబెట్టారు. ఇక్కడి వరకు అంతా సవ్యంగానే జరిగింది. తాను ఒకటి తలిస్తే దైవం మరొకటి తలచిందన్న చందంగా జగన్ రెడ్డి చేసిన ప్రయోగం బెడిసికొట్టింది. అనంతరం 2024 ఎన్నికల్లో శంకర్ నారాయణ కాదని అదే సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి కళ్యాణదుర్గం నియోజకవర్గం ఎమ్మెల్యే ఉష్రశ్రీ చరణ్‌నుకు చాన్స్ ఇచ్చారు. పెనుగొండ నియోజకవర్గం బీసీకి ( కురుబ ) కంచుకోట అలాంటి నియోజకవర్గంలో ఎప్పుడు తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేస్తూ వచ్చింది. వైయస్ ఆర్ పార్టీ ఆవిర్భావం నుంచి కూడా జగన్మోహన్ రెడ్డికి వెన్నంటే ఉంటూ వస్తున్న కృప శంకర్ నారాయణ కు 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి జగన్ బరిలో నిలిపాడు. ఆ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బి కే పార్ధసారధి పై శంకర్ నారాయణ అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. అనంతరం శంకర్ నారాయణ కు జగన్మోహన్ రెడ్డి మంత్రి పదవిని కూడా కేటాయించారు. 2024 ఎన్నికల్లో శంకర్ నారాయణ ను అనంతపురం పార్లమెంటు అభ్యర్థిగా బరిలోకి దింపి అదే సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి కళ్యాణదుర్గం నియోజకవర్గం ఎమ్మెల్యే ఉష్రశ్రీ చరణ్ ను పెనుగొండ నియోజకవర్గం వైఎస్ఆర్సిపి అభ్యర్థిగా జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు. కానీ ఆమె పరాజయం పాలయ్యారు. 2024 ఎన్నికల ఓటమి అనంతరం వైయస్సార్సీపీలో వర్గ విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. బలమైన అభ్యర్థి శంకర్ నారాయణ కాదని ఉషాశ్రీ చరణ్ కు టికెట్ కేటాయించినప్పటి నుంచి కూడా పెనుగొండ నియోజకవర్గం లో వర్గ విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. నియోజకవర్గ ఇన్చార్జిను మార్చాలన్న ప్రతిపాదన జగన్ వరకు వెళ్లినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం ఉషశ్రీ చరణ్ శ్రీ సత్యసాయి జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షురాలుగా కూడా కొనసాగుతున్నారు. పెనుగొండ నుంచి పరిటాల రవీంద్ర మూడు సార్లు వరుసగా విజయం సాధించారు. ఆయన హత్య తర్వాత రవి భార్య పరిటాల సునీత ఒక్కసారి పెనుగొండ నుంచి గెలుపొందారు. మొత్తంగా ఇప్పటివరకు 8 సార్లు పెనుగొండ నుంచి టీడిపి విజయం సాధించింది. ఉషాశ్రీచరణ్‌ను పెనుగొండకు మార్చిన జగన్ 2019 ఎన్నికల్లో మాజీ మంత్రి శంకర నారాయణ వైసీపీ నుంచి గెలుపొందారు. ఆ తర్వాత పరిణామాలు మారిపోయాయి. అనంతపురం ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన శంకరనారాయణ.. తిరిగి పెనుకొండ నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జ్ పదవి ఆశిస్తూ పావులు కదుపుతున్నార0. మండల స్థాయిలో తన వర్గీయులతో సమావేశాలు పెట్టి మాజీ మంత్రి ఉషాశ్రీ చరణ్‌కు వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారంట. పార్టీ అధ్యక్షుడు జగన్, ఇతర పార్టీ పెద్దల వద్దకు వెళ్లి నియోకవర్గ ఇన్చార్జ్ పదవి శంకర్ నారాయణకే ఇవ్వాలని పెనుగొండ సెగ్మెంట్ పరిధిలోని మండలాల నేతలు వత్తిడి తెస్తున్నారు. ఉష శ్రీ చరణ్ హైకమాండ్ దగ్గర తన పలుకుబడిని ఉపయోగించి పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తున్నారంటూ శంకరనారాయణ వర్గీయుల్ని కొందర్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయించారు. దాంతో పెనుగొండలో వారద్దరి మధ్య పరిస్థితి ఉప్పునిప్పులా తయారైందంటున్నారు . ఎప్పుడో వచ్చే ఎన్నికల కోసం వారిద్దరు అలా కుస్తీ పడుతుంటే.. ఇటీవల వారిద్దరికి పోటీగా మూడో వ్యక్తి సీన్లోకి వచ్చి ఇన్చార్జ్ పదవి కోసం పోటీ పడుతున్నారంట. ఉషాశ్రీ, శంకరనారాయణలను పెనుగొండ వైసీపీలో సైడ్ చేయడానికి శిల్పా అనే కొత్త నాయకురాలు ప్రయత్నిస్తున్నారనీ టాక్ నడుస్తోంది. ఇప్పటికే పెనుగొండ లో ఇద్దరు మాజీ మంత్రులు శంకర్ నారాయణ , ఉష శ్రీ చరణ్ లు రెండు వర్గాలుగా వైసీపీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే ఇన్చార్జ్‌గా ఉష శ్రీ చరణ్ ఏమాత్రం ప్రభావం చూపించలేకపోతున్నారని పార్టీ క్యాడర్ ఆరోపణలు గుప్పిస్తోంది.. ఈ క్రమంలో పెనుగొండ నియోజకవర్గం వైసీపీలో వర్గ విభేదాలను పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఏ విధంగా పరిష్కారం చూపుతాడో వేచి చూడాల్సి ఉంది.

## జగన్ యూ.. టర్న్ తప్పదా...

**ఒంగోలు, ఏప్రిల్ 23 వెలుతురు**

మూడు రాజధానుల నుంచి మద్యం వరకు.. వలంటీర్ వ్యవస్థ నుంచి సచివాలయాల వరకు.. వైసీపీ అధినేత జగన్ చేసిన ప్రయోగాలు వికటించిన విషయం తెలిసిందే. ఇవే.. ఆయనను నిలువునా ముంచాయన్నది మేధావుల నుంచి విశ్లేషకుల వరకు చెబుతున్న మాట. తాను పట్టిన కుందేలుకు మూడు కాళ్లే అన్నట్టుగా ఆయన అప్పట్లో వ్యవహరించారన్న విమర్శలు తెలిసిందే. ఏరాష్ట్రంలోనూ లేని విధంగా మూడురాజధానులు తెచ్చారు. దీనిపైకేంద్రం కూడా విస్మయం వ్యక్తం చేసింది.ఇక, వలంటీర్ వ్యవస్థను తెచ్చామని చెప్పినా.. వారిని పొడిగించని ఫలితంగా ఇప్పుడు వారికి దిక్కు మొక్కు లేకుండా పోయింది. పైగా ఎన్నికల సమయంలో కీలక నాయకుల కంటే కూడా.. వారే ఎక్కువై పోయారన్నట్టుగా జగన్ వ్యవహరించారు. ఫలితంగా కార్యకర్తలు పోయి..వైసీపీని వలంటీర్లు నడిపించే పరిస్థితి



వచ్చింది. ఇదో పెద్ద మైనస్‌గామారి.. ఎక్కడికక్కడ ఓటు బ్యాంకు చీలిపోయింది. ఫలితంగా వైసీపీ నాశనమైంది.ఇక, మరో రెండు కీలక విషయాలు.. మద్య నిషేధం.. చీప్ బ్రాండ్స్‌ను ఎక్కువ ధరలకు విక్రయించడం.. ఈ రెండు కూడా.. వికటించాయి. మద్యనిషేధం పేరుతో మంచి చేశామని జగన్ చెబుతున్నా.. ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు. ఇక, సచివాలయాలను నిర్మించి.. మంచి చేసినా.. దానివల్ల కూడా ప్రయోజనం రాబట్టుకోలేక పోయారు. సో.. మొత్తంగా జగన్ అనుసరించిన విధానాలు వివాదానికి దారితీశాయి. చివరకు ఆ పార్టీకి మైనస్ పై మైనస్ అయ్యాయి.ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల నాటికి.. జగన్ తన విధానాలను మార్చుకోక తప్పదన్న వాదన బలంగా వినిపిస్తోంది. "ఏం చేస్తారో.. ఏమో.. మా విధానాలు మారాల్సి ఉంది. ఏదీ ఒక్కటీ కూడా వర్కవుట్ కాలేదు. మా నాయకుడు ఆదిశగా అడుగులు వేస్తారని అనుకుంటున్నాం. ఇంకా మూడు రాజధానులని మేం ఎలా చెబుతాం" అని సీనియర్ నాయకుడు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు వ్యాఖ్యలు పరిగణనలోకి తీసుకుంటే.. మార్పు తప్పదన్న సంకేతాలు వస్తున్నాయి. సో.. జగన్‌తన విధానాలను మార్చుకునే టైం త్వరలోనే ఉందని కూడా అంటున్నారు. మరి ఏంచేస్తారు..? కొత్త విధానాలు ఏంటి? అనేది వేచి చూడాలి.

## సన్న ధాన్యానికి డిమాండ్


● సేకరణకు భారీగా ఏర్పాట్లు



**నిజామాబాద్, ఏప్రిల్23( వెలుతురు):**
ఈసారి దేశీయంగా ధాన్యానికి మంచి డిమాండ్ ఉందని భావిస్తున్నారు. దీనికితోడు జిల్లాలో సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. ప్రధానంగా సన్న ధాన్యానికి డిమాండ్ ఏటేటా పెరుగుతోంది. దీనికోసం వ్యాపారులుకూడా కొనుగోలుకు సిద్దంగా ఉన్నారు. మరోవైపు ధాన్యం సేకరణకు ఇప్పటినుంచే పక్కాగా కార్యాచరణ చేస్తున్నారు. గత యేడాదితో పోలిస్తే జిల్లాలో ఈసారి పెద్దఎత్తున దిగుబడులు వస్తాయన్నారు. సాధారణ సాగుకు మించి వరిసాగును రైతులు చేశారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటికే ఆయా శాఖల అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు స్పష్టమైన ఆదేశాలు వెళ్ళాయి. రైతులు నష్టపోకుండా అధికారులు పర్యవేక్షణ చేయాలని, నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకువచ్చే రైతులకు ప్రభుత్వం ప్రకటించిన పూర్తిస్థాయిలో మద్దతు ధర అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గతంలోనే సిఎం రేవంత్ ఆదేశాలు ఇచ్చారు. ఇటీవల మంత్రి ఉత్తమ్ కూడా కలెక్టర్లు ఆదేశాలు ఇచ్చారు. మరోవైపు జిల్లాలో ధాన్యం సేకరణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రైతులు వరికోతలు మొదలుపెట్టడంతో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేం దుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో సన్న రకం, దొడ్డురకం ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయనున్నారు. సాగుచేసిన సన్న రకం ధాన్యాన్ని రైతులు ఎక్కువగా ప్రైవేట్‌కే అమ్ముకు నేందుకు మొగ్గు చూపుతుండగా దొడ్డురకం ధాన్యాన్ని మాత్రం కొనుగోలు కేంద్రాల్లో కొనేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా శాఖల అధికారుల సమన్వయంతో కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. బోధన్ డివిజన్‌తో పాటు ఆర్మూర్ డివిజన్‌లోని కొన్ని మండలాల్లో సన్నరకాలను రైతులు బయటనే అమ్మే అవకాశం ఉంది. ధాన్యం తరలింపుకోసం జిల్లా వ్యాప్తంగా వాహనాలను అందుబాటులో ఉంచేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారి కూడా ధాన్యం దిగుబడులు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. మరోవైపు జిల్లాలో పసుపుకు డిమాండ్ పెరిగింది. ధరలు కూడా పెరగడంతో పసుపు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## చైనా టూ అమెరికా.. వయా కొరియా

**న్యూఢిల్లీ, ఏప్రిల్23( వెలుతురు):**




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రపంచ దేశాలపై ప్రతీకార సుంకాలు విధించారు. ఏప్రిల్ 2న రష్యా, ఉత్తర కొరియా మినహా మిగతా దేశాలపై ఈ టారిఫ్‌లు అమలులోకి వస్తాయని ప్రకటించారు. తర్వాత వారానికే టారిఫ్‌ల అమలు మూడు నెలలు వాయిదా వేశారు. అయితే అమెరికా సుంకాలకు ప్రతీకారంగా చైనా కూడా సుంకాలు విధించడం.. అమెరికా బెదిరింపులకు భయపడకపోవడంతో చైనాపై భారీగా సుంకాలు విధించారు. ప్రస్తుతం చైనా దిగుమతులపై 245 శాతం సుంకాలు అమలు చేస్తోంది. దీంతో చైనా సుంకాల భారం తప్పించుకునేందుకు కొత్త దారులు వెతుకుతోంది.అమెరికా చైనాపై 245 శాతం ప్రతీకార సుంకాలు విధించింది. ప్రపంచ వ్యాప్తంగా సుంకాల అమలు మూడు నెలలు వాయిదా వేసినా.. చైనాపై మాత్రం అమలు చేస్తోంది. దీంతో చైనా టారిఫ్‌ల భారం తప్పించుకునేందుకు అడ్డదారులు వెతుకుతోంది. ఇటీవల దక్షిణ కొరియాపై అమెరికా 25% టారిఫ్‌లు విధించింది. అయితే ఈ టారిఫ్‌లు ప్రస్తుతం అమలు ఆవడం లేదు. దీంతో చైనా తన ఉత్పత్తులను 'మేడ్ ఇన్ కొరియా' అని లేబుల్ చేసి, అమెరికా మార్కెట్‌లోకి చొప్పించేందుకు ప్రయత్నిస్తోంది. ఈ చర్య ద్వారా చైనా ఉత్పత్తులు తక్కువ టారిఫ్‌లతో అమెరికాలోకి ప్రవేశించే అవకాశం ఉంది, ఇది దక్షిణ కొరియా ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపవచ్చు.దక్షిణ కొరియా కస్టమ్స్ అధికారులు ఈ సమస్యను గుర్తించి, అమెరికా అధికారులతో సంయుక్త దర్యాప్తును ప్రారంభించారు. ఈ దర్యాప్తు ద్వారా చైనా ఉత్పత్తులపై తప్పుడు లేబులింగ్‌ను అడ్డుకోవడం, అలాగే అంతర్జాతీయ వాణిజ్య నిబంధనల ఉల్లంఘనను నిరోధించడం లక్ష్యంగా ఉంది. ఈ సమస్య వల్ల దక్షిణ కొరియా ఉత్పత్తుల పరిశ్రమలకు ఆర్థిక నష్టం, అలాగే అమెరికాతో వాణిజ్య సంబంధాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది.చైనా ఈ విధమైన వ్యూహాలను అవలంబించడం వల్ల అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలకు భంగం కలుగుతుంది. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనల ప్రకారం, ఉత్పత్తి యొక్క మూలం స్పష్టంగా తెలియజేయాలి. చైనా ఈ నిబంధనలను ఉల్లంఘిస్తూ, తప్పుడు లేబులింగ్‌తో అమెరికా మార్కెట్‌ను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. ఇది దక్షిణ కొరియాతో పాటు ఇతర దేశాల వాణిజ్య సంబంధాలపై కూడా ప్రభావం చూపవచ్చుదక్షిణ కొరియా మరియు అమెరికా ఈ సమస్యను నిశితంగా పరిశీలిస్తున్నాయి. చైనా ఉత్పత్తులపై కఠిన తనిఖీలు, అలాగే అంతర్జాతీయ సమాజంతో కలిసి చైనాపై ఒత్తిడి తీసుకొచ్చే అవకాశం ఉంది. ఈ సంఘటన వాణిజ్య యుద్ధాలను మరింత తీవ్రతరం చేసే అవకాశం ఉంది, దీని పర్యవసానాలు ఆసియా మరియు పశ్చిమ దేశాల ఆర్థిక వ్యవస్థలపై పడవచ్చు. ఈ సమస్య అంతర్జాతీయ వాణిజ్యంలో నీతి, నిజాయితీల ప్రాముఖ్యతను మరోసారి గుర్తు చేస్తోంది.

### చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న ఈటల రాజేందర్.

**హైదరాబాద్ ఏప్రిల్23( వెలుతురు):**
ఎంపి ఈటల రాజేందర్ బుధవారం ఉదయం చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మావారిని దర్శించుకున్నారు. కాశ్మీర్ లో జరిగిన ఉగ్రదాడి పై ఎంపి ఈటల మాట్లాడారు. ఈటల మాట్లాడుతూ 370 ఆర్టికల్ రద్దు చేసి జమ్ము కాశ్మీర్ భారత్ లో భాగమేనని మోడీ చాటి చెప్పారు. కాశ్మీర్ లో ప్రకృతి సంపదతో పర్యాటకం తిరిగి ప్రారంభమైంది. అలాంటి చోట ఉగ్రముకలు దాడి చేయడం అమానుష చర్య. భారత సహనాన్ని పరీక్షిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదు. భారత ప్రజల గుండెలను ఈ ఘటన గాయపరిచింది. ఆవేశంతో రగిలిపోతున్నారు. బాధితులు చిందించిన రక్తం వృథా పోదు. తప్పకుండా భారత్ ప్రతీకారం తీర్చుకుంటుందని అన్నారు.

# భగ్గుమంటున్న బంగారం ధరలు

**హైదరాబాద్, ఏప్రిల్23( వెలుతురు):**
బంగారం ధరలు భగ్గుమంటున్నాయి. పెళ్లి కూతురి మెడలో మెరిసే పసిడి, పేదింటి తల్లిదండ్రులకు కన్నీటి చుక్కలా మారుతోంది. తులం బంగారం లక్ష రూపాయలు పలుకుతుండటంతో, సామాన్యుడికి అది అందని ద్రాక్షలా తయారైంది. ఒకప్పుడు తమ స్థాయికి తగ్గట్టుగా బంగారు ఆభరణాలు కొని కూతుళ్లకు కానుకగా ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దీంతో చాలామంది పాత బంగారం అమ్మి, తక్కువ మొత్తంలో కొత్త ఆభరణాలు కొనుగోలు చేస్తున్నారు. ఈ ట్రెండ్ పెరిగిపోవడమే కాకుండా, తక్కువ క్యారెట్ల బంగారం వైపు మొగ్గు చూపుతున్నారు.పల్లెటూర్లలో బంగారానికి ఉన్న ప్రాధాన్యత ప్రత్యేకమైనది. అది కేవలం అలంకరణ వస్తువు మాత్రమే కాదు, గౌరవానికి, సంపదకు చిహ్నం. పెళ్లిళ్లలో బంగారు ఆభరణాలు ఒక ముఖ్యమైన ఆచారం. ఒకప్పుడు పెళ్లి అంటే ఇరు కుటుంబాల వారు తమ ఆర్థిక స్థోమతను చాటుకునేందుకు పోటీపడి బంగారం కొనేవారు. కనీసం 30-40 గ్రాముల నుంచి సంపన్నులైతే కిలోల కొద్దీ బంగారం ఇచ్చేవారు. కానీ ఇప్పుడున్న ధరలతో గ్రాము బంగారం కొనాలన్నా ఆలోచించాల్సిన పరిస్థితి.బంగారం ధరలు ఆకాశాన్నంటుతుంటే, పాత బంగారం అమ్మేవారికి మరో చిక్కు వచ్చి పడింది. పాత బంగారం అమ్మితే వచ్చే లాభంపై పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. కొనుగోలు చేసిన తేదీ నుంచి మూడేళ్లలోపు




విక్రయిస్తే షార్ట్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ వర్తిస్తుంది. ఇది మీ ఆదాయపు పన్ను శ్లాబ్ ప్రకారం ఉంటుంది. ఒకవేళ మూడేళ్ల తర్వాత విక్రయిస్తే లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ 20 శాతం వరకు ఉండవచ్చు. అంటే, పాత బంగారం అమ్మినా కొన్నా సామాన్యుడికి కష్టాలు తప్పేలా లేవు. ఒక తులం పాత బంగారం అమ్మితే తిరిగి ఎంత వస్తుందనేది దాని స్వచ్ఛత, అప్పటి మార్కెట్ ధరపై ఆధారపడి ఉంటుంది. అయితే, పన్నుల భారం కొంత మేర రాబడిని తగ్గిస్తుంది.బంగారం ధరలు మండిపోతుండటంతో, కొనుగోలుదారులు ఇప్పుడు 22 లేదా 24 క్యారెట్ల బంగారానికి బదులుగా 14 లేదా 18 క్యారెట్ల బంగారు ఆభరణాల వైపు చూస్తున్నారు. ఇవి స్వచ్ఛత తక్కువగా కలిగి ఉండటం వల్ల ధర కూడా తక్కువగా ఉంటుంది. తక్కువ బడ్జెట్‌లో పెళ్లిళ్లు లేదా ఇతర శుభకార్యాల కోసం బంగారం కొనాలనుకునే వారికి ఇవి ఒక ప్రత్యామ్నాయంగా మారుతున్నాయి. ఒకప్పుడు స్వచ్ఛమైన బంగారానికి మాత్రమే ప్రాధాన్యత ఉండేది. కానీ ఇప్పుడు ధరల పెరుగుదల కారణంగా ట్రెండ్ మారుతోంది. చాలామంది తక్కువ క్యారెట్ల బంగారంతో చేసిన ఆకర్షణీయమైన డిజైన్ల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇది బంగారం వ్యాపారులకు కూడా ఒక కొత్త మార్కెట్‌ను తెరిచింది.మొత్తానికి బంగారం ధరలు సామాన్యుడికి పెనుభారంగా మారాయి. పెళ్లిళ్లలో మెరిసే బంగారం ఇప్పుడు పేదింట కన్నీళ్లు తెప్పిస్తోంది. పాత బంగారం అమ్మితే పన్నుల భయం, కొనాలంటే ధరలు ఆకాశంలో ఉన్నాయి. దీంతో చాలామంది తక్కువ క్యారెట్ల బంగారం వైపు చూస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ ట్రెండ్ ఇంకెలా మారుతుందో చూడాలి

# ప్రతి గ్రామంలో రుణమాఫీ, రైతుభరోసా ఫ్లెక్సీలు..

**హైదరాబాద్, ఏప్రిల్23( వెలుతురు):**
తెలంగాణ ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాల లబ్ధిదారుల వివరాలతో ఊరూరా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనుంది. దీని కోసం వ్యవసాయ శాఖ రూ. 28.35 కోట్లు విడుదల చేసింది. ఒక్కో గ్రామానికి మూడు ఫ్లెక్సీల చొప్పున మొత్తం 8.10 లక్షల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నారు. రుణమాఫీ పొందిన 24.76 లక్షల మంది రైతుల పేర్ల కోసం రూ. 7.35 కోట్లు, రైతు భరోసా పొందిన 69.98 లక్షల మంది రైతుల పేర్ల కోసం రూ. 21 కోట్లు కేటాయించారు. అత్యధికంగా నల్గొండ జిల్లాకు రూ. 2.13 కోట్లు విడుదల చేశారు.తెలంగాణ ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన సంగతి తెలిసిందే. హామీ ఇచ్చిన మేరకు రూ. 2 లక్షల వరకు రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేశారు. దాదాపు 25 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.22 వేల కోట్లు జమ చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఇక రైతు భరోసా పథకం కింద.. అర్హులైన రైతులకు ప్రతి ఎకరానికి సంవత్సరానికి రూ. 12,000 పెట్టుబడి సాయం అందిస్తున్నారు.ఖరీఫ్, రబీ రెండు విడతల్లో రూ. 6,000 చొప్పున నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. 2025 జనవరి 26న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారు. తొలి విడతలో 563 గ్రామాల్లోని 4,41,911 మంది రైతులకు పెట్టుబడి సాయం అందించారు. 17.03 లక్షల మంది రైతులకు ఒక ఎకరా వరకు సాగు భూమికి నిధులు జమ చేశారు. విడుతల మొత్తం 69 లక్షల రైతుల అకౌంట్లలో కూడా డబ్బులు జమ చేశారు. ఈ నేపథ్యంలో ఈ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సర్కార్




భావిస్తోంది.అందులో భాగంగా తెలంగాణలో అమలవుతున్న పంట రుణాలమాఫీ, రైతుభరోసా పథకాలపై తెలంగాణ వ్యాప్తంగా ఊరూరా ఫ్లెక్సీల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది.

అందు కోసం రూ.28.35 కోట్లను వ్యవసాయశాఖ ద్వారా నిధులు విడుదల చేసింది. రూ.2 లక్షలలోపు రుణమాఫీ అయిన మొత్తం లబ్ధిదారులు, రైతుభరోసా సాయం పొందిన వారి వివరాలను ఈ ఫ్లెక్సీలలో ప్రదర్శించాలని సర్కార్ ఆదేశించింది. ఒక్కో గ్రామానికి మూడు చొప్పున ఫ్లెక్సీలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో ఫ్లెక్సీకి రూ.350 చొప్పున వెచ్చించాలని అధికారులు నిర్ణయించారు. మొత్తం 8.10 లక్షల ఫ్లెక్సీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.తెలంగాణలో 24,76,158 మంది రైతులకు రుణమాఫీ అయిందని సర్కార్ చెబుతోంది. వారి పేర్లను 2.10 లక్షల ఫ్లెక్సీలలో రాయించేందుకు వీలుగా మొత్తంగా రూ.7.35 కోట్లను విడుదల చేశారు. రైతుభరోసాలో 69,98,729 మందికి సాయం అందినందున వారి పేర్లను 6 లక్షల ఫ్లెక్సీలలో రాయించేందుకు వీలుగా రూ.21 కోట్లను విడుదల చేస్తున్నట్లు వ్యవసాయశాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. అత్యధికంగా నల్గొండ జిల్లాకు రూ.2.13 కోట్ల నిధులు విడుదల చేసింది.

# అంబేద్కర్ విగ్రహ సందర్శన నిలిపివేత

**హైదరాబాద్, ఏప్రిల్23( వెలుతురు):**
హైదరాబాద్ నడిబొడ్డున కొలువుదీరిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం.. రాజ్యాంగ నిర్మాతకు ఘనమైన నివాళిగా నిలుస్తోంది. ఈ స్ఫూర్తిదాయకమైన విగ్రహాన్ని సందర్శించేందుకు ప్రజలు ఎంతో ఉత్సాహం చూపుతున్నప్పటికీ.. అధికారులు తాత్కాలికంగా సందర్శనను నిలిపివేశారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రత్యేకంగా అనుమతించిన తర్వాత.. సోమవారం నుంచి మళ్లీ నిలిపివేయడానికి కారణం మ్యూజియంలో కొన్ని అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేయవలసి ఉండటమే కాకుండా.. స్వల్ప మరమ్మతులు కూడా చేపట్టవలసి ఉంది.ఈ పనులు పూర్తయిన వెంటనే విగ్రహ ప్రాంగణం పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలియజేశారు. ఈ విషయాన్ని నగర పౌరులు గమనించవలసిందిగా వారు విజ్ఞప్తి చేస్తున్నారు. డాక్టర్ అంబేద్కర్ ఆశయాలకు, ఆయన చేసిన అవిరళ పోరాటానికి ఒక సజీవ సాక్ష్యం ఈ విగ్రహం. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి మరువలేనిది. ఆయన రూపొందించిన భారత రాజ్యాంగం ఈ దేశానికి ఒక దిక్సూచిలాంటిది. అలాంటి మహనీయుడి స్మారక చిహ్నం హైదరాబాద్‌లో నెలకొల్పడం ప్రతి తెలంగాణా పౌరుడికి గర్వకారణం.హైదరాబాద్‌లో 2013 సంవత్సరం ఏప్రిల్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని నాటి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించిన విషయం తెలిసిందే. 125 అడుగుల



ఎత్తయిన ఈ విగ్రహం కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.146 కోట్లు ఖర్చు చేసింది.

ట్యాంక్ బండ్ ఎదురుగా కొలువుదీరిన అంబేద్కర్ విగ్రహం ఎత్తు 125 అడుగులు కాగా.. బేస్‌మెంట్ ఎత్తు 50 అడుగులు. ఎన్టీఆర్ గార్డెన్స్ పక్కన 11.4 ఎకరాల విస్తీర్ణంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహం బేస్‌మెంట్‌లోనూ మ్యూజియం, లైబ్రరీ, కాన్ఫరెన్స్ హాల్ ఏర్పాటు చేశారు. అంబేద్కర్ విగ్రహం నిర్మాణం కోసం 791 టన్నుల స్టీల్, 96 మెట్రిక్ టన్నుల ఇత్తడిని ఉపయోగించారు. ..!ప్రముఖ శిల్పులచే అత్యంత కళాత్మకంగా ఈ విగ్రహాన్ని మలచారు. అంతేకాకుండా.. విగ్రహం చుట్టూ ఒక విశాలమైన ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఈ ప్రాంగణంలో అంబేద్కర్ జీవిత చరిత్రను తెలిపే ఒక అద్భుతమైన మ్యూజియం, వివిధ సమావేశాల కోసం ఒక పెద్ద సమావేశ మందిరం వంటి సౌకర్యాలు కూడా ఉన్నాయి.సందర్శకులు అంబేద్కర్ జీవితంలోని ముఖ్య ఘట్టాలను తెలుసుకోవడానికి... ఆయన గొప్ప ఆశయాలను గుర్తుచేసుకోవడానికి ఈ ప్రదేశం ఒక ఉత్తమ వేదికగా నిలుస్తుంది. మ్యూజియంలో మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నారు. దీని తర్వాత మళ్లీ ప్రజలకు అందుబాటులోకి రానుందని అధికారులు తెలిపారు. అప్పటివరకు నగరవాసులు సహకరించాలని, అధికారులు తీసుకుంటున్న చర్యలను అర్థం చేసుకోవాలని కోరుతున్నారు.

## దాడి..బైసరన్ వ్యాలీనే ఎందుకు...

**శ్రీనగర్, ఏప్రిల్23( వెలుతురు):**
నరమేధానికి ఉగ్రవాదులు బైసరన్ లోయ పర్యాటక ప్రాంతాన్నే ఎంచుకోవడం వెనుక భద్రతాధికారులు అనేక కారణాలు చెబుతున్నారు. బైసరన్ లోయకు ఉన్న ప్రత్యేకతలే.. ఉగ్రవాదులు సులభంగా చొరబడి అమాయకులపై దాడి చేయడానికి వీలు కల్పించింది. ఇక్కడి పచ్చదనం పాడవ్వకూడదన్న ఉద్దేశంతో మోటార్ వెహికిల్స్‌ను అనుమతించరు. పహల్గామ్ టౌన్ నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న బైసరన్ లోయకు వెళ్లాలంటే కాలినడకన వెళ్లాలి. లేదంటే పర్యాటకులు పొట్టి గుర్రాలను ఆశ్రయించాల్సి ఉంటుంది. పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడం కోసం తీసుకున్న చర్యలు ఈ ప్రాంతాన్ని ఒంటరిని చేశాయి. ఫలితంగా అత్యవసర పరిస్థితుల్లో, ఊహించని ఘటనలు జరిగినప్పుడు చర్యలకు జాప్యం కలిగేలా చేశాయి. మంగళవారం కూడా సరిగ్గా అదే



జరిగింది.ప్రభుత్వాధికారులే లక్ష్యంగా.. పక్కా ప్లాన్‌తో బైసరన్ వ్యాలీలో ఉగ్రదాడి జరిగినట్లు తెలుస్తోంది. సైన్యం దుస్తుల్లో సమీప అడవుల నుంచి వచ్చిన ఉగ్రమూకలు.. టూరిస్టులపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపాయి. బాడీక్యామ్‌లు ధరించిన ముగ్గురు టెర్రరిస్టులు పర్యాటకులను ఒక చోట చేర్చి.. వివరాలను ఆరా తీసి మరి కాల్చి చంపి ఆ దృశ్యాలను రికార్డు చేశారు. అయితే ప్రత్యక్ష సాక్షులు మాత్రం ఆరుగురు ఉగ్రవాదులు దాడి చేసినట్లు చెప్తున్నారు.బైరసన్ వ్యాలీ దగ్గర వాహనాలు లేకపోవడంతో బాధితుల తరలింపు ఆలస్యమైంది. భద్రతా బలగాలు కూడా ఆలస్యంగానే అక్కడికి చేరుకున్నట్లు తెలుస్తోంది. ఈ లోపు దట్టమైన అడవుల్లో నుంచి ఉగ్రవాదులు పారిపోయారు. జమ్ము కశ్మీర్‌లోనే అంత్యంత ప్రశాంతమైన పర్యాటక ప్రాంతంగా పేరున్న బైసరన్ వ్యాలీపై ఈ ఘటనతో నీలినీడలు అలుముకున్నాయి. బైసరన్ వ్యాలీకి మినీ స్విట్జర్లాండ్‌గా పేరుంది. శీతాకాలంలో మంచు దుప్పటి పర్చుకునే ఈ ప్రాంతం.. మిగతా కాలంలో పచ్చిక బయళ్లతో, ఫైన్ చెట్లతో.. యూరప్ అల్పైన్ లోయలను తలపిస్తుంటుంది. అందుకే దేశం నలుమూలల నుంచి పర్యాటకలు వేసవిలో ఈ ప్రాంతానికి క్యూ కడుతుంటారు. ట్రెక్కింగ్ కోసం సాహస యాత్రికులు ఈ ప్రాంతానికి పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. దీన్నే ఆసరగా చేసుకున్న ఉగ్రమూక నరమేధం సృష్టించింది.

# హరిహరవీరమల్లు కోసం పవన్ డేట్స్

## త్వరగా పూర్తి చేసే పనిలో యూనిట్

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ప్రజంట్ ఇటు రాజకీయాల్లో బిజీగా ఉంటూనే.. ఒప్పుకున్న సినిమాలను ఒక్కోక్కటిగా పూర్తి చేసే ప్రయత్నంలో ఉన్నాడు. ఇందులో భాగంగా అత్యంత ఆలస్యం అవుతున్న సినిమా అంటే 'హరిహర వీరమల్లు'. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్ చేసి ఐదేళ్లు దాటింది. ప్రకటించిన కొన్ని నెలలకే షూట్ కూడా మొదలుపెట్టారు. కానీ రెండు భాగాలుగా అనుకున్న ఈ చిత్రంలో పార్ట్–1 కూడా పూర్తి కాలేదు. పలుమార్లు షూటింగ్‌కు బ్రేక్ పడుతూనే.. మధ్యలో దర్శకుడు కూడా మారారు. దీంతో ఇప్పుడంతలో ఈ సినిమా రిలీజ్ కాదని పవన్ అభిమానుల్లో నిరాశ మొదలైంది. కానీ తాజాగా ఓ న్యూస్ వైరల్ అవుతుంది.. సమాచారం ప్రకారం 'హరిహర వీరమల్లు' కోసం పవన్ కాల్ షీట్స్ కేటాయించాడట. మేలో ఇంకొన్ని రోజుల్లోనే పవన్ షూట్‌కు హాజరు కానున్నాడట. ఆయనో పది రోజులు వరుసగా చిత్రీకరణకు వస్తే బ్యాలెన్స్ షూట్ అంతా అయిపోతుంది. మాట అయితే ఇచ్చాడు కానీ పవన్ వచ్చే వరకు ఏదీ గ్యారెంటీ– లేదు కాబట్టి కొత్త రిలీజ్ డేట్ ప్రకటించడం లాంటిదేమీ చేయట్లేదు చిత్ర బృందం. ఇక ఈ సినిమాలో అందాల భామ నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తోండగా బాబీ డియోల్, నోరా ఫతేహి ఇతర ముఖ్య పాత్రపోషిస్తున్నారు. ఈ సినిమాకు ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఏఎం.రత్నం ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.





# క్రిష్ ఘాటిని కూడా వదిలేశాడా?

టాలీవుడ్ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి  టాలెంట్ గురించి మనకు తెలిసిందే. ఆయన తెరకెక్కించిన ఏ మూవీ అయిన ప్రేక్షకుల మదిలో అలా నిలిచిపోతాయి. ఏ దర్శకుడు టచ్ చేయని కాన్సెప్టులతో క్రిష్ పలు సినిమాలు తెరకెక్కించాడు. కానీ ప్రస్తుతం క్రిష్ –టైమింగ్ బాలేదు. ముందుగా పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో 'హరిహర వీరమల్లు' చిత్రం తెరకెక్కించగా,ఈ మూవీతో క్రిష్ జాతకం మారిపోవడం ఖాయం అని అనుకున్నారు. 9 నెలల్లో ఈ ప్రాజెక్ట్ ని పూర్తి చేద్దామని స్పీడ్ మీద ఉన్న క్రిష్.. ఫస్ట్ హాఫ్ ని చాలా తొందరగా పూర్తి చేశారు. కానీ మధ్యలో కరోనా, లాక్ డౌన్ అంటూ గ్యాప్ వచ్చింది. ఇక అంత క్లియర్ అయిన టైంలో క్రిష్ ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్నాడు.. ఇక ఈ మూవీ నుండి తప్పుకున్న తర్వాత అనుష్కతో 'ఘాటి' మొదలు పెట్టాడు. గత ఏడాది టీజర్ కూడా విడుదల చేసి మూవీపై భారీ అంచనాలు పెంచాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ కూడా మూవీపై ఆసక్తి కలిగేలా చేసింది. అయితే ఈ చిత్రాని ఏప్రిల్ 18న రిలీజ్ చేయబోతున్నట్టు మేకర్స్ గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ఈ సినిమా పరిస్థితి అయోమయంగా మారింది. ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ చేస్తారనే దానిపై క్లారిటీ కూడా లేకుండా పోయింది. అంతే కాదు ప్రేక్షకుల్లో కొత్త అనుమానాలు మొదలయ్యాయి. ఏంటంటే ఈ మూవీ కూడా మధ్యలో ఆగిపోయిందా?, లేకపోతే క్రిష్ ఈ చిత్రం నుంచి తప్పుకున్నాడా? అనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. అసలు క్రిష్ సినిమాలకే ఎందుకు ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఇంతకు ముందు కూడా బాలీవుడ్ లో ఆయన 'మణికర్ణిక' వంటి చారిత్రాత్మక చిత్రాన్ని మొదలు పెట్టి, మధ్యలో వెళ్ళిపోయాడు. మిగిలిన సినిమా కంగనా రనౌత్ దర్శకత్వం వహించారు. 'హరిహర వీరమల్లు'ని మధ్యలోనే వదిలిపెట్టేశారు. ఇక ఇప్పుడు ఘాటీని కూడా మధ్యలోనే వదిలేశారా అన్న ప్రశ్న తలెత్తుతుంది

# హిట్-3 ప్రమోషన్‌లో నాని బిజీ

టాలీవుడ్ హీరో నాచురల్ స్టార్ నాని ప్రస్తుతం ఒక వైపు నిర్మాతగా సినిమాలు తెరకెక్కిస్తూనే మరొకవైపు హీరోగా వరుసగా సినిమాల్లో నటిస్తున్నాడు. అందులో విడుదలకు సిద్ధంగా ఉన్న చిత్రం 'హిట్ 3'. గతంలో విడుదల అయిన రెండు సినిమాలకు కొనసాగింపుగా దీనిని తెరకెక్కించారు. హిట్ ఫ్రాంచైజీలో తొలి రెండు చిత్రాలు ఇన్వెస్టిగేషన్ తరహాలో తీస్తే, ఇప్పుడు రాబోతున్న 'హిట్ 3' మాత్రం యాక్షన్, రక్తపాతం అనేలా తీశారు. ఇప్పటికే పిల్లలు సినిమా చూసేందుకు రావొద్దని నాని క్లారిటీ కూడా ఇచ్చేశారు. అయితే మే 1న పాన్ ఇండియా లెవెల్ లో ఈ సినిమా విడుదల కానున్న సందర్భంగా, గత కొద్ది రోజులుగా సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో భాగంగా బిజీ బిజీగా ఉన్నారు నాని. వరుస ఇంటర్వ్యూలలో పాల్గొంటు మూవీకి సంబంధించిన విషయాలు పంచుకుంటున్నాడు. ఇందులో భాగంగా తాజాగా ఓ మీడియాతో ముచ్చటించిన నాని దర్శకుడు శైలేష్ గురించి ఆసక్తికర  విషయాలు పంచుకున్నాడు.  'శైలేష్ ఫస్ట్ షెడ్యూల్‌లో చాలా మొహమాట పడేవాడు. అన్నింటికీ నన్ను మెంటార్‌లా చూసి అన్నీ నన్ను అడిగేవాడు. నన్నేం అడగకు అని ఒక్కసారి గట్టిగా క్లాస్ పీకాను. నీకు మంచి సినిమా సెన్స్ ఉందని చెప్పాను. అప్పటి నుంచి రెచ్చిపోయాడు' అని నాని చెప్పుకొచ్చాడు. ఇకపోతే హిట్ 3 లో నాని హీరోగా నటించడంతో పాటు– నిర్మాతగా కూడా వ్యవహరించిన విషయం తెలిసిందే. ఇక ఈ మూవీతో కూడా నాని సక్సెస్ సాధిస్తాననే నమ్మకంగా ఉన్నారు. ప్రమోషనల్ కంటెంట్ చూస్తుంటే నాని నమ్మకం నిజమయ్యేలా కనిపిస్తుంది.




# కోలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న సుహాస్


టాలీవుడ్ యంగ్ హీరో సుహాస్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా ఎంట్రీ ఇచ్చి అనతి కాలంలోనే బాగానే గుర్తింపు తెచ్చుకున్నాడు. దీంతో తొలిసారిగా 'కలర్ ఫోటో' మూవీతో హీరోగా ఎంట్రీ ఇచ్చాడు. మొదటి చిత్రంతోనే నటన పరంగా తెలుగు ప్రేక్షకులను కట్టిపడేశాడు. అలా వరుస అవకాశాలు అందుకుంటూ, సుహాస్ నటించిన చాలా సినిమాలు కూడా మంచి సక్సెస్ గా నిలిచాయి. దీంతో దర్శక నిర్మాతలు కూడా సుహాస్ తో సినిమాలు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. తాజాగా హీరో సుహాస్‌కి సంబంధించిన ఒక వార్త వైరల్ గా మారింది. అదేమిటంటే కోలీవుడ్ నటుడు సూరి హీరోగా 'మండాడి' మూవీలో నటిస్తున్నాడు. ఇంతకు ముందు పలు విజయవంతమైన చిత్రాలను నిర్మించిన ఎల్‌రెడ్ కుమార్ తన ఆర్‌ఎస్ ఇన్ఫోటెయిన్‌మెంట్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రానికి క్రియేటివ్ ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తుండగా, ఆయన శిష్యుడు, మణి మారన్ పుగళేంది కథ, దర్శకత్వం బాధ్యతలను నిర్వహిస్తున్నారు. నటి మహిమా నంబియార్ కథనాయికగా నటిస్తోంది. అయితే ఈ చిత్రం ద్వారా సుహాస్ కోలీవుడ్ కు పరిచయం అవుతున్నారట. ఈ మూవీలో సుహాస్ చాలా ముఖ్యమైన పాత్రలో నటించబోతున్నాడు. కాగా త్వరలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. దీంతో తాజాగా ప్రోమోను కూడా విడుదల చేశారు.



# కాశ్మీర్ దుర్ఘటనపై విజయ్ ఆవేదన

### రెండేళ్ల క్రితం అక్కడ ప్రశాంతంగా బర్త్‌డే చేసుకున్నా

పహల్గాంలో మంగళవారం ప్రకృతి అందాలను చూస్తోన్న పర్యటకులపై ఉగ్రవాదులు ఒక్కసారిగా దాడికి తెగబడ్డారు. ఈ దాడిని సినీ సెలబ్రిటీలు ఖండిస్తున్నారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన ఆ ప్రాంతంతో తన అనుబంధాన్ని హీరో విజయ్ దేవరకొండ తాజాగా గుర్తుచేసుకున్నారు. ఈ దాడి ఘటన తన మనసును కలిచివేస్తోందంటూ పోస్ట్ పెట్టారు. రెండేళ్ల క్రితమే తన పుట్టినరోజును పహల్గాంలో సెలబ్రేట్ చేసుకున్నాడు. ఓ సినిమా షూటింగ్‌లో భాగంగా అక్కడికి వెళ్లిన నేను.. కశ్మీర్‌లోని అందమైన ప్రాంతంలో అక్కడి ప్రజల స్వచ్ఛమైన నవ్వుల మధ్య నా పుట్టినరోజు చేసుకున్నాను. స్థానికంగా ఉండే కశ్మీరీ స్నేహితులు నన్ను ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. నిన్న ఆ ప్రాంతంలో జరిగినది విని నా హృదయం పగిలిపోయింది. ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో వచ్చి కాల్పులు జరపడం సిగ్గుచేటు–. ఇలాంటి పిరికి వాళ్లను త్వరలోనే అంతమొందిస్తారని ఆశిస్తున్నా. భారతదేశం ఉగ్రవాదానికి ఎప్పటికీ తలవంచదు. బాధిత కుటుంబాలకు మేం అండగా నిలుస్తాం అని విజయ్ దేవరకొండ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.




# కాశ్మీర్ నరమేధంపై చిత్రపరిశ్రమ దిగ్భ్రాంతి

## దాడిని ఖండిస్తూ నటీనటుల పోస్ట్

పహల్గాం లో మంగళవారం జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ సినీ ప్రముఖులు పోస్ట్‌లు పెడుతున్నారు. ఇది క్షమించరాని క్రూరమైన చర్య అని చిరంజీవి అన్నారు. బాధితులను చూస్తుంటే తన హృదయం బరువెక్కుతోందని ఎన్టీఆర్ తెలిపారు. ఇలాంటి అనాగరిక చర్యల వల్ల వచ్చే కోపాన్ని అణచివేయలేక పోతున్నానంటూ జాన్వీకపూర్ ఆవేదన వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు తన సానుభూతి తెలియజేస్తూ అల్లు అర్జున్ పోస్ట్ పెట్టారు. జమ్మూకశ్మీర్‌లోని ప్రకృతి అందాలను చూసి పరవశిస్తోన్న వారిపై పాశవికంగా దాడి చేసి 28 మందిని పొట్టన పెట్టుకున్నారు. ఈ పెనువిషాదంపై సినీప్రముఖులు స్పందిస్తున్నారు. దాడిని ఖండిస్తూ మృతులకు తీర్చలేనిదని చిరంజీవి అన్నారు.  బాధితులను చూస్తుంటే నా హృదయం బరువెక్కుతోంది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. శాంతి కోసం ప్రార్థిస్తున్నా అని ఎన్టీఆర్ అన్నారు.ఇది క్షమించరాని చర్య. ఈ ఉగ్ర చర్యపై అందరూ మౌనం వీడండి. వారిపై ప్రతీకారం తీర్చుకోవాలి. వారికి తగినవిధంగా బుద్ధి చెప్పాలని సంజయ్‌దత్ అన్నారు. ఈ దాడి భయంకరమైనది. అమాయకులను చంపడం చాలా దారుణం. మృతుల కుటుంబాల కోసం ప్రార్థిస్తున్నానని అక్షయ్ కుమార్



సంతాపం తెలుపుతున్నారు. దీనిపై వీడియో చేస్తూ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ కన్నీరు పెట్టుకున్నారు. ఇది మాటలకు అందని విషాదమన్నారు. ఇది క్షమించరాని చర్య అని చిరంజీవి పోస్ట్ పెట్టారు.  28 మంది అమాయకులను బలిగొన్న దారుణమైన ఈ దాడి హృదయ విదారకమైనది. ఇది క్షమించరాని క్రూరమైన చర్య. మరణించిన వారి కుటుంబాలకు నా సానుభూతి తెలియజేస్తున్నా. వారి నష్టం అన్నారు. పహల్గాం ఉగ్రదాడి గురించి తెలిసి దిగ్భ్రాంతి చెందాను. నా హృదయం బరువెక్కింది. సైనిక దుస్తుల్లో వచ్చి కాల్పులు జరపడం అన్యాయం. ఇలాంటి అనాగరిక చర్యల వల్ల వచ్చే కోపాన్ని అణచివేయలేకపోతున్నా. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల కోసం ప్రార్థిస్తున్నా. మేమంతా మీ వెంట ఉన్నాం. ఈ బాధ నుంచి కోలుకునే ధైర్యాన్నివ్వాలని దేవుడిని వేడుకుంటున్నాని జాన్వీ కపూర్ పేర్కొన్నారు.  అమాయక పర్యటకులపై




జరిగిన పిరికిపంద ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. నాగరిక ప్రపంచంలో ఉగ్రవాదానికి చోటు ఉండకూడదు. ఈ దుర్మార్గపు చర్య ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని సోనూసూద్ తెలిపారు. పహల్గాం ఎంతో అందమైన ప్రదేశం. అక్కడ జరిగిన ఈ దాడి గురించి తెలిసి నా గుండె పగిలిపోయింది. బాధిత కుటుంబాలకు నా సానుభూతి తెలియజేస్తున్నా. మృతి చెందిన అమాయకుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని అల్లు అర్జున్ తెలిపారు.



# చేపల జాతరతో గుబాళింపు

- ఏటా జరుపుకునే పండగలో ఐకమత్యం



**ఏలూరు,ఏప్రిల్23( వెలుతురు):**
పండగలు,జాతరలు అందరినీ కలిసికట్టుగా ఉంచే సంప్రదాయాలుగా చూడాలి. కలిసుంటే కలదు సుఖం అన్న నానుడి తగ్గట్టుగా .... ఏలూరు ఏజెన్సీలో చేపల జాతర జరిగింది. ఏకంగా 10 గ్రామాలు కలిసి చేపల జాతర జరుపుకున్నారు.. ప్రతీ ఇంట్లోనూ చేపల పులుసు గుభాళింపే..! ఏలూరు ఏజెన్సీలో ప్రజలు ఏడాదికి ఒక్కసారి సమిష్టిగా ఊరి చెరువులో చేపల జాతర నిర్వహిస్తుంటారు. వేసవి కాలంలో చెరువులో చేపలు పెట్టడం జాతరలా ఉంటుంది. పెద్ద ఎత్తున తరలివచ్చిన జనం నీళ్లలోకి దిగి, చేపలను పట్టి, వాటిని కుప్పలుగా పోసేవాళ్లు. సమానంగా జరిగే పంపకాలు.. ఇదే సమయంలో వినిపించే చలోక్తులు, సరదాగా సాగే దెప్పిపొడుపులు, అన్యాయం జరిగిందంటూ సాగే అలకలు. చిన్నా, పెద్దా , బాబాయ్, పిన్ని, అత్తా మామ అంటూ వినిపించే పలకరింపులు.. మొత్తం ఒక జాతరలా కనిపిస్తుంది. వచ్చిన చేపలన్నిటినీ అంతా సమానంగా పంచుకుని వండుకుని తింటారు. ఆ గ్రామాల్లో ప్రతి ఇంటా చేపల వంటకాలే..! ఈ ఏడాది కూడా అదే వాతావరణంలో కుక్కునూరు మండలం చీరవల్లిలో చేపలను పెట్టారు. ఈ చెరువు పరిసరాల్లో దాదాపు 10 గ్రామాల ప్రజలు నివసిస్తుంటారు. వర్షాకాలంలో నిండుకుండలా ఉండే చెరువులు వేసవిలో నీరు ఇంకిపోయి వెలవెల పోతుంటాయి. అదే సమయంలో గిరిజనులు అక్కడకు చేరుకుని చెరువులో దిగి చేపలను పెడతారు. బచ్చా, శీలావతి, కొరమేను, వాలుగా ఇలా చాలా రకాల చేపలు దొరికాయి. ఇక, వాటిని పంచుకుని ఎవరి వాటా వాళ్లు చేపలను తామర ఆకుల్లో ఉంచుకుని ఇళ్లకు తీసుకువెళ్లారు. ఇక మంచి ఘుమఘుమలాడే చేపల కూర వాసనలతో కుక్కునూరు పరిసర ప్రాంతాలు గత రెండు రోజులుగా గుభాళించాయి..

# ఉగ్రదాడిలో వైమానిక దళ సభ్యుడు మృతి

- తేజ్ హైల్యాంగ్‌గా గుర్తింపు
- అరుచాల్ సిఎం పెమా ఖండూ సంతాపం



**శ్రీనగర్,ఏప్రిల్23( వెలుతురు):**
పహల్గామ్ దాడిలో మరో భారత వైమానిక దళ సభ్యుడు కార్పోరల్ తేజ్ హైల్యాంగ్ (30) చనిపోయాడు. సెలవుల్లో భార్యతో కలిసి కాశ్మీర్‌లోని పహల్గామ్ వెళ్లాడు. మంగళవారం మధ్యాహ్న సమయంలో భార్యతో కలిసి విహరిస్తుండగా ఒక్కసారిగా ఉగ్రవాదులు తెగబడ్డారు. ఈ దాడిలో అరుణాచల్ ప్రదేశ్‌లోని జిరోల్‌లోని తాజాంగ్ గ్రామానికి తేజ్ హైల్యాంగ్ ప్రాణాలు వదిలారు. ప్రస్తుతం ఆయన శ్రీనగర్‌లోని భారత వైమానిక దళ స్థావరంలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. తేజ్ హైల్యాంగ్ మృతి పట్ల అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండు సంతాపం తెలిపారు. తేజ్ హైల్యాంగ్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతికి గురైనట్లు- చెప్పారు. భార్యతో ఉండగా ఉగ్రవాదులు ప్రాణాలు తీయడం విచారకరమన్నారు. దేశం కోసం ధైర్యంగా, గౌరవంగా సేవ చేశారని గుర్తుచేశారు. ఈ మరణవార్త కుటుంబ సభ్యులకు తీరని లోటు అన్నారు. దు:ఖ సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని.. ఓదార్పు ఇవ్వాలని కోరారు.పహల్గామ్ ఉగ్రవాద దాడిలో దాదాపు 8-10 మంది ఉగ్రవాదులు పాల్గొన్నట్లు- సమాచారం. 5-7 మంది ఉగ్రవాదులు పాకిస్తాన్‌కు చెందినవారని అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది. దాడి చేసింది తామేనని ది రెసిస్టెన్స్ ఫ్రంట్(టీ-ఆర్ఎఫ్) ప్రకటించింది. ఈ ఉగ్రవాదులంతా కేవలం పురుషులను మాత్రమే టార్గెట్ చేసుకున్నారు. మహిళలు, పిల్లల్ని ఏమి చేయలేదు. వారి జోలికి కూడా రాలేదు. ఒకవేళ అడ్డొచ్చినా.. ఏమీ చేయలేదు. ఇక ముస్లిమా కాదా అని వివరాలు అడిగి తెలుసుకున్నాకే కాల్చారు. ఐడీ కార్డులో పేరు చూసి మరీ కాల్చేశారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. పర్యాటక కేంద్రమైన పహల్గామ్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగిన కాల్పుల్లో ఇద్దరు విదేశీయులు సహా 28 మంది మరణించారు. యూఏఈ, నేపాల్‌కు చెందిన ఇద్దరు విదేశీయులు ఉన్నట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఇక ఈ ఉగ్ర దాడిని ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి. భారత్‌కు అండగా ఉంటామని అమెరికా, రష్యా, ఇజ్రాయెల్ ప్రకటించాయి. ఇక సౌదీ అరేబియా పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ.. ఉగ్ర దాడి వార్త తెలుసుకున్న వెంటనే హుటాహుటినా భారత్‌కు బయల్దేరి వచ్చేశారు. బుధవారం అత్యవసర కేబినెట్ సమావేశానికి పిలుపునిచ్చారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు.

# కాశ్మీర్ దాడి ఇంటిలిజెన్స్ వైఫల్యం

- ఎఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ

**హైదరాబాద్,ఏప్రిల్ 23( వెలుతురు):**
జమ్మూకాశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడిని ఎఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ ఖండించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ఇంటెలిజెన్స్ వైఫల్యం వల్లే ఈ దాడి జరిగింది. ఈ దాడికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఈ దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి' ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పహల్గామ్‌లో నిన్న జరిగిన ఉగ్రదాడిలో అమాయక ప్రజలు చనిపోయారు. వారిని విచక్షణారహితంగా చంపారు. చంపేముందు ఉగ్రవాదులు వారి మతం గురించి అడిగారు. ఈ దాడిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. ప్రభుత్వం ఉగ్రవాదులను శిక్షిస్తుందని ఆశిస్తున్నాము. ఉగ్రవాదుల చేతిలో మరణించిన వారి కుటు-ంబాలకు మేము అండగా నిలుస్తాము. గాయపడిన వారు వీలైనంత త్వరగా కోలుకోవాలని కోరుకుటు-న్నాము అని ఒవైసీ అన్నారు.

# బాధిత కుటుంబాలకు ఓదార్పు

- అండగా ఉంటామన్న అమిత్ షా



**శ్రీనగర్,ఏప్రిల్ 23( వెలుతురు):**
పహల్గామ్ బాధిత కుటుంబాలతో శ్రీనగర్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా భేటీ అయ్యారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అంతకముందు పహల్గామ్ మృతుల భౌతికకాయాలకు అమిత్ షా నివాళులర్పించారు. అమిత్ షా.. పహల్గామ్ సంఘటనాస్థలిలో పర్యటించారు. అమిత్ షా వెంట జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఉన్నారు. ఇక భద్రతా దళాలు ఆ ప్రాంతాలను తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. అంతేకాకుండా ఉగ్రవాదుల కోసం జల్లెడ పడుతున్నారు. పహల్గామ్ ఉగ్రవాద దాడిలో దాదాపు 8-10 మంది ఉగ్రవాదులు పాల్గొన్నట్లుగా గుర్తించారు. వీరిలో 5-7 మంది ఉగ్రవాదులు పాకిస్తాన్‌కు చెందినవారని అనుమానిస్తున్నట్లు- సమాచారం. దాడి చేసింది తామేనని ది రెసిస్టెన్స్ ఫ్రంట్(టీ-ఆర్ఎఫ్) ప్రకటించింది. ఈ ఉగ్రవాదులంతా కేవలం పురుషులను మాత్రమే టార్గెట్ చేసుకున్నారు. మహిళలు, పిల్లల్ని ఏమి చేయలేదు. వారి జోలికి కూడా రాలేదు. ఒకవేళ అడ్డొచ్చినా.. ఏమీ చేయలేదు. ఇక ముస్లిమా? కాదా? అని వివరాలు అడిగి తెలుసుకున్నాకే కాల్చారు. ఐడీ కార్డులో పేరు చూసి మరీ కాల్చేశారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. పర్యాటక కేంద్రమైన పహల్గామ్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగిన కాల్పుల్లో ఇద్దరు విదేశీయులు సహా 28 మంది మరణించారు. యూఏఈ, నేపాల్‌కు చెందిన ఇద్దరు విదేశీయులు ఉన్నట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఇక ఈ ఉగ్ర దాడిని ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి. భారత్‌కు అండగా ఉంటామని అమెరికా, రష్యా, ఇజ్రాయెల్ ప్రకటించాయి. ఇక సౌదీ అరేబియా పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ.. ఉగ్ర దాడి వార్త తెలుసుకున్న వెంటనే హుటాహుటినా భారత్‌కు బయల్దేరి వచ్చేశారు. బుధవారం అత్యవసర కేబినెట్ సమావేశానికి పిలుపునిచ్చారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు.

# కాశ్మీర్ వివాదాన్ని అంతర్జాతీయం చేసే కుట్ర

- వాన్స్ పర్యటనలో ఉండగా ఉగ్రదాడి
- క్లింటన్ పర్యటన సమయంలోనూ ఇదే తరహా ఘటన




**న్యూఢిల్లీ,ఏప్రిల్ 23( వెలుతురు):**
జమ్మూ కాశ్మీర్ వివాదాన్ని అంతర్జాతీయ స్థాయిలో తెలియజేసేందుకే విదేశీ అతిథుల భారత పర్యటనలో ఉండగానే ఉగ్రవాదులు దాడులు చేస్తున్నారనే అనుమానాలు బలపడుతున్నాయి. అయితే, ప్రధాని మోడీ విదేశీ పర్యటనలో ఉండటం.. అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ భారత్‌లో పర్యటన కొనసాగుతున్న సమయంలో పహల్గాం దాడి జరగడం గమనార్హం.అయితే, ఇలాంటి ఘటన సుమారు పాతికేళ్ల క్రితం జరిగింది. అంటే, 20 మార్చి 2000వ సంవత్సరంలో అనంత్‌నాగ్ జిల్లాలో ఛత్తీసింగ్‌పొరలో ఉగ్రవాదులు సుమారు 36 మందిని చంపేశారు. నాడు సిక్కు కమ్యూనిటీలోని వారే ఉగ్రవాదులకు టార్గెట్ అయ్యారు. వాస్తవానికి అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ న్యూ ఢిల్లీ పర్యటనలో ఉండగా.. అప్పుడు జమ్మూకశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయాలనే లక్ష్యంతోనే పాకిస్థాన్ ఈ దాడికి పాల్పడినట్లు- అందరు భావించారు. కాగా, నాడు ఉగ్రమూకలు భారీ తుపాకులు, రెండు సైనిక వాహనాల్లో ఛత్తీసింగ్‌పొర గ్రామంలోకి చొరబడి.. ఇంటింటికీ తిరిగి తమను సైనిక సిబ్బందిగా చెప్పుకొని.. తనిఖీల నిమిత్తం పురుషులు అందరు బయటకు రావాలని ఆదేశాలు జారీ చేశారు.. ఆ తర్వాత వారందరినీ గురుద్వారా దగ్గర ఉంచి కాల్చి చంపేశారు. దీంతో భారత సైన్యమే ఆ పని చేసిందన్నట్లు- అక్కడిని వారిని ఈ ఉగ్రవాదులు నమ్మించేలా నినాదాలు కూడా చేశారు. కానీ, చివరికి దర్యాప్తు సంస్థలు పాక్ ఉగ్రవాదుల హస్తం ఉన్నట్లు తేల్చాయి. కాగా, ఇప్పుడు.. పహల్గాంలో ఉగ్ర దాడికి.. గతంలో జరిగిన ఛత్తీసింగ్‌పొర నరమేధానికి చాలా దగ్గరి సంబంధాలు ఉన్నట్లు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం భారత్‌లో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కుటు-ంబంతో కలిసి పర్యటిస్తున్నారు. మరోవైపు భారత ప్రధాని మోడీ సౌదీ అరేబియా పర్యటనకు వెళ్లారు. ఇదే సరైన సమయంగా భావించిన ఉగ్రవాదులు ఇండియన్ ఆర్మీ దుస్తుల్లో వెళ్లి పహల్గామ్‌కు వచ్చిన పర్యటకుల మతంతో పాటు ఐడీలను పరిశీలించి మరీ దాడి చేశారు. హిందువులనే టార్గెట్ గా చేసుకుని చంపేయడం గమనార్హం.

# కాశ్మీర్ నరమేధంపై క్రికెటర్ల దిగ్భ్రాంతి

## ఉగ్రమూకలు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిక



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 23( వెలుతురు):**
పహల్గాం ఉగ్రదాడిని భారత క్రికెటర్లు తీవ్రంగా ఖండించారు. ఇలాంటి సమయంలోనే ఐక్యంగా కలిసి ఉండాలని.. బాధ్యులు తప్పకుండా భారీ మూల్యం చెల్లించుకుంటారని సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టారు. కశ్మీర్‌లో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు మంగళవారం భీకర దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. మధ్యాహ్నం 3 గంటల సమయంలో సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు పర్యటకులను చుట్టుముట్టి.. అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 28 మంది ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఈ ఘటన గురించి తెలియగానే దిగ్భ్రాంతికి గురయ్యా. పర్యటకులపై దాడి అత్యంత దారుణం. బాధిత కుటు-ంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. ఇలాంటప్పుడే మనమంతా ఐక్యంగా ఉండి, మానవత్వం ప్రదర్శించాలని యువరాజ్ సింగ్ అన్నాడు. ప్రతిసారీ అమాయకులే జీవితాలను కోల్పోతున్నారు. కశ్మీర్‌లో చోటుచేసుకున్న ఘటన హృదయవిదారకంగా ఉంది. కొన్ని రోజుల కిందటే అక్కడ ఉన్నా. ఈ బాధ మరింత ఎక్కువగా ఉందని ఇర్ఫాన్ పఠాన్ ఆవేదన వ్యక్తం చేశాడు. పహల్గాం దాడి ఘటన తీవ్రంగా బాధించింది. అమాయకమైన పర్యటకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. బాధిత కుటుంబాలకు అండగా నిలుద్దాం. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిద్దాం అని వీరేంద్ర సెహ్వాగ్‌సంతాపం తెలిపాడు. ఉగ్రదాడి వార్త వినగానే నా హృదయం విరిగిపోయింది. బాధిత కుటు-ంబసభ్యుల గురించే నా ఆలోచన. శాంతి చేకూరాలని ఆశిస్తున్నా. దేశంలో హింసకు తావులేదని కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్ పేర్కొన్నారు. బాధిత కుటుంబాల కోసం మనమంతా అండగా నిలుద్దాం. ఎవరైతే ఈ దురాఘాతానికి బాధ్యులో వారు తప్పకుండా మూల్యం చెల్లించుకుంటారు. తప్పకుండా భారత్ స్ట్రయిక్ అవుతుందని గౌతమ్ గంభీర్ అన్నాడు.

# కాశ్మీర్ నరమేధంతో సరిహద్దుల్లో పాక్ దళాలు

- భారీగా యుద్ధవిమానాల తరలింపు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 23( వెలుతురు):**
జమ్ముకాశ్మీర్ లో ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. అనంతనాగ్ జిల్లాలోని పహల్గాం ఉగ్రదాడితో మాకు సంబంధం లేదని ప్రకటించింది. ఈ మేరకు పాక్ రక్షణశాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ ప్రకటన విడుదల చేశారు. ఉగ్రదాడిలో ప్రాణనష్టం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. మరోవైపు, ఉగ్రదాడి నేపథ్యంలో పాక్ అప్రమత్తమై సరిహద్దులకు యుద్ధ విమానాలను తరలిస్తోంది. సరిహద్దుల వెంట భారీగా సైన్యాన్ని మోహరిస్తున్న పాక్.. కాశ్మీర్ సరిహద్దుకు యుద్ధ విమానాలు తరలిస్తున్నట్లు సమాచారం. కాగా, ఈ ఉగ్రదాడిని ప్రపంచ దేశాలు ఖండించాయి. భారత్ కు తమ మద్దతును ప్రకటించాయి. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్.. మోడీకి ఫోన్ చేసి పరిస్థితులపై ఆరా తీశారు. ఈ క్రమంలో ఎల్ఓసీ సమీపంలో ఉన్న అన్ని ఉగ్రవాద శిక్షణా కేంద్రాలను ఖాళీ చేయాలని పాకిస్తాన్ ఆర్మీ సీనియర్ అధికారులు వెంటనే సూచనలు ఇచ్చారని సమాచారం. గత రాత్రి ఆలస్యంగా.. ఉగ్రవాదులను సమీపంలోని గ్రామాలకు తరలించమని ఆదేశాలు జారీ అయ్యాయని తెలుస్తోంది. భారత్ ప్రతీకారం తీర్చుకునే అవకాశం ఉన్నందున.. అంటే సర్జికల్ స్ట్రయిక్స్ లేదా వైమానిక దాడి వంటి చర్యలు తీసుకుంటారనే భయంతో పాక్ ఈ చర్యలకు పునుకొంది. ఉగ్రవాద దాడులపై ప్రతిస్పందించడంలో భారతదేశం ఆలస్యం చేయదని గత చరిత్ర చూస్తే ఇట్టే అర్థమవుతోందనే అభిప్రాయం పాక్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# ఎఫ్ ఎల్ ఎన్ కు నాలుగు పాఠశాలలు ఎంపిక




**కమాన్ పూర్, ఏప్రిల్ 23( వెలుతురు):**
కమాన్ పూర్ మండలంలోని నాలుగు పాఠశాలలు ఎఫ్ ఎల్ ఎన్ కు ఎంపికైనట్లు జిల్లా విద్యాధికారి డి మాధవి తెలిపారు. ఎంపికైన పాఠశాలల కు ఎంపిక పత్రాలను జిల్లా విద్యాధికారి మాధవి రాజాపూర్ పాఠశాల హెచ్ఎం మెరుగు రాజమౌళికి అందజేశారు. 2024-25 విద్యా సంవత్సరం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ప్రతిష్టాత్మకంగా (ఎఫ్ ఎల్ ఎన్) ప్రాథమిక భాష మరియు గణిత సామర్థ్యాల బోధన భాగంగా జిల్లా విద్యాధికారి డి మాధవి ఆధ్వర్యంలో అన్ని పాఠశాలలో కనీస సామర్థ్యాలను పెంపొందించే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం జరిగింది. ఇందులో భాగంగా బేస్ లైన్ మిడ్లైన్ మరియు ఎండ లైన్ పరీక్షలను జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తూ డిఆర్పీలు మరియు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు మండల విద్యాధికారులు పకడ్బందీ పర్యవేక్షణ చేస్తూ కార్యక్రమం యొక్క విధి విధానాలు ఏ విధంగా అమలుపరచబడుతున్నాయో పరిశీలిస్తూ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు తగిన సూచనలు చేస్తూ కార్యక్రమాన్ని కొనసాగించడం జరిగింది. అంతే పరీక్ష తదనంతరము కమాన్ పూర్ మండలం నుండి నాలుగు పాఠశాలలు ఎంపీపీ ఎస్ రాజాపూర్ ఎంపీపీ ఎస్ ములకలపల్లి ఎంపీపీ ఎస్ గొల్లపల్లి మరియు ఎంపీ యుపిఎస్ నాగారం పాఠశాలలో చాంపియన్లుగా ఎన్నికవ్వడం జరిగింది. మంగళవారం పెద్దపల్లి కలెక్టర్ ఆడిటోరియంలో ఈ పాఠశాలల యొక్క విద్యార్థుల సామర్థ్యాలను ప్రత్యక్షంగా అధికారుల ముందు ప్రదర్శన చేసి పరీక్షించడం మరియు అభినందించడం జరిగినది.

# అకాల వర్షాలతో రైతులపై దెబ్బ

- భారీగా నష్టపోయిన రైతులు

**హైదరాబాద్,ఏప్రిల్23( వెలుతురు):**
ఇటీవలి అకాల వర్షాలు, వడగళ్లు బీభత్సం సృష్టించాయి. ఈవర్షాలు మరోసారి రైతులను నట్టేట ముంచాయి. చేతికొచ్చిన పంటను నేలపాలు చేశాయి. వడగండ్లు, ఈదురుగాలులతో కురిసిన వానలు తీరని నష్టాన్ని మిగిల్చాయి. కోతకొచ్చిన మక్క, వరి చేన్లు నేలకొరిగి పోగా.. కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసుకున్న వడ్లు తడిసిపోయాయి. వాన నీటిలో కొట్టుకు పోయాయి. పక్వానికొచ్చిన మామిడి కాయలన్నీ రాలిపోయాయి. చేతికొచ్చిన పంట నీటిపాలు కావడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ, సూర్యపేట్ జిల్లాలో రైతులు భారీగా నష్టపోయారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట అకాల వర్షాలకు ఆగమవుతుండడంతో లబోదిబోమని మొత్తుకుంటున్నారు రైతులు. ఇకపోతే పలుచోట్ల సకాలంలో నీరు అందక పంటలు ఎండిపోయాయి. ఈ సంవత్సరం అకాల వర్షాలకు తోడు నీటి సమస్య కూడా తోడయ్యింది. అకాల వర్షాలతో పంటలు దెబ్బతినడంతో అధికారులు, నేతు జిల్లాల్లో స్వయంగా పరిశీలించారు. త్వరలోనే పంట నష్టాలన్ని లెక్కకట్టి పరిహారం అందచేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చెప్పారు. అకాల వర్షాలతో ఎన్నడూ లేని విదంగా పూర్తి పంట నష్టపోయిన ప్రాంతాల్లో బిఆర్ఎస్ నేతలు ఆయా ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పరిస్థితులను పరిశీలించారు. రైతులలో భరోసా నింపారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వం తమను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. పలు జిల్లాల్లో వాణిజ్య పంటలు నేలకొరిగాయి.



Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com